www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★




తూర్పు లద్దాఖ్ సరిహద్దుల్లో శాంతికి భారత్–చైనా కమాండర్స్ అంగీకారం 12

మళ్లీ మొదలికొచ్చిన గాజా యుద్ధ కథ! 02

సంపుటి 08, సంచిక: 328 | గురువారం | 30-10-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# మొంథా బీభత్సం



## తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు

- ఆకాశానికి చిల్లుపడినట్లు రోజంతా ముసురు
- హన్మకొండ జిల్లా భీమదేవరపల్లిలో 41.9 సెం.మీ. వర్షపాతం
- డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో పట్టాలపైకి భారీగా వరదనీరు, గోల్కొండ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిపివేత
- ఖమ్మం జిల్లా నిమ్మవాగులో కొట్టుకుపోయిన డిసిఎం, డ్రైవర్ గల్లంతు
- డిండి ప్రాజెక్టు సమీపంలో కోతకు గురైన జాతీయ రహదారి
- వాహనాల దారిమళ్లింపు
- దేవరకొండ డివిజన్ కొమ్మేపల్లి గ్రామంలో ఎస్‌టి వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను చుట్టుముట్టిన వరద
- 8 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసిన వాతావరణ శాఖ







ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రాన్ని మొంథా తుఫాన్ పూర్తిగా కమ్మివేసింది. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం తెల్లవారు జాము నుంచి ప్రారంభమైన వర్షం రోజంతా ఎడతెరపి లేకుండా కురిసింది. పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురువగా మరికొన్ని జిల్లాల్లో రోజంతా ముసరు కొనసాగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. భీమదేవరపల్లిలో 41.9, కల్లెడలో 38.58 సెం.మి. ఉర్సులో 34.38, రెడ్లవాడలో 33.90, ధర్మసాగర్‌లో 33.28, కాపుల కనపర్తిలో 32.90, వర్ధన్నపేటలో 30.45 సెం.మి. వర్షపాతం నమోదు కాగా, రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో 10 సెం.మిల నుంచి 41 సెం.మిలకు పైగా వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలో భారీ వర్షం కురువడంతో డోర్నకల్ స్టేషన్‌లో వరద నీరు పట్టాలను ముంచెత్తింది. దీంతో భద్రతా కారణాలరీత్యా రైల్వే అధికారులు డోర్నకల్ రైల్వేస్టేషన్లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను నిలిపివేశారు. ఖమ్మం జిల్లాలో నిమ్మవాగు వద్ద వంతెనను దాటే క్రమంలో వరద నీరు తరువాయి 2లో



### రైతులకు నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు

అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండాలి

మొంథా తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా

మొంథా తుపాన్ ప్రభావం నేపథ్యంలో వరి కోతల సమయం కావడంతో పాటు పలు చోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసిన రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లాలలో మొంథా తుఫాన్ ప్రభావం అధికంగా ఉండగా, హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారిమళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు తరువాయి 2లో

మొంథా తుపాను వాయుగుండంగా బలహీనపడింది. గడచిన 6 గంటలుగా ఇది 12 కి.మీ వేగంతో కదులుతోంది. తెలంగాణ భూభాగంపై దీని ప్రభావం కొనసాగుతోంది. భద్రాచలానికి 50 కి.మీ, ఖమ్మం జిల్లాకు 110 కి.మీ దూరంలో ఇది కేంద్రీకృతమైంది. ఒడిశాలోని మల్కన్‌గిరికి 130 కి.మీ దూరంలో ఉంది. ఉత్తర వాయవ్య దిశగా కదిలి క్రమంగా బలహీనపడనుంది. దీని కారణంగా రాగల 12 గంటల్లో తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు పడనున్నాయి. తెలంగాణలో ఒకట్రెండు ప్రాంతాలకు ఆకస్మిక వరద హెచ్చరికలను విశాఖ వాతావరణ కేంద్రం జారీ చేసింది. పలు ప్రాంతాల్లో 35–45 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.



## అజహరుద్దీన్‌కు మంత్రి పదవి?

రేపు మంత్రివర్గ విస్తరణ : ఎఐసిసి ఆమోదముద్ర

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ అజహరుద్దీన్‌కు తెలంగాణ రాష్ట్ర మంత్రి పదవి దక్కనుంది. ఈనెల 31వ తేదీన తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కార్యక్రమం జరగనుందని, అందులో అజహరుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాల సమాచారం. రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణకు ఎఐసిసి ఆమోదముద్ర వేసినట్లు తెలిసింది. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఎఐసిసిలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం 15 మందితో ఉన్న రాష్ట్ర మంత్రివర్గంలో మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. 'ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎప్పుడు మంత్రివర్గం ఏర్పడినా ముస్లిం మైనారిటీ నేతకు ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరపున చాలా మంది ముస్లిం మైనారిటీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి మంత్రివర్గంలో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు. ముస్లిం తరువాయి 2లో

## తక్షణమే రూ.303 కోట్లు విడుదల చేయండి



2022 నుంచి నేటి వరకు ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించండి

ఆర్థిక శాఖ అధికారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఓసి, మైనారిటీ విద్యార్థుల ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ బకాయిలు రూ.303 కోట్లను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆదేశించారు. ప్రజాభవన్‌లో బుధవారం ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ బకాయిలపై డిప్యూటీ సిఎం ఆర్థిక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. నిరాశ, నిస్పృహల్లో ఉన్న వేల కుటుంబాల్లో డిప్యూటీ సిఎం ఆదేశాలు ఆనందం నింపింది. ఆర్థిక స్తోమత లేకపోయినప్పటికీ విదేశాల్లో ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా ఉన్నత స్థితికి ఎదగాలని ఆలోచనతో వేలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌పై విదేశాలకు వెళ్లారు. గత ప్రభుత్వ కాలం నుంచి ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ అందకపోవడంతో విదేశాల్లో ఉన్న విద్యార్థులు, రాష్ట్రంలో ఉన్న తల్లిదండ్రులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. ఓవైపు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందక మరోవైపు అమెరికా, ఇంగ్లండ్ వంటి దేశాలలో కొత్త ఆంక్షలతో విద్యార్థులపై తరువాయి 2లో

పాలనపై నమ్మకం, ప్రతిభపై విశ్వాసానికి మెక్‌డొనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ ప్రతీక 03

## 'పిఎం శ్రీ' అమలుపై సమీక్షిస్తాం

మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

కేరళ ముఖ్యమంత్రి విజయన్ ప్రకటన

ఇది వామపక్ష ఐక్యతకు విజయం : బినోయ్ విశ్వం



**తిరువనంతపురం:** కేంద్ర ప్రభుత్వ పథకం 'పిఎం శ్రీ'ని రాష్ట్రంలో అమలు చేసే విషయంపై కేరళ ప్రభుత్వం సమీక్ష నిర్వహిస్తుంది. ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసే విషయంపై వివాదాలు, ఆందోళనలు తలెత్తిన నేపథ్యంలో దీనిపై సమీక్ష జరపాలని నిర్ణయించినట్లు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం తిరువనంతపురంలో చెప్పారు. సెంట్రల్ స్కూలు పథకాన్ని అమలు చేయడంపై అధ్యయనం చేసేందుకు ఏడుగురు సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. అందువల్ల ఉపసంఘం నివేదిక వచ్చేవరకూ 'పిఎం శ్రీ' అమలుకు సంబంధించిన తదుపరి ప్రక్రియను నిలిపివేసినట్లు చెప్పారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వివరించిన సందర్భంగా ఈ విషయాన్ని ఆయన మీడియాకు చెప్పారు. ''ఈ విషయాన్ని ఒక లేఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తాం'' అని విజయన్ అన్నారు. సార్వత్రిక విద్యామంత్రి వి.శివన్‌కుట్టి ఈ మంత్రివర్గ ఉపసంఘానికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. మంత్రులు కె.రాజన్, పి.రాజీవ్, రోషి అగస్టిన్, కె.ప్రసాద్, కె.కృష్ణకుట్టి, ఎ.కె.సశీంద్రన్‌లు ఈ ఉపసంఘంలో సభ్యులుగా ఉంటారు. అంతకుముందు ఈ విషయంపై గడచిన కొద్దిరోజులుగా సిపిఐ(ఎం), సిపిఐ నాయకులు విజయన్ నేతృత్వంలో బహుముఖస్థాయిల్లో చర్చలు తరువాయి 12లో



ఓట్ల కోసం మోదీ ఏదైనా చేస్తారు!

నృత్యం చేయడానికైనా సిద్ధంగా ఉన్నారు

బిహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ విమర్శ 05



రాఫెల్‌లో రాష్ట్రపతి గగన విహారం

ఇది మరపురాని అనుభూతి అని ద్రౌపదిముర్ము ఉద్ఘాటన 05



## మరో 51 మంది..

ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన మావోయిస్టులు

**బిజాపూర్ :** మావోయిస్టులు ఒక్కొక్కరిగా ఆయుధాలు వీడుతున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్ జిల్లాలో మరో 51 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వారిలో 20 మందిపై సమష్టిగా రూ. 66 లక్షల రివార్డు కలిగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులయ్యామని పేర్కొంటూ తొమ్మిది మంది మహిళలు సహా ఈ కేడర్ ప్రధాన స్రవంతిలోకి తిరిగి వచ్చారని బిజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. శాంతి, చర్చలు, అభివృద్ధి ద్వారా నక్సలిజాన్ని నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న లక్ష్యంలో హింస మార్గాన్ని విరమించుకోవాలనే వారి నిర్ణయం మరో ముఖ్యమైన అడుగు అని ఆయన అన్నారు. నక్సలైట్ల కోసం బస్తర్ రేంజ్ పోలీసులు ప్రారంభించిన పునరావాస చొరవ 'పూనా మార్గెం పునర్వాస్ సే పునర్జీవన్' తరువాయి 2లో

## పది నెలలు ఆలస్యంగా సిపిసి ఉద్యోగులకు అన్యాయమే

సిఫారసుల అమలుకు మరో రెండేళ్ళు

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ విమర్శ



**న్యూఢిల్లీ :** ఢిల్లీ శాసనసభ ఎన్నికల సందర్భంగా జూలై 16న కేంద్రం 8వ కేంద్ర వేతన సంఘాన్ని (సిపిసి)ని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుందని, పది నెలల తరువాత బిహార్ ఎన్నికల ముంగిట సిపిసిని ఏర్పాటు చేస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ అన్నారు. ప్రధానినరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సిపిసి చైర్మన్, తాత్కాలిక సభ్యుడిని నియమించేందుకు 10 నెలలు పట్టిందని బుధవారం ఒక పత్రికా ప్రకటనలో ఎద్దేవా చేశారు. కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించడానికి 18 నెలల గడువు ఇచ్చారని, అంటే 2027 సంవత్సరం మధ్యలో మాత్రమే నివేదిక లేదా సిఫారసులను మనం ఆశించవచ్చు అని అన్నారు. దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే సమయానికి నిజాయితీగా వ్యవహరిస్తే, 2027 సంవత్సరం చివరి వరకూ కొనసాగవచ్చునని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ వేతనాలను సవరించడానికి మరో రెండు సంవత్సరాలు వేచి తరువాయి 12లో

## నేడు ట్రంప్– జిన్‌పింగ్ భేటీ



**జియోంగ్జు :** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య గురువారం దక్షిణ కొరియాలో శిఖరాగ్ర సమావేశం జరుగుతుందని బీజింగ్‌లోని చైనా ప్రభుత్వ వర్గాలు అధికారికంగా ధృవీకరించాయి. అటు వైట్ హౌస్ కూడా ఈ విషయాన్ని ధృవీకరించడంతో యావత్ ప్రపంచ నాయకులూ ఈ కీలక సమావేశంపైనే దృష్టి సారించారు. ఇటీవలి కాలంలో చైనా–అమెరికామధ్య టారిఫ్‌ల యుద్ధం పెరగడంతో సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని నాయకులు ఇద్దరూ నిర్ణయించారు. ద్వైపాక్షిక సంబంధాలు, పరస్పర ప్రయోజనకరమైన సమస్యలు, వాణిజ్య వ్యవహారాలపై నాయకులు ఇద్దరూ చర్చిస్తారని చైనా విదేశీమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశం ద్వారా వాణిజ్య ఉద్రిక్తతలకు తెరపడుతుందని అందరూ ఆశాభావంతో ఉన్నారు. మరోవైపు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఒక ప్రకటన చేస్తూ, జిన్‌పింగ్‌తో సమావేశం సందర్భంగా యుద్ధ సమస్య పరిష్కారం గురించి మాట్లాడాలని ట్రంప్‌ను కోరారు. రష్యాకు అదేపనిగా సైనిక సహాయం, నైతిక మద్దతు ఇవ్వకుండా వెనక్కు తగ్గాల్సిందిగా చైనా అధ్యక్షుడికి విజ్ఞప్తి చేయాలని ట్రంప్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

**15 శాతానికి తగ్గనున్న ద.కొరియా–అమెరికా టారిఫ్‌లు**

రెండు రోజులపాటు 'ఎపెక్' (ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార సంస్థ) దేశాల సమావేశాలలో పాల్గొనేందుకు తరువాయి 12లో

# ప్రపంచం
WORLD NEWS

## తూర్పు పసిఫిక్‌లో డ్రగ్స్ పడవలపై అమెరికా దాడులు:14 మంది మృతి

**పెంటగాన్:** కరీబియన్ జలాల్లో అమెరికా నావికాదళంమరోసారి మాదక ద్రవ్యాల పడవలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో 14 మందిని కాల్చి చంపారు. అమెరికా రక్షణమంత్రి పీటర్ హెగ్సెత్ బుధవారం ఈ విషయం చెప్పారు. మెక్సికో జలాల సమీపంలో తూర్పు పసిఫిక్ సముద్రంలో ఈ దాడులు జరిగాయి. మంత్రి హెగ్సెత్ ఈ దాడుల గురించి వివరిస్తూ, అల్ ఖైదా ఉగ్రవాద సంస్థ చేసిన దాడులకంటే ఈ నార్కో ఉగ్రవాదుల కారణంగా ఎక్కువమంది మరణిస్తున్నారని అన్నారు. వారు ఏ విధంగా అయితే మనుషులను చంపుకుతింటున్నారో, వాళ్ళకు (డ్రగ్ కార్టెల్స్) కూడా అదే గతి పట్టిస్తామని, వారిని వదలిపెట్టేదిలేదని హెచ్చరించారు. ''వాళ్ళను వెంటాడి, వేటాడి చంపుతాం'' అని హెగ్సెత్ అన్నారు. మొత్తం నాలుగు డ్రగ్స్ పడవలపై తూర్పు పసిఫిక్‌లో ఈ దాడులు జరిపినట్లు చెప్పారు. ఐతే వెనిజులా, కొలంబియా దేశాల నాయకులు అమెరికా చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బెదిరింపులకు, అస్థిరత్వానికి గురిచేస్తున్నారని వెనిజులా నేత మదురో, కొలంబియా నాయకుడు పెట్రో విమర్శించారు.

# దక్షిణ కొరియాలో వామపక్షాల ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు



**జియోంగ్జు:** ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార సంస్థ సభ్యదేశాల వార్షిక సమావేశంలో పాల్గొనేందుకు దక్షిణ కొరియాకు చేరుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు వామపక్షాల వేదిక నాయకత్వాన నిరసన ప్రదర్శనలు ఎదురయ్యా యి. ట్రంప్‌ను అనుకరిస్తూ, ఆయన విధానాలు ఎలా ఉంటున్నాయో చూపరులకు అర్థమయ్యేవిధంగా ప్రదర్శకులు వ్యంగ్య వీధి నాటికలు ప్రదర్శించారు. ట్రంప్ తరహాలో సూటూ టై కట్టుకుని అనుకరిస్తూ ప్రదర్శనలు చేశారు. బ్యారికేడ్లను దాటి పోలీసు నిబంధనలు ఉల్లంఘించి ముందు కు దూసుకువెళ్ళారు. ఈ సందర్భంగా పోలీసులు, ప్రదర్శకుల మధ్య స్వల్పస్థాయిలో ఘర్షణలు జరిగాయి.

35 వామపక్షాల పౌర సంఘాలు, ప్రగతిశీల పౌర సంఘాలు, ప్రతిపక్షాల నాయకత్వాన ఇంటర్నేషనల్ పీపుల్స్ యాక్షన్ కమిటీ ఎగెనెస్ట్ ద ఎపెక్–2025 పేరుతో రాజకీయపార్టీలు ఏర్పాటు చేసిన సంకీర్ణ వేదిక ఈ నిరసన ప్రదర్శన నిర్వహించింది. బొమన్ టూరిస్ట్ కాంప్లెక్ వద్ద ఈ ఎపెక్ సమావేశ వేదిక ఏర్పాటు చేశారు. కానీ ప్రదర్శకులను ఈ వేదికకు ఐదు కిలోమీటర్ల దూరంలోనే పోలీసులు అడ్డుకున్నారు. భారీ సంఖ్యలో పోలీసులు వారిని ముందుకు వెళ్ళకుండా ఆపేశారు. దీంతో తోపులాటతోపాటు కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి.

వేలసంఖ్యలో ప్రజలు బుధవారం ఉదయం ఉత్తర జియోంగ్సాంగ్ రాష్ట్రం జియోంగ్జులో అమెరికాకు వ్యతిరేకంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. రక్షణ వ్యయాలు పెంచుకోవడానికి అధిక సుంకాలు వసూలు చేయడం ద్వారా డోనాల్డ్ ట్రంప్ దక్షిణ కొరియాను దోపిడీ చేస్తున్నారని ప్రదర్శకులు నినాదాలు చేశారు. ట్రంప్ విధానాలు దీర్ఘకాలిక మిత్రదేశమైన దక్షిణ కొరియాకు వ్యతిరేకంగా ఉన్నాయంటూ నిరసన తెలియజేశారు. 'నో కింగ్స్, నో వెల్‌కమ్ టూ సౌత్ కొరియా, నో ఎపెక్' అంటూ నినాదాలు చేశారు. ట్రంప్ అనుసరిస్తున్న అనేక వ్యతిరేక విధానాలకు రూపం ఇస్తూ, ప్రదర్శకులు ప్రదర్శనల సందర్భంగా అనేక స్కిట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష ప్రోగ్రెసివ్ జస్టిస్ పార్టీ నాయకుడు క్యాన్ యంగ్ కూక్ మాట్లాడుతూ, ఎపెక్ సదస్సు ఆర్థిక వృద్ధి, ప్రజాక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతోందని, కానీ వాస్తవానికి ప్రపంచ నాయకులు అందరూ తమ తమ దేశాల టారిఫ్‌లు తగ్గించుకోవడంకోసం ట్రంప్ వెంటపడి పాకులాడుతున్నారని, సూట్లూ, బూట్లూ ధరించి తమ తమ దౌత్య నైపుణ్యాలు ప్రదర్శించి తక్కువ టారిఫ్‌లు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. అంతర్జాతీయ క్రమాన్ని కూడా ఆపలేకపోతున్న ఈ ఆర్థిక సంస్థ ఇక అభివృద్ధి గురించి ఏం మాట్లాడుతుందని ఆయన ప్రశ్నించారు.

**ఉత్తర కొరియా క్రూయిజ్ క్షిపణి ప్రయోగం**

జియోంగ్జు: దక్షిణ కొరియాలో ఎపెక్ సమావేశానికి హాజరయ్యేందుకు బుధవారం ట్రంప్ బుసాన్‌లో అడుగుపెట్టిన సందర్భంలోనే ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం చేసింది. సముద్రం నుండి భూఉపరితలం మీద ఉన్న లక్ష్యాలను ఛేదించగల క్రూయిజ్ క్షిపణిని ఉత్తర కొరియా ప్రయోగించిందని దక్షిణ కొరియా ధృవీకరించింది. ఉత్తర కొరియా కూడా బుధవారం ఒక ప్రకటన చేస్తూ క్రూయిజ్ క్షిపణి ప్రయోగం విజయవంతమైందని పేర్కొంది. తమదేశ సైనిక సామర్థ్యానికి ఇది మచ్చు తునక అని ప్రభుత్వం పేర్కొంది. ఐతే మరోవైపు కొరియా పర్యటనకు రాకముందు నుండీ ట్రంప్ ఉత్తర కొరియా అధినేత కిమ్‌ను కలుసుకునేందుకు ఆసక్తి చూపించారు. చివరకు ఆయన ఈ పర్యటన సందర్భంగా తాను కిమ్‌ను కలుసుకోవడం లేదని, తర్వాత మరో సందర్భంలో ఆయనను కలుసుకుంటానని ప్రకటించారు. ''కిమ్ జోంగ్ ఉన్ నాకు బాగా తెలుసు, మాకు చాలా కాలం క్రితమే పరిచయం'' అని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ మ్యుంగ్‌తో సమావేశానికి ముందుగా ట్రంప్ అన్నారు. ఎయిర్‌ఫోర్స్ విమానంలో బుసాన్‌కు వెళుతూ ఆయన పాత్రికేయుతో మాట్లాడారు. అనేక దశాబ్దాలుగా కిమ్ క్షిపణులను ప్రయోగిస్తున్నారు మీకు తెలుసా? అని ఆయన అన్నారు.

# మళ్ళీ మొదటికొచ్చిన గాజా యుద్ధ కథ!

ఒప్పందం ఉల్లంఘన:
ఐడిఎఫ్ దాడుల్లో 104 మంది మృతి
ఇజ్రాయెల్ దాడులను సమర్థించిన ట్రంప్
మృతదేహాల స్వాధీనం ప్రక్రియ నిలిపివేసిన హమాస్

**గాజా:** హమాస్ ఉగ్రవాద స్థావరాలపై దాడుల పేరుతో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. బుధవారం తెల్లవారక ముందుగానే ఇజ్రాయెల్ సైనికులు గాజాపై ప్రాణాంతకమైన భీకర దాడులు చేశారు. ఈ దాడులను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సమర్థించారు. క్రమంగా పెరుగుతూ వచ్చిన దాడుల్లో మృతులసంఖ్య కడపటి వార్తాల నాటికి 104 కు చేరింది. వీరిలో 35 మంది పిల్లలు ఉన్నారు. మరో 200 మంది గాయపడ్డారు. వాయువ్య ఖాన్‌యూనిస్‌లో రోడ్డుపై వెళుతున్న ఒక వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఎయిర్‌క్రాఫ్ట్ నుండి చేసిన దాడిలో మరో ఐదుగురు మరణించారు. గాజా సిటీలో ఇళ్ళు, స్కూళ్ళు, రెసిడెన్షియల్ బ్లాక్స్, ఉత్తర గాజాలోని బెయిత్ లహియా, సెంట్రల్ గాజాలోని బురియజ్, నుజైరత్, దక్షణి గాజాలోని ఖాన్‌యూనిస్ ప్రాంతాలలో విస్తారంగా గగనతల దాడులు జరిగాయి. బురియజ్‌లోని శరణార్థ శిబిరంలో తలదాచుకున్న అబూషరార్ కుటుంబంలోన ఐదుగురు సభ్యులూ మరణించారు. 30 మంది సాయుధులైన కమాండర్స్ గ్రూపుపై కూడా దాడిచేసి హతమార్చినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. గాజాలో ప్రాణాలకు హామీ లేకపోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

దాడుల సమయంలో గాజా అంతటా పొగలతో నిండిపోయింది. అనేక ప్రాంతాలు బాంబు ధ్వనులతో దద్దరిల్లాయి. మంటలు ఎగసిపడ్డాయని ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పారు. ధ్వంసమైన భవంతులవద్దకు చేరుకుని సహాయ కార్యక్రమాలు చేసేందుకు బృందాలు రంగంలోకి దిగాయి. పౌర రక్షణ బృందాలు, ఆసుపత్రి వర్గాలు,



హమాస్ పాలిత ఆరోగ్యమంత్రిత్వ శాఖలను ఉటంకిస్తూ 'అల్‌జజీరా' మీడియా నెట్‌వర్క్ ఈ విషయం వెల్లడించింది. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత 19 రోజుల్లో పాలస్తీనియన్లు ఇంత భారీసంఖ్యలో మరణించడం ఇదే. రెడ్‌క్రాస్ అంతర్జాతీయ కమిటీ ఈ దాడులను ఖండించింది. తాము ఎంతో సానుకూలమైన దృక్పథంతో ఉనానమని తెలిపింది.

గాజాలో భీకర దాడులు పూర్తయిన తర్వాత ఇజ్రాయెల్ ప్రభుత్వం బుధవారం ఉదయం విడ్డూరమైన ప్రకటన చేస్తూ గాజాలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని యథాతథంగా అమలు చేస్తామని ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని హమాస్ ఉల్లంఘించి తమ సైనికుణ్ణి కాల్చి చంపిందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ఆరోపించారు. బందీలను స్వాధీనం చేయకుండా హమాస్ నాటకాలు ఆడుతోందని విమర్శించారు. ఈ పరిణామాలపై హమాస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇజ్రాయెల్‌కు బందీల మృతదేహాలను స్వాధీనం చేసే ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. డజన్లసంఖ్యలో ఉగ్రవాదుల కేంద్రాలను, ఉగ్రవాదులను లక్ష్యంగా పెట్టుకుని ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ చెప్పారు. హమాస్ సంస్థ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, తమ సైనికుణ్ణి కాల్చి చంపిందని కట్జ్ ఆరోపించారు. ఈ ఆరోపణలను హమాస్ ఖండించింది. రఫాలో దాడులకు తమకూ ఎలాంటి సంబంధం లేదని, ఇప్పటికీ తాము కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది.

ఐతే ట్రంప్ మాత్రం భిన్నంగా స్పందించారు. హమాస్ ఉగ్రవాదులు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయెల్ సైనికుణ్ణి కాల్చి చంపారని, అందుకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ దాడి చేస్తుందని సమర్థించారు. ఇలాంటి ఘటనలవల్ల కాల్పుల విరమణ ఒప్పందానికి ఎలాంటి నష్టం, హానీ జరగదని ఆయన కొట్టిపారేశారు. ఇజ్రాయెల్ దాడులను ఐక్యరాజ్య సమితి ఖండించింది. కానీ దాడులకు ముందే అక్కడున్న పరిస్థితులను ఐక్యరాజ్యసమితికి ఇజ్రాయెల్ తెలియజేసిందని అమెరికా అధికారులు చెప్పారు. మీరంటే మీరే కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ గడచిన ఇరవై రోజులుగా హమాస్ సంస్థ, ఇజ్రాయెల్ మధ్య ఆరోపణలు కొనసాగుతున్నాయి.

**మొత్తం 16 మంది బందీల మృతదేహాలు స్వాధీనం**

పాలస్తీనా–ఇజ్రాయెల్ మధ్య గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అక్టోబరు తొమ్మిదో తేదీన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. 11వ తేదీ నుండి కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. అక్టోబరు 13వ తేదీన 20 మంది సజీవులైన బందీలను, నాలుగు మృతదేహాలను ఇజ్రాయెల్‌కు హమాస్ స్వాధీనం చేసింది. ఇక అప్పటినుండి మంగళవారం 28వ తేదీ వరకూ విడతల వారీగా హమాస్ సంస్థ 16 మంది బందీల మృతదేహాను అప్పగించింది. దీంతో హమాస్ ఇంకా 12 మృతదేహాలను ఇజ్రాయెల్‌కు స్వాధీనం చేయాల్సి ఉంటుంది. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ ఉగ్రవాదులు వందలమంది ఇజ్రాయెల్ సరిహద్దు కంచెను బద్దలు కొట్టుకుని లోనికి ప్రవేశించి తుపాకులు, భారీ ఆయుధాలతో హింస సృష్టించారు. ప్రధానంగా సంగీత ఉత్సవంపై దాడిచేసి 1200 మంది కాల్చి చంపారు. మరో 250 మందిని బందీలుగా తీసుకువెళ్ళారు. ఆ తర్వాత గాజాలో యుద్ధం మొదలైంది. ఈ రెండేళ్ళ యుద్ధకాలంలో 68 వేలమంది పాలస్తీనియన్లు మరణించారు. హమాస్ అధీనంలో ఉన్న వారిలో మరణించిన బందీలు మరణించగా, కొందరు పారిపోయారు. కొందరు సజీవ–నిర్జీవ బందీలను గడచిన మార్చి నెలలో ఒప్పందం ప్రకారం హమాస్ స్వాధీనం చేసింది. మొత్తంమీద ఈ రెండేళ్ళలో హమాస్ ఇప్పటివరకూ అంటే మంగళవారం వరకూ 51 మంది ఇజ్రాయెలీ బందీల మృతదేహాలను స్వాధీనం చేసింది. ఇంకా 13 మంది బందీల మృతదేహాలను అప్పగించాల్సి ఉంది. కానీ హమాస్ మరణించిన బందీల అస్థికల స్వాధీన చర్యలు సక్రమంగా లేవని, సగం సగం అస్థికలను ఇస్తున్నారనీ, హమాస్‌పై నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్‌లో బందీల బంధువుల వేదిక కోరింది.

## మరోసారి హస్సన్‌కే టాంజానియా అధ్యక్ష పదవి!

**దోడోమా:** తూర్పు ఆఫ్రికాదేశం టాంజానియాలో బుధవారం సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ జరిగింది. రెండు ప్రధాన ప్రతిపక్షాలకు చెందిన నాయకులను ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించిన తర్వాత దేశాధ్యక్షురాలు సమియా సులుహు హస్సన్ (65)కే ఈసారి కూడా అధ్యక్ష పదవి దక్కుతుందన్నది ప్రముఖంగా వినిపిస్తున్న కథనం. దేశంలో ఆధిపత్యం చెలాయించే పాలక ''పార్టీ ఆఫ్ ద రివల్యూషన్'' (చామా చా మా పిండుజీ) ఆఫ్రికా చరిత్రలో అతి ఎక్కువకాలంగా పదవిలో కొనసాగుతున్నది. సిసిఎం పార్టీ గడచిన ఆరుసార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించింది. 2020లో జరిగిన ఎన్నికల్లో సిపిఎంపార్టీ 256 సీట్లు గెలుచుకుని జాతీయ అసెంబ్లీలో పూర్తి మెజారితో కొనసాగుతోంది. ఐతే పోలింగ్ సందర్భంగా నిరసనలు తెలియజేసేందుకు కొన్ని గ్రూపులు ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు వారిని చెదరకొట్టి ఆ ప్రాంతం నుండి తరిమివేశారు. దేశంలో అధ్యక్షురాలు హస్సన్‌కు వ్యతిరేకత ఉన్నప్పటికీ అణచివేత చర్యలు కొనసాగుతున్నాయి. ఆమెకు వ్యతిరేకంగా నిరసనలు




కూడా వ్యక్తం అవుతున్నాయి. నిరంకుశ పాలకురాలుగా ఆమె పేరు పొందారు. కొందరు ప్రతిపక్ష నాయకులు జైలుపాలయ్యారు. తీవ్ర ఆంక్షల మధ్య దేశంలో ఎన్నికలకు రంగం సిద్ధమైంది. టాంజానియా జాతీయ అసెంబ్లీలో 393 స్థానాలున్నాయి. 264 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. మహిళలకోసం 113 స్థానాలు రిజర్వు చేశారు. దేశాధ్యక్షురాలు పదిమందిని నామినేట్ చేస్తారు. ఒక ఎక్స్–అఫీషియో సభ్యుడు ఉంటారు. అటానమస్ ఐలాండ్ జాంజిబార్ నుండి ఐదుగురు సభ్యులు ఉంటారు.

## అజహరుద్దీన్‌కు మంత్రి పదవి?

(మొదటి పేజీ తరువాయి)

మైనారిటీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్టానం గత కొంత కాలంగా ఆలోచన చేస్తోంది. అజాహరుద్దీన్ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎంఎల్‌సి పదవి ఇవ్వాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎంఎల్‌ఎసిలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి (టిజెఎస్) అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. కాగా వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎంఎల్‌సి నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఎఐసిసి ఆమోదం తెలిపినట్టు సమాచారం. మంత్రివర్గ విస్తరణపై గత రెండు రోజులుగా ఎఐసిసిలో విస్తృతంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన అనంతరం మొదటి సారి ముఖ్యమంత్రితో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానం ముస్లిం మైనారిటీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కనట్లయితే త్వరలో కొన్ని ఎంఎల్‌సి స్థానాలు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 6 నెలలలో అజాహరుద్దీన్‌ను ఎంఎల్‌సిని చేసే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై కసరత్తు కొనసాగుతున్నట్టు టిపిసిసి నేతల ద్వారా తెలుస్తోంది.

## మరో 51 మంది..

(మొదటి పేజీ తరువాయి)

(సామాజిక సమైక్యతకు పునరావాసం)లో భాగంగా వారు లొంగిపోతున్నారన్నారు. లొంగిపోయిన వారిలో పిఎల్‌జిఎ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) బెటాలియన్ నంబర్ 01, కంపెనీ నంబర్లు 01, 02, 05 కు చెందిన ఐదుగురు సభ్యులు, ఏరియా కమిటీలు, ప్లాటూన్‌కు చెందిన ఏడుగురు సభ్యులు, ఎల్ఒఎస్ (స్థానిక సంస్థ స్క్వాడ్) గ్రూపునకు చెందిన ముగ్గురు సభ్యులు, ఒక మిలీషియా ప్లాటూన్ కమాండర్, 14 మంది మిలీషియా ప్లాటూన్ సభ్యులు, 20 మంది దిగువ స్థాయి సభ్యులు ఉన్నారని ఆయన చెప్పారు. జనవరి 2024 నుండి బిజాపూర్‌లో మొత్తం 650 మంది మావోయిస్టులు ప్రధాన స్రవంతిలో చేరారు. ఎన్‌కౌంటర్లలో 196 మందిని తటస్థీకరించగా, 986మందిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు.

**రూ.9.50 లక్షల రివార్డు అందుకున్న లొంగిపోయిన మావోయిస్టులు**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిషేధిత మావోయిస్టు పార్టీలో పని చేసి ఇటీవల లొంగిపోయిన ముగ్గురు సభ్యులకు ప్రభుత్వం నుండి మంజూరైన రూ.9 లక్ష 50 వేల నగదును ఎస్‌పి రోహిత్ రాజ్ వారికి అందజేశారు. ఈ రివార్డులను ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాకు చెందిన రామ్‌సింగ్ కొడే, నరోటి మనీష్ రూ.5 లక్షలు, ఊసూరు బ్లాక్ చెందిన ముచ్చిక సోందాల్ రూ.3.75 లక్షలు, చింతగుప్పకు చెందిన మోడి భీమీ అలియాస్ దేవా రూ.75 వేలు చెక్కుల రూపంలో ఎస్‌పి బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిషేదిక సిపిఐ మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు నగదులను వారి పునరావాసం కోసం అందజేయడం జరిగిందని తెలిపారు.

కాలం చెల్లిన సిద్ధాంతాలతో స్వార్థ ప్రయోజనాల కోసం మావోయిస్టు పార్టీ నాయకులు, అమాయకులైన ఆదివాసీలను బలవంతంగా తమ పార్టీలోకి చేర్చుకునివారి చేత చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయించారని తెలిపారు. లొంగిపోయిన సభ్యులకు జిల్లా పోలీసులు అండగా ఉంటారన్నారు.ఇంకా మావోయిస్టు పార్టీ లో ఉంటూ అజ్ఞాత జీవితాన్ని సాగిస్తూ ఉన్న వారి లొంగిపోయి జనజీవస్రవంతిలో కలవాలని ఎస్‌పి కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్ నరేందర్, ఆర్ఐ ఆపరేషన్స్ రవి, తదితరులు పాల్గొన్నారు.

# మొంథా బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)



ఉధృతితో డిసిఎం వ్యాన్ కొట్టుకుపోవడంతో డ్రైవర్ గల్లంతు అయ్యారు. దీంతో అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన కురుస్తున్న భారీ వర్షాలతో కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. దీంతో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టు ఏడు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. నీటి విడుదలతో మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. నదిలోకి ఎవరూ వెళ్లవద్దని, పశువులను కూడా నది వైపు తీసుకెళ్లవద్దని సూచించారు. అదేవిధంగా భారీ వర్షాల కారణంగా పలు జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం లతిపూర్ సమీపంలో డిండి జలాశయం మత్తడి పరవళ్లు



తొక్కుతూ ప్రవహిస్తోంది. దీంతో జాతీయ రహదారి కోతకు గురి కావడంతో బుధవారం సాయంత్రం నుంచి అధికారులు రాకపోకలను నిలిపేశారు. శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన వాహనాలను అచ్చంపేట మండలంలోని హాజీపూర్ నుంచి వంగూరు మండలం చింతపల్లి కొండారెడ్డిపల్లి మీదుగా మళ్లించారు. కోతకు గురైన జాతీయ రహదారిని నాగర్ కర్నూల్ ఎస్పీ పరిశీలించారు. దీనిపై జాతీయ విపత్తు నిర్వహణ సంస్థకు అధికారులు సమాచారం అందించారు.

**వర్షాలకు నీట మునిగిన ఎస్టీ గురుకుల పాఠశాల**

భారీ వర్షాల నేపథ్యంలో దేవరకొండ డివిజన్‌లో పర్యటించి నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిస్థితిని పర్యవేక్షించారు. మండలంలోని కొమ్మేపల్లి గ్రామంలో ఉన్న షెడ్యూల్డ్ తెగల బాలుర హాస్టల్లోకి వర్షపు నీరు చేరడంతో విద్యార్థుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి పాత్రికేయ ప్రతినిధులతో మాట్లాడుతూ మంగళవారం నుండి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో కొమ్మేపల్లి ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలకు ప్రహరీ లేకపోవడం, లోతట్టు ప్రాంతంలో ఉండడం వంటి కారణాల వల్ల హాస్టల్లోకి నీరు ప్రవేశించిందని తెలిపారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా రెవెన్యూ, పోలీస్ అధికారుల సహాయంతో విద్యార్థులను పక్కనే ఉన్న బిసి గురుకుల హాస్టల్‌లోకి తరలించామని తెలిపారు. ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు, 26 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అందరిని తరలించినట్లు ఆమె వెల్లడించారు.

**16 జిల్లాలకు ఫ్లాష్ ఫ్లెడ్ ముప్పు :**

మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని 16 జిల్లాలకు ఫ్లాష్ ఫ్లెడ్ ముప్పు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి, హనుమకొండ, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, పెద్దపల్లి జిల్లాలకు వరద ముప్పు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. వాతావరణ శాఖ అధికారులు ప్రకటించినట్లుగానే వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట, జనగామ, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడ్డాయి. కుమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, రంగారెడ్డి, నల్గొండ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురుశాయి.

**8 జిల్లాలకు రెడ్ అలర్ట్ :**

హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తాజాగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, సూర్యాపేట, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయి. అదేవిధంగా కుమురం భీం, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, హనుమకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించిన అధికారులు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పాటు నల్లగొండ, సూర్యాపేట, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాలు చేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

**హైదరాబాద్‌లో భారీ వర్షం :** తుపాన్ ప్రభావంతో బుధవారం హైదరాబాద్‌లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రోజంతా ఏకదాటిగా జల్లులు పడడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు అష్ట కష్టాలు పడ్డారు. భారీ వర్షం కారణంగా నగరంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు గంటల తరబడి వర్షంలో తడవాల్సి వచ్చింది. ముషీరాబాద్, మారేడ్‌పల్లి, చార్మినార్, సరూర్‌నగర్, అంబర్‌పేట్, అల్వాల్, మల్కాజ్‌గిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

## తగిన జాగ్రత్తలు

(మొదటి పేజీ తరువాయి)

ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. తుపాన్ ప్రభావం అధికంగా ఉన్న జిల్లాలలో ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా కలెక్టర్లు వివిధ బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సిఎం సూచించారు.

వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండి, లోతట్టు ప్రాంతాల కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు.

రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాలలో లో లెవల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలను పూర్తిగా నిషేధించాలని, పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తుపాన్ ప్రభావంతో వర్షపు నీరు నిలువ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించే అవకాశం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిఎం చెప్పారు. వైద్యారోగ్య శాఖ తగిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రాణనష్టం, ఆస్తినష్టం, పశునష్టం చోటుచేసుకోకుండా అన్ని శాఖలు జాగ్రత్తలు వహించాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలు, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సిఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జిహెచ్ఎంసి, హైడ్రా, ఎస్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

**అత్యవసరమైతేనే తప్ప ప్రజలు బయటకు రావద్దు : మంత్రి పొన్నం ప్రభాకర్**

మొంథా తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. అత్యవసరమైతేనే తప్ప ప్రజలు బయటకు రావద్దని ఎక్కడ ఇబ్బందులు ఉన్న అధికారుల దృష్టికి తీసుకోవాలని తెలిపారు. జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, వాటర్ వర్క్స్, పోలీస్, విద్యుత్, హైడ్రా అధికారులు సమన్వయం చేసుకోవాలని, ఫిర్యాదు వస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నగరంలో వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద నీరు నిల్వ ఉండకుండా సిబ్బంది ఉండేలా జిహెచ్ఎంసి అధికారులు పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు విద్యుత్ స్థంబాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొంథా తుఫాను ప్రభావం తగ్గే వరకు అధికారులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

## విడుదల చేయండి

(మొదటి పేజీ తరువాయి)

మానసిక ఒత్తిడి తీవ్రమైంది. వివిధ దేశాల్లో గతంలో మాదిరిగా చదువుకుంటూ ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి లేదు. అక్కడ నిత్యం ఆర్థిక భారం పెరిగిపోతుంది. మరోవైపు బ్యాంకులలో తీసుకున్న ఎడ్యుకేషన్ లోన్ భారం పెరుగుతుంది. ఈ పరిస్థితిలన్నిటిని అవగాహన చేసుకున్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఈ సమస్యను ప్రాధాన్యత అంశంగా భావించి ఓవర్‌సీస్‌స్ స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్లు డిప్యూటీ సిఎం కార్యాలయం తెలియజేసింది. ఇదిలా ఉండగా, తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో డిప్యూటీ సిఎం ఆదేశాలతో వేలాది కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. కష్టకాలంలో ప్రభుత్వం ప్రతి విద్యార్థి సుమారు రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో తమ బిడ్డలు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని, తమ ఇబ్బందులు తొలగిపోతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కష్టకాలంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి రాష్ట్రానికి, దేశానికి తిరిగి అర్థవంతమైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని ఆశాభావంతో ఉన్నట్టు ఓవర్‌సీస్ విద్యార్థులు అంటున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## భారత్ రైస్ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ పౌర సరఫరాల శాఖ ప్రత్యేక స్టాల్

ప్రజాపక్షం/హైదరాబాద్
ఆల్ ఇండియా రైస్ ఎగుమతిదారుల సంఘం ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వం, భారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్ సహకారంతో ఈనెల 30, 31 తేదీలలో న్యూఢిల్లీలో నిర్వహించనున్న భారత్ రైస్ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ పౌర సరఫరాల శాఖ పాల్గొననుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ పాల్గొనాలని నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్ర బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్లో ఎగుమతి అవకాశాలను విస్తరించేందుకు ఈ కాన్ఫరెన్స్ ను సద్వినియోగం చేసుకునేందుకుగాను తెలంగాణా పౌర సరఫరాల శాఖా కాన్ఫరెన్స్ లో పాల్గొనాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులోభాగంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ తెలిపింది.

# జిసిసిల రాజధానిగా హైదరాబాద్

### పాలనపై నమ్మకం, ప్రతిభపై విశ్వాసానికి ప్రతీక మెక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ కార్యాలయం ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రతిభపై విశ్వాసం పరిపాలనపై నమ్మకానికి మెక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ ఒక ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి టి హబ్ సమీపంలో మెక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క ప్రసంగిస్తూ తెలంగాణ అద్భుత ప్రతిభకు మెక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ కోసం హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడం ఒక నిదర్శనం అన్నారు. జిసిసిలకు రాజధానిగా హైదరాబాద్ నిలిచిందని డిప్యూటీ సిఎం తెలిపారు. మాజీ ప్రధాని నెహ్రూ మొదలుకుని ఆ తర్వాత పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ వంటి మహానేతలు దూరదృష్టితో చేపట్టిన చర్యలతో హైదరాబాద్‌కు మరింత బలం చేకూరిందన్నారు. సమానత్వంతో కూడిన వృద్ధి, సమిష్టి అభివృద్ధి అనే అంశాలు తెలంగాణ ప్రభుత్వానికి మార్గదర్శక సూత్రాలని డిప్యూటీ సిఎం వివరించారు.

మెక్ డోనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్ నూతన కేంద్రం కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మిస్తున్న కొత్త పరిణామంలో కీలక అధ్యాయమన్నారు. గత రెండు దశాబ్దాల్లో హైదరాబాద్ ఇటువంటి సెంటర్లకు రాజధానిగా మారిందని, వందలాది గ్లోబల్ కెపబిలిటీ హబ్‌లు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇవి అన్నీ తెలంగాణ రాష్ట్రంలో ప్రతిభపై విశ్వాసం, పాలనపై నమ్మకం, భవిష్యత్తుపై ఆశకు ప్రతీకలు అన్నారు. ఇవి కేవలం బ్యాక్ ఆఫీసులు కావని, ఇవి ప్రపంచ ఆవిష్కరణకు జీవనాడులన్నారు. మెక్ డోనాల్డ్స్ తన సప్లై చైన్స్, సస్టైనబిలిటీ, డిజిటల్ అనుభవాలను పునర్నిర్మించినట్లే హైదరాబాద్ కూడా టెక్నాలజీ, మానవతా విలువలు కలిసిన నగరంగా మళ్లీ తనను పునర్ నిర్వచిస్తోందన్నారు. మ్యాక్ డోనాల్డ్స్ తెలంగాణ యువత కోసం నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై భాగస్వామి కానుందని, ఈ భాగస్వామ్యం గ్లోబల్ సామర్థ్యాన్ని స్థానిక అవకాశంగా మార్చుతుందన్నారు. కార్యక్రమంలో డోనాల్డ్ కంపెనీ ప్రతినిధులు మిస్ స్కై ఆండర్సన్, దేశాంత్ కైలా, మ్యాటిజ్ బ్యాక్స్, స్పీరో డ్రూలియాస్, శదాస్ దాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# అధికార కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

### కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించండి: మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి ప్రజా పాలన ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధికి పాటు పడాలని హైదరాబాద్ ఇన్‌ఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉంది.. టిఆర్ఎస్ కేంద్రంలో లేదు రాష్ట్రంలో లేదు.. దానికి ఓటేస్తే ఉపయోగం లేదు... ప్రయాణించే బండి ఎక్కాలి... కానీ మూలకువద్ద కారు ఎక్కితే మీరు ముందుకు పోలేరు అని ఆయన జూబ్లీహిల్స్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి అధికార కాంగ్రెస్‌తోనే సాధ్యం అని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఇద్దరు వ్యక్తుల మధ్య కాదు, ఎన్నిక కాంగ్రెస్ అభివృద్ధికి... టిఆర్ఎస్ అబద్దాలకు మధ్య జరుగుతుందన్నారు. మీకు అభివృద్ధి కావాలా, అబద్ధాలు కావాలా తెలుసుకోవాలన్నారు. జూబ్లీహిల్స్‌లో బండలను కరిగించి పేదలకి ఇండ్ల పట్టాలు, ఇండ్లు కట్టించి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలు ఏర్పాటు చేసి ఉపాధి చూపింది కాంగ్రెస్ పార్టీనేని తెలిపారు. సన్న బియ్యం ఇచ్చింది కూడా తమ పార్టీనే అని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హత ఉన్న అందరికీ నూతనంగా రేషన్ కార్డులు పంపిణీ చేశాం, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 2 లక్షల 40 వేల మందికి పైగా ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందుతున్నాయన్నారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం, 500కి గ్యాస్ అందిస్తున్నాం అని చెప్పారు. మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు అందిస్తున్నాం, 80 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. తమ పార్టీ అభ్యర్థి బిసి బిడ్డ విద్యావంతుడు నిత్యం ప్రజల్లో ఉండే నవీన్‌యాదవ్‌ను రౌడీ అంటున్నారు. వాళ్ళు ఎన్ని అన్న అవి మా ఆశీర్వాదాల కిందికే వస్తాయన్నారు. బిఆర్ఎస్ వాళ్ల ఇప్పుడు ఆటోలో ప్రయాణం చేస్తూ రాజకీయ డ్రామాలు చేస్తున్నారన్నారు. 2012 తరువాత నగరంలో ఒక్క ఆటోకి పర్మిట్ ఇవ్వలేదు.. ఉమ్మడి ఎపిలో బొత్స సత్యానారాయణ ఇచ్చినవి తప్ప మళ్ళీ ఇవ్వలేదు. తమ ప్రభుత్వం 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలకు అనుమతి ఇచ్చామని తెలిపారు. 11న జరిగే ఎన్నికల్లో ఉన్నత విద్యావంతుడు, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే నవీన్ యాదవ్ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు చరణ్ కౌశిక్ యాదవ్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, భాస్కర్‌లు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులను రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అప్రమత్తం చేశారు. బుధవారం ఆయన ఆర్ అండ్ బి ఈఎన్‌సిలు, సిఈలు, ఎస్ఈలతో ఫోన్‌లో మాట్లాడారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో హై అలెర్ట్‌గా ఉండాలనీ,అత్యవసరం అయితే తప్పా ఎవరూ సెలవుపై వెళ్లొద్దనీ మంత్రి స్పష్టం చేశారు. మాన్సూన్ సీజన్‌లో ఆర్ అండ్ బి ఇంజనీర్లు క్షేత్ర స్థాయిలో చేపట్టిన జాగ్రత్త చర్యలు ప్రశంసనీయమని అదే స్ఫూర్తిని ఈ సమయంలో కూడా కొనసాగించాలన్నారు. లో కాజ్‌వేలు, కల్వర్టులు వద్ద ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలనీ, ప్రజలను అప్రమత్తం చేయడానికి పోలీసు, రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పిఆర్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ సెంటర్ అన్ని జిల్లాలతో అనుసంధానం చేయాలనీ, సర్కిల్ వారిగా అన్ని జిల్లాలలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎమర్జెన్సీ ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలనీ, అందుకు తగ్గ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

## ముఖ్యమంత్రిని కలిసిన వివిధ మైనారిటీ సంఘాల నేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించనున్న నేపథ్యంలో బుధవారం వివిధ మైనారిటీ సంఘాల నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మైనారిటీల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన మైనారిటీ సంఘాల నేతలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అజారుద్దీన్, ఫహీం ఖురేషి, వివిధ మైనారిటీ సంఘాల నేతలు పాల్గొన్నారు.



## ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొంథా తుఫాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అదేశించారు. ఈ మేరకు బుధవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్లతో ఫోన్లో మాట్లాడి మంత్రి పలు సూచనలతో పాటు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంగళవారంరాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రైతులు తమ పంటలను వర్షాల భారీనుండి కాపాడుకోవాలని, తొందరపడి పంటలను అమ్ముకోవొద్దని, వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రజలను వాగులు వంకలు దాటకుండా చూడాలని, అందుకోసం పోలీసు సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్ష ప్రభావంతో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా చెరువుల వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ గా ఉండాలని ఆదేశించిన మంత్రి తుమ్మల అత్యవసర పరిస్థితిలో తప్ప ఇంటి నుంచి బయటికి రావద్దని ప్రజలను కోరారు.

### మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల సమస్యల పరిష్కారానికి

# రేపు డిఇఓ కార్యాలయాల ముట్టడి

### మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల31వ తేదీన తలపెట్టిన డిఈఓ, కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని, జయప్రదం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ వంట కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచకుండా, నాణ్యమైన భోజనాలు అందించాలని, మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజస కాదన్నారు. ఇప్పటికే 11 నెలలుగా అల్పాహారం బిల్లులు, 9 నెలలుగా కోడిగుడ్ల బిల్లులు, 6నెలలుగా వంట బిల్లులు 8 నెలలుగా వేతనాలు పెండింగ్ లోనే ఉంటే, వంట కార్మికులు వంటలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. అంతేకాకుండా ఒక్క కూరకు మాత్రమే డబ్బులు చెల్లిస్తూ, రెండు కూరలు వడ్డించాలని ఒత్తిడి చేస్తే, ఆ నష్టం ఎవరు భరించాలి అన్నారు, కోడిగుడ్డుకు ప్రభుత్వం ఆరు రూపాయలు చెల్లిస్తే, మార్కెట్లో రూపాయలు 7 నుండి 8 వరకు లభిస్తోందని మరి ఈ నష్టాలు ఎవరు చెల్లిస్తారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానం ప్రకారం నెలకు రూ.10 వేలు వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వాన్ని అధికారులను సంప్రదిస్తే ఏమాత్రం స్పందించపోవడం వల్లే తాము తప్పనిసరి పరిస్థితులలో ఈ నెల 31వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలలో వంటలు బందు చేసి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. అప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాకపోతే నవంబర్ 12వ తేదీన కమిషనరేట్ కార్యాలయం ముట్టడికిగాను, చలో హైదరాబాద్ చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆ పరిస్థితి రాకుండా ఉండేలాంటే, తమను ఇబ్బందుల గురి చేయకుండా ప్రభుత్వం, అధికారులు, శాసనసభ్యులు, మంత్రులు కృషి చేయాలని రవీందర్ కోరారు.

## ఇక జనగాంలో.. ఆ రైలు ఆగుతుంది



భువనగిరి ఎంపి చామల కృషి ఫలితం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తన నియోజక వర్గం ప్రజల అవసరాల నేపథ్యంలో విజయవాడ–సికింద్రాబాద్ శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు భువనగిరి రైల్వే స్టేషన్‌లో అదనపు స్టాపేజ్ పెట్టాలని ఏడాది కాలంగా ఆయన పోరాటినికి ఫలిఫలం దక్కింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాత్సవ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి విజయవాడ – సికింద్రాబాద్ శతవాహన ఎక్స్‌ప్రెస్ (రైలు నెంబర్ . 12713/12714) రైలుకు జనగాం రైల్వే స్టేషన్‌లో అదనపు స్టాపేజ్ మంజూరు చేసినట్లు ఆయన ప్రకటించారు. ఈ సదుపాయం ప్రయోగాత్మకంగా 2025 అక్టోబర్ 30వ తేదీ నుండి అమల్లోకి రానుంది. జనగాం జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ఇక్కడి ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు మరియు వ్యాపారవేత్తలు తరచూ హైదరాబాద్, విజయవాడలకు ప్రయాణిస్తుంటారు,శతవాహన ఎక్స్‌ప్రెస్‌కు జనగాం స్టేషన్‌లో స్టాపేజ్ కల్పించడం వలన ప్రజలకు ప్రయాణ సౌలభ్యం పెరుగుతుంది, ప్రాంతీయ కనెక్టివిటీ మెరుగుపడుతుంది. ఈ ప్రజా విజ్ఞప్తిని గౌరవించి తక్షణం స్పందించిన దక్షిణ మధ్య రైల్వే యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను అని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. అలాగే, ఆయన ఈ నిర్ణయం జనగాం పరిసర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కోన్నారు.

## మాజీ మంత్రి హరీష్‌రావుకు చాడ వెంకట్‌రెడ్డి పరామర్శ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎంఎల్‌ఎ టి.హరీష్ రావును బుధవారం కోకాపేటలోని ఆయన నివాసంలో మాజీ ఎంఎల్‌ఎ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మంగళవారం టి.హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు మంగళవారం మృతి చెందడంతో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ సీతారాం నాయక్‌తో కలిసి సత్యనారాయణ రావు చిత్రపటానికి చాడ వెంకట్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మంచితనం, మానవత్వం మూర్తిభావించిన సత్యనారాయణ రావు ప్రభుత్వ ఉద్యోగిగా అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వహించి ఎంతో మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. తన కుమారుడు హరీష్‌రావు రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తూ ప్రజలకు సేవ చేయడం పట్ల తండ్రిగా సత్యనారాయణరావు ఎంతో సంతోషపడేవారన్నారు. ఎంతో గొప్ప వ్యక్తిత్వం ఉన్న సత్యనారాయణరావు అనారోగ్యంతో మృతి చెందడం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి చాడ వెంకటరెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# మత్స్యకారుల కుటుంబాల జీవితాల్లో వెలుగులు

### మంత్రి వాకిటి శ్రీహరి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** చేపలు పెంపకం ద్వారా మత్స్యకారుల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర మత్స్య, పాడి, పశు సంవర్ధక యువజన సర్వీసులు క్రీడలు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా దేరకద్ర నియోజకవర్గం బొల్లారం గ్రామంలో కోయిల్ సాగర్ ప్రాజెక్ట్‌లో రూ.12 లక్షల విలువ గల 7 లక్షల 77 వేల చేప పిల్లలకు గాను మొదటి విడత 2 లక్షల 50 వేల చేప పిల్లలను వంద శాతం సబ్సిడీతో మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మత్స్య శాఖ డి.డి. ఖదీర్ అహ్మద్, మత్స్యశాఖ ఏడి. రాధా రోహిని, మత్స్య సహకారి సంఘాల అధ్యక్షులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా కొయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య సంపద అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 123 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. రూ.94 కోట్లతో 88 కోట్ల చేప పిల్లలను రాష్ట్రంలోని 26000 చెరువుల్లో, రూ.29 కోట్లతో 300 చెరువులలో 10 కోట్ల రొయ్యలను వంద శాతం సబ్సిడీతో వదలు తున్నట్లు తెలిపారు. చేపల పెంపకంతో మత్స్యరంగంపై ఆధారపడ్డ 5 లక్షల మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, జీవనోపాధి కలుగనన్నట్లు తెలిపారు. మక్తల్, నారాయణపేట, దేవరకద్ర నియోజకవర్గంను మొదట అభివృద్ధికి మక్తల్ నియోజకవర్గంతో పాటు ప్రాధాన్యతనివ్వనున్నట్లు తెలిపారు. గత పాలకులు 10 సంవత్సరాలలో చేప పిల్లల ఉత్పత్తిపై దృష్టి పెట్టలేదని అన్నారు. తాను క్యాబినెట్ మంత్రి అయిన తర్వాత మత్స్య శాఖకు ఆరకొరగా కేటాయించిన బడ్జెట్ పెంచాలని అడిగిన వెంటనే రూ.123 కోట్లు చేపల ఉత్పత్తికి కేటాయించారని, రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో రూ.175కోట్లతో 3600 ఇండ్లు మంజూరు కానున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పాలకులు వరి వేస్తే ఉరి అన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యంకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 తెలిపారు. కుటుంబంలో ప్రతి ఒక్కరికి 6 కిలోల సన్న బియ్యం అందచేస్తున్నట్లు తెలిపారు. బొల్లారం గ్రామంలో ఉన్న చేపల పెంపకం కేంద్రం నవీకరణ పనులకు రూ.ఒక కోటి మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. అదే విధంగా కొత్తకోట, మదనాపరం, దేవరకద్రలో చేపల మార్కెట్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభివృద్ధి అ జెండాతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో ప్రజల సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో వలె కాకండా చేపలు 80 ఎంఎం సైజు తక్కువ కాకుండా, ఖచ్చితమైన నంబర్‌తో చేపలపై శ్రద్ధ వహించినట్లు తెలిపారు. వెటర్నరీ ఆసుపత్రులలో మందుల సరఫరాకు చర్యలు తీసుకోవాలని, వెటర్నరీ ఆసుపతులను అప్‌గ్రేడ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మత్స్య శాఖ డి.డి. ఖదీర్ అహ్మద్, మత్స్యశాఖ ఏ.డి రాధా రోహిణి, ఆర్.డి.ఓ నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, ఎం.పి.డి.ఓ శ్రీనివాస రావు, తహశీల్దార్ దీపిక, మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు లు పాల్గొన్నారు.

**దేవరకద్ర మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన ప్రారంభం**

చేప పిల్లలు వదలిన అనంతరం దేవరకద్ర మండలం నార్లోని కుంటలో జి.పి.భవనంను మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. పెద్ద గోపాల్ పూర్, మీనగోయినపల్లి, బలుసుపల్లి గ్రామం ఓపెన్ జిమ్, పార్కుల సుందరీకరణ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తర్వాత దేవరకద్ర మండలంలో ఇందిరమ్మ మోడల్ హౌస్, సహాయక ఇంజనీర్, కార్యాలయం ను ప్రారంభించారు.


ఫారం -VI
(చట్టం-30/2013 లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్ - 1 రూల్ 19 ప్రకారం)
తెలంగాణ ప్రభుత్వం
కలెక్టర్/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)
ప్రాథమిక నోటిఫికేషన్
ఫైల్ నెం.B/67/2022 తేది: -09-2025

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్గొండ గారు మల్లాపురం గ్రామము, పి.ఎ.పల్లి మండలము నల్గొండ జిల్లాలో విస్తీర్ణం **ఎ.2.01 గుంటల** భూమి ప్రజా ప్రయోజనార్ధం నిమిత్తం అనగా 1L Minor of D-7 of AMRSLBC Project కొరకు అవసరము అయియున్నదని భావించబడినది. G.O.Ms. No.54 Irrigation & CAD (LA R&R/A2) Department, dated: 25.07.2017 ప్రకారం The Chapter-II and Chapter-III under Sec-10 A(b) Act No.21/2017 under RFCT LA RR Act, 2013ను మినహాయించనైనది మరియు భూసేకరణ కారణంగా ఎటువంటి కుటుంబాలు నిర్వాసితులయ్యే పరిస్థితి లేదు. కావున ఇట్టి ప్రకటన, పైన తెలుపబడిన ప్రాజెక్ట్‌కు క్రింద **మల్లాపురం గ్రామము, పి.ఎ.పల్లి మండలము** నల్లగొండ జిల్లాలో నిర్దేశించబడిన కొలతల ప్రకారం వచ్చిన విస్తీర్ణం **ఎ.2.01 గుంటల** భూమి భూసేకరణ నిమిత్తం ఈ క్రింద చూపిన విధముగా కలదు.

గ్రామము : మల్లాపురం మండలము : పి.ఎ.పల్లి

| క్రమ సంఖ్య | సర్వే నం. | [illegible] | [illegible] | సేకరించవలసిన విస్తీర్ణం (ఎ.గుం) | పట్టాదారు పేరు / తండ్రి పేరు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు రకము | సంఖ్య | నిర్మాణాలు [illegible] | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 47 | ప్రభుత్వ | మెట్ట | 0.14 | మదాల వెంకటయ్య S/o మల్లయ్య | 48 | 43 | 26 | 46 | మామిడి తాటి ఈత | 22 3 5 | పైప్ లైన్ | - |
| 2 | 64 | పట్టా | మెట్ట | 0.33 1/2 | మారపాకల వెంకటయ్య S/o ఈదయ్య | 63 | 41 | 65 | 52 | బత్తాయి తాటి | 31 5 | పైప్ లైన్ | - |
| | | | | 0.33 1/2 | మారపాకల నర్సింహ S/o ఈదయ్య | | | | | బత్తాయి ఈత | 31 5 | పైప్ లైన్ | |
| మొత్తం విస్తీర్ణం ఎ. 2.01 గుంటలు | | | | | | | | | | | | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం, 2013 (నెం.30/2013) లోని నియమంలోని సెక్షన్ (11)1 ప్రకారం సంబంధించిన వారికై ఇవ్వనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ మరియు భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.) ఎ.ఎం..ఆర్.పి, విభాగము-1, నల్గొండ గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ..), ఎ.ఎం..ఆర్.పి, విభాగము-1, నల్లగొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ (12) నిర్దేశం ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు తవ్వకం పనులు మట్టిలో చేపట్టడానికి మరియు సరైన విధముగా పని గావించుటకు అవసరమైనవన్నీ అనుమతించనైనది.

సెక్షన్ 11 (4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి అనుమతి లేకుండా ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం మరియు ఎలాంటి క్లెయిమ్ చేయరాదు.

భూసేకరణ విషయంలో సంబంధిత వ్యక్తులు ఏదైన అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ/స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), ఏ.యం.ఆర్.పి., యూనిట్-1, నల్లగొండ గార్లకు ప్రకటన జారీచేసిన (60) దినముల లోపల తెలపవలసి ఉన్నది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టరు ఆర్ఆర్.ఎల్,ఎ.,యూనిట్ - 1, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, నల్లగొండ.
సం/- అదనపు కలెక్టరు నల్లగొండ.
సం/- జిల్లా కలెక్టరు నల్లగొండ.
DIPR RO NO. 774/LA/PP/Advt/Pub/2025-26



జల్‌పల్లి మునిసిపాలిటీ కార్యాలయం : రంగారెడ్డి జిల్లా
'E'- ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
Lr. Roc. No. E1/JLPM/MGF/CC Road/SP-077/01/2025-26 తేది: 29.10.2025
జల్‌పల్లి మునిసిపాలిటీలోని వార్డు నెం.24 వద్ద (1 సంఖ్యలు) సిసి రోడ్డు వేయడానికి రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. రూ. 10.50 లక్షలకు టెండర్లను జల్‌పల్లి మునిసిపాలిటీ కమిషనర్ ద్వారా 06.11.2025 మధ్యాహ్నం 03:30 గంటల వరకు స్వీకరించబడతాయి మరియు టెండర్లను మ. 03.31 గంటలకు జల్‌పల్లి మునిసిపాలిటీ కమిషనర్ లేదా అతని డిప్యూటీ, టెండరుదారులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలో తెరుస్తారు.
పిలవబడే టెండర్ల షెడ్యూల్ క్రింద ఇవ్వబడింది:
1. టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకున్న తేదీ : 29.10.2025.
2. ఇ-ప్రొక్యూర్‌మెంట్ పై టెండర్ల దాఖలు : 06.11.2025 మ.03:30 గంటలకు.
3. టెండర్ల ప్రారంభం : 06.11.2025 మ.03:31 గంటలకు
మరిన్ని వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారమ్ అనగా https://tender.telangana.gov.inని సంప్రదించండి. లేదా జల్‌పల్లి మునిసిపాలిటీ కార్యాలయం ఫోన్: 9573904333 / 9652776588.
సం/- కమిషనర్ జల్‌పల్లి మునిసిపాలిటీ
DIPR R.O. No. : 9887-PP/CL/ADVT/1/2025-26, Date: 29-10-2025



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ GHMC
NIT No. Q8/EE/Divn.15/SBZ/GHMC/2025-26 తేది: 28-10-2025

| క్ర. సం. | కింద పేర్కొనబడిన ఐటెమ్స్ కోసం తయారీదారులు, ఫ్యాబ్రికేటర్లు, అథారిటీలు మరియు డీలర్లు, ఏజెన్సీలు మొదలైన వారి నుండి కొటేషన్లు ఆహ్వానించడమైనది. | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్, ప్రారంభ తేది & సమయం / బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా & సెల్ నెం. |
|---|---|---|---|
| 1 | 1) అన్ని ఛార్జీలు మొదలైన మొదలైన వాటితో సహా 2-3 టన్నుల సామర్థ్యం గల 5 HP డీజిల్ ప్లేట్ కాంపాక్టర్ సేకరణ పూర్తి. 2) స్తంభాల ఎత్తు 1200 m.m తెరిచిన పొడవు 3500 m.m మాత్రమే మెట్రో ఫ్లాషర్ మరియు 3m రిఫ్లెక్టివ్ టేప్‌తో కూడిన మెటల్ బారియర్ సరఫరా మరియు డెలివరీ, అన్ని మెటీరియల్ ఛార్జీల ఖర్చు మరియు రవాణాతో సహా పూర్తి. 3) బిటమన్ ఎమల్షన్ RS1సీల్డ్ డ్రమ్ 200లీటర్లు సరఫరా | 29-10-2025 ఉ.11:00గం.ల నుండి 31-10-2025 సా.5.00గం.ల వరకు | సీల్డ్ కొటేషన్లను తేది: 31-10-2025న సా.05.00గం.లు లేదా అంతకు ముందు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-డివిజన్-15, జిహెచ్ఎంసి, పార్కింగ్ కాంప్లెక్స్, 7వ అంతస్తు, అబిడ్స్, హైదరాబాద్‌లో సమర్పించవచ్చు. సెల్: 7995997437 |

పైన పేర్కొనబడిన ఐటెమ్స్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు మరియు పూర్తి స్పెసిఫికేషన్‌లను GHMC. వెబ్‌సైట్: https://ghmc.gov.in/ నుండి పొందవచ్చు.
To,
The notice board
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివిజన్ నెంబర్.15, GHMC.
DIPR R.O. No. : 9909-PP/CL/ADVT/1/2025-26, Date: 29-10-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## డ్రైవర్ తొలగింపు చెల్లదు : హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్ : వైద్య పరీక్షలు చేయకుండా ఆర్టీసీ డ్రైవర్ను ఉద్యోగం నుంచి తొలగించడం చెల్లదని హైకోర్టు తీర్పు చెప్పింది. బ్రీత్ అనలైజర్ టెస్ట్ ఆధారంగా తొలగింపు ఉత్తర్వుల జారీకి వీల్లేదంది. మెడికల్ టెస్టు చేశాక నివేదికలను బట్టి తొలగింపునకు వీలుందని చెప్పింది. అదే విధంగా డ్రైవర్ ధర్నాలో పాల్గొన్నారనే అభియోగాలపై స్పందిస్తూ, ధర్నాలో 13 మంది పాల్గొంటే పిటిషన్ప మాత్రమే చర్యలు చెల్లవంది. మధిర ఆర్టీసీ డిపో మేనేజరు తనను ఉద్యోగం నుంచి తొలగింపునకు చేసిన ప్రతిపాదనలకు అనుగుణంగా డ్రైవర్ ఉద్యోగం నుంచి చట్టబద్ధంగా తనను తొలగించారంటూ వెంకటి వేసిన పిటిషప్ప జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ఈ తీర్పు చెప్పారు. బ్రీత్ అనలైజర్ తరువాత యూరిట్, బ్లడ్ టెస్టు చేసి మందు తాగిందీ లేనిదీ తేల్చకుండా తొలగింపు చెల్లదన్నారు.

## ఎసిబి వలలో పెద్దఅంబర్‌పేట విద్యుతు ఎఇ



ప్రజాపక్షం/రంగారెడ్డి: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఎఇ) ప్రభులాల్ రూ.8000 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు వలలో పడ్డడు.కరెంట్ కనెక్షన్,మీటర్ రీప్లేస్మెంట్,బిల్లింగ్ సమస్యలు పరిష్కరించడానికి ఓ వ్యక్తి నుంచి రూ.8వేలు లంచం డిమాండ్ చేశాడు.బాధితుడు ఎసిబిఅధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.వివరాల్లోకి వెళ్తే..పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారం జ్యోతిపురం కాలనీలోని ఓ కొత్త అపార్టుమెంట్ లో ప్రభులాల్.. 83 కెవి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ తోపాటు కొత్త మీటర్లు బిగించాడు.సర్వీస్ నంబర్లు ఇచ్చేందుకు లైన్ ఇన్స్పెక్టర్ ప్రభులాల్ డబ్బులు డిమాండ్ చేశాడు.రూ.8 వేలు ఇస్తేనే సర్వీస్ నంబర్లు ఇస్తామని స్పష్టం చేశాడు.దీంతో భవన యజమాని ఎసిబి అధికారులను ఆశ్రయించాడు.ఎసిబి అధికారుల సూచనలతో బుధవారం రూ.8 వేలు లంచం డబ్బులను బండ్లగూడ సమీపంలోని తాజా హోటల్లో ప్రభులాల్ కు అందించేందుకు సిద్ధమయ్యాడు.భవన యజమాని డబ్బులు ప్రభులాల్ చేతిలో పెట్టగానే ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.లంచం డబ్బును స్వాధీనం చేసుకున్నారు.ఎవరైనా లంచం అడిగితే తమకు సమాచారం ఇవ్వాలని,అవసరమైతే వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎసిబి అధికారులు పేర్కొన్నారు. పట్టుబడ్డ ప్రభులాల్‌ను అరెస్టు చేసి ఎసిబి కోర్టులో హాజరుపరిచామని,తదుపరి దర్యాప్తును కొనసాగిస్తున్నామని ఎసిబి అధికారులు పేర్కొన్నారు. 2018లోనూ కొత్త మీటర్ల కేటాయింపు కోసం ఓ లైన్మెన్ ఎసిబి అధికారులకు పట్టు పడడం విశేషం.

## పౌర రక్షణ శాఖ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సివి ఆనంద్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ అగ్నిమాపక శాఖ చరిత్రలో మొదటిసారి రాష్ట్ర హోం ప్రిన్సిపల్ సెక్రటరీ సివి ఆనంద్ నానక్‌రామ్‌గూడలోని తెలంగాణ అగ్నిమాపక, విపత్తు ప్రతిస్పందన, అత్యవసర, పౌర రక్షణ శాఖ ప్రధాన కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అదనపు డిజి విక్రమ్‌సింగ్ మాన్‌తో పాటు శాఖ పనితీరుపై సివి ఆనంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అగ్నిమాపక శాఖ పనితీరు, అధికారులు, ఉద్యోగులు సాధిస్తున్న విజయాలు, వారి సమస్యలు అభివృద్ధికి కావలసిన మార్గాలు మొదలయిన వాటి మీద సమీక్షించారు. మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, సాంకేతికత మరియు శాఖలోని బడ్జెట్ స్థానం గురించి వివరణాత్మక ప్రజెంటేషన్ ఇవ్వబడింది. అలాగే, శాఖాపరమైన బాధ్యతలు మరియు చట్టాలు, గత 10 సంవత్సరాలుగా కీలక విజయాలు, ప్రస్తుత చొరవలు మరియు పురోగతి, శాఖాపరమైన సవాళ్లు మరియు ప్రతిపాదిత పరిష్కారాలు, ప్రభుత్వంతో పెండింగ్‌లో ఉన్న సమస్యలు, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చలు జరిగాయి. అగ్నిమాపక శాఖ పనితీరు మరింత పెంచడానికి ప్రభుత్వ స్థాయిలో అన్ని మద్దతులు ఉంటాయని హామీ ఇచ్చారు. క్విక్ రియాక్షన్ వెహికల్, మల్టీ పర్పస్ రెస్పాన్స్ టెండర్ పనితీరును కూడా ఆయన చూశారు.ఈ సమావేశంలో అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రహమాన్ సిద్దిఖీకి ఎదురుదెబ్బ

ప్రజాపక్షం/హైదరాబాద్: సైదాబాద్ చైల్ హోంలో బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే కేసులో అరెస్టయిన సూపర్వైజర్ మహ్మద్ రహమాన్ సిద్దిఖీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అతనిని విడుదలకు ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. హెబియస్ కార్పస్ పిటిషన్ను కొట్టివేసింది. సైదాబాద్ పోలీసులు అక్రమంగా రహమాన్ను అరెస్టు చేసి జైలుపాలు చేశారంటూ అతని సోదరి వేసిన పిటిషన్లో ఉత్తర్వుల జారీకి జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్కుమార్లతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. లైంగికవేధింపుల అరోపణలు తీవ్రమైనవని, విడుదలకు ఆదేశాలు ఇవ్వబోమని చెప్పింది.

## రక్తదానం చేసిన డిజిపి శివధర్‌రెడ్డి

### డిజిపి కార్యాలయంలో తొలిసారి రక్తదాన శిబిరం




ప్రజాపక్షం/హైదరాబాద్: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాల సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలిసారిగా డిజిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించిన కార్యక్రమంలో డిజిపి బి.శివధర్ రెడ్డి రక్తదానం చేశారు. శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్, ఐజిపి లు ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, ఎం.రమేష్ లతో సహా 164 మంది పోలీస్ సిబ్బంది తో పాటు ఆదిక సంఖ్యలో మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులు రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా డిజిపి బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ..... రక్తదానం చేయడం వల్ల మనుషులను ప్రాణాపాయం నుండి కాపాడగలుగుతామన్నారు. రక్తదానం చేయడం వల్ల మూడు రకాలుగా మనుషులకు ఉపయోగపడుతుందని అన్నారు. ఒకరు రక్త దానం చేయడం వల్ల రక్తంతో పాటు, ప్లాస్మా, ప్లేట్లెట్స్ వంటివి మరో ముగ్గురికి ప్రాణదానం చేసే ఆస్కారం ఉందని అభిప్రాయపడ్డారు. బాధితులకు అవసరమైన రక్తాన్ని సేకరించేందుకు అవకాశమున్న ప్రతి ఒక్కరు ముందుకు రావాలని డిజిపి పిలుపునిచ్చారు. గత రెండు రోజుల క్రితం హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నానని, దాదాపు 4,500 యూనిట్ల రక్తాన్ని వారు సేకరించారని వెల్లడించారు. ఏటా ప్రతి ఒక్కరు నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని వైద్యులు చెప్తున్నారని, కనీసం ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడగలుగుతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో దాదాపు 8,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారని రక్తం అందుబాటు ఉన్నట్లయితే అందులో కొంతమంది ప్రాణాలైనా కాపాడగలిగే అవకాశం ఉంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఐజిపి (పిఎల్) ఎం రమేష్ స్వాగతోపన్యాసం చేస్తూ... రక్తదాన శిబిరం డిజిపి కార్యాలయంలో నిర్వహించడం ఇది తొలిసారి అని పెద్ద ఎత్తున పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎఐజి రమణ కుమార్, నాగరాజు, డాక్టర్ పిచ్చిరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీరాములు, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి తదితరులు రక్తదాన శిబిరం కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాజీ మంత్రి హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు చిత్రపటానికి నివాళి అర్పించి ఆయన కుటుంబాన్ని పరామర్శించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పార్టీ సీనియర్ నేతలు అజీజ్‌పాషా, మాదాల రవి, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రీ. క్రింది చిత్రంలో టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ తదితరులు.

## భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేస్తున్నా : ట్రంప్




సియోల్: భారత్‌–అమెరికా మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న తరుణంలో దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న ట్రంప్ బుధవారం మాట్లాడుతూ, భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేస్తున్నానని అన్నారు. జియోంగ్జులో ఆసియా–పసిఫిక్ ఆర్థిక సహకారం (ఎపెక్) సిఇఓల శిఖరాగ్ర సమావేశంలో మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీపట్ల తనకు గొప్ప గౌరవం, ప్రేమ ఉనానయన్నారు. "మీరు భారత్, పాకిస్థాన్‌లను చూడండి...ఇప్పుడు నేను భారతదేశంతో వాణిజ్య ఒప్పందం కుదురుస్తున్నా, ఆ దేశం అంటే నాకు చాలా గొప్ప గౌరవం, ప్రేమ, మీకు తెలుసుకదా, ప్రధానమంత్రి నరేంద్రమోదీకీ నాకూ మధ్య గొప్ప సంబంధాలు ఉన్నాయి'' అన్నారు. ఐతే వాణిజ్య ఒప్పందం గురించి తదుపరి ఎలాంటి వివరాలు చెప్పకుండా మరోసారి ట్రంప్ భారత్–పాకిస్థాన్ మధ్య గడచిన మే నెలలో జరిగిన సంఘర్షణ గురించి,దానిని తాను పరిష్కరించిన తీరు గురించీ మాట్లాడారు. భారత్–అమెరికా మధ్య సంబంధాలు చిక్కుల్లో పడిన నేపథ్యంలో ట్రంప్ ఈ సైనిక సంఘర్షణ విషయం లేవనెత్తుతూ వస్తున్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు జరిమానాగా 25 శాతం సుంకాలు భారత్‌పై విధించారు. మరో 25 శాతం అదనపు సుంకాలు విధించారు. ఐతే ఈ విధంగా సుంకాలు విధించడం న్యాయసమ్మతం కాదని భారతదేశం చెబుతూ వస్తోంది. గడచిన సోమవారంనాడు భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్, అమెరికా ఆర్థికమంత్రి మార్కో రుబియో ఇద్దరూ మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన 'ఏసియన్ (ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం) శిఖరాగ్ర సదస్సు సందర్భంగా సమావేశమైన ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై సంభాషణల పరిణామాలను విస్తారంగా చర్చించారు. ఐనప్పటికీ కూడా రష్యా చమురు కొనుగోలుకు జరిమానాగా విధించిన 25 శాతం సుంకాలను తొలగిస్తున్నట్లుగా అమెరికా ప్రతినిధి భారత్‌కు ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. రష్యా నుండి చమురు కొనుగోళ్ళను గణనీయంగా తగ్గించుకుంటామని, ఈ ఏడాది చివరి నాటికి దాదాపుగా రష్యా చమురు కొనుగోళ్ళు నిలిపివేస్తామని నరేంద్రమోదీ తనకు హామీ ఇచ్చారంటూ గడచిన రెండు వారాలుగా డోనాల్డ్ ట్రంప్ ఎక్కడికి వెళ్ళినా మీడియా ద్వారా నానా యాగీ (అల్లరి) చేస్తున్నారు. ఐతే భారత్ మాత్రం ఈ నాయకులిద్దరిమధ్యా ఆ విషయంపై ఎలాంటి సంభాషణా జరగలేదని చెబుతున్నది.

## ధరూర్‌లో అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లాలోని ఈ నెల 13 వ తేదీన ధరూర్ గ్రామంలో తెల్లవారుజామున ఇంటి తాళాలు పగలగొట్టి ఇంటిలో గల బంగారు, వెండి నగదును దొంగిలించినారని అని ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ వారు కేసు నమోదు చేసి జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ ఎస్సై ఎన్.సధాకర్, మెట్ పల్లి ఎస్సై కిరణ్ కుమార్, బీర్పూర్ ఎస్సై రాజు వారి సిబ్బంది సాంకేతిక పరిజ్ఞాన నిపుణులైన మల్లేష్, మహేష్, రాజశేఖర్ లతో మూడు స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి నిందితులకు గురించి గాలింపు చర్యలు చేపట్టి, సాంకేతిక పరిజ్ఞానంతో కొద్దిరోజుల క్రితం ముగ్గురు నిందితులను పట్టుకొని బంగారు ఆభరణాలు రికవరీ చేసి నిందితులను జైలుకు పంపమని జగిత్యాల డీఎస్పీ తెలిపారు.



శంషాబాద్‌లో జరిగిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కుమారుడు సిద్ధార్థ చంద్ర వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు.

## కేంద్ర నిధులు ఇతర కార్యక్రమాలకు మళ్లించవద్దు : బండి సంజయ్




ప్రజాపక్షం/కరీంనగర్: పార్టీలకతీతంగా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, రాష్ట్రంలో అత్యధికంగా కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గానికి కేంద్ర నిధులు తీసుకువచ్చామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, జిల్లా అభివృద్ధి, కోఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ (దిశ) చైర్మన్ బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి, కో ఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు పరిధిలో ఏ పార్టీకి చెందిన వారైనా నియోజకవర్గ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని తెలిపారు. రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులే కారణమని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని వెల్లడించారు. 851 కోట్ల రూపాయల ఎంపి నిధులను కరీంనగర్ అభివృద్ధికి కేటాయించామని అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఆధునిక సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో హుజురాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట, సిరిసిల్ల ఆసుపత్రులకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయిస్తున్నామని, అందుకు తగిన విధంగా సిబ్బందిని వైద్యులను నియమించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు 15వేల సైకిళ్లు ఉచితంగా అందజేశామని, మరో 5వేల సైకిళ్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ తగ్గాయని అన్నారు. పీఎంశ్రీ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. గన్నేరువరం బ్రిడ్జి, కేంద్రం సేతు బంధన్ పథకం ద్వారా మంజూరు చేసిన కరీంనగర్ ఆర్‌వోబి నిర్మాణం తదితర పనులన్నీ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు రోజువారీ నివేదికుల సమర్పించేందుకు ఉచితంగా ట్యాబ్ అందజేస్తామని తెలిపారు. సోలార్ పవర్ వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. విద్య,వైద్యం తదితర రంగాల్లో కేంద్రం అనేక నిధులు వెచ్చించి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులున్నారు.

## 44 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలు

### ఎఐటియుసి డిమాండ్




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 44 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ (పిఆర్‌సి) అమలు చేయాలని ఎఐటియుసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్.మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రోజు నిర్మల్ ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన యూనియన్ సమావేశంలో మూర్తి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2023 జులై నెల నుంచి అమలు కావాల్సిన పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని, ఐదు విడతల డిఎ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి మాట్లాడుతూ వైద్య శాఖలో గత 60సంవత్సరాలుగా గుర్తింపు పొందిన యూనియన్‌గా ఉద్యోగులకు ఎన్నో విజయాలు సాధించి పెట్టిందన్నారు. ఇటీవల కాలంలో కొందరు అధికారులు యూనియన్ నాయకులను మినహాయించకుండా బదిలీలు జరిపితే,రాష్ట్ర హైకోర్టు జోక్యం చేసుకొని వాటిని రద్దు చేసి, వారికి రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేసిందని ఆయనగుర్తు చేశారు.

వైద్యశాల చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ విజయ లక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పూర్వపు పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 317జి.ఓ ద్వారా ఇప్పటికీ న్యాయం జరుగని ఉద్యోగులందరినీ తక్షణం ఆదుకోవాలని, మహిళా నర్సింగ్ ఆర్డర్లీలకు ఇస్తున్న అదనపు ఇంటి అద్దె అలవెన్స్ పురుషులకు కూడా చెల్లించాలని, టివివిపిలో అసిస్టెంట్ కమిషనర్(నర్సింగ్) పోస్ట్‌ను తక్షణం భర్తీ చేయాలని కోరారు. సీనియర్ చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ వనజ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిన నర్సింగ్ డైరెక్టరేట్‌ను తక్షణం ఏర్పాటు చేయాలని కోరుతూ యూనియన్ నాయకులను అభినందించారు.

**నూతన కార్యవర్గ ఎన్నిక..**

యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎన్.విజయలక్ష్మి, అధ్యక్షురాలుగా బి.శేఖర్, కార్యనిర్వాహక అధ్యక్షురాలుగా అపర్ణ, ఉపాధ్యక్షులుగా జయ లక్ష్మి, తిరుపతి,రజనీకాంత్, ప్రశాంత్ కుమార్, కార్యదర్శిగా సి.హెచ్. రాకేష్, బి.రాజ్‌కుమార్,అనీల్, కోశాధికారిగా వి.పుష్పలత ఎన్నికయ్యారు.

## రేపు డిఇఒ కార్యాలయాల ముట్టడి

జంపాల రవీందర్

ప్రజాపక్షం/హైదరాబాద్:మధ్యాహ్నం భోజన పథకం వంట కార్మికుల సమస్యలను పరిష్కారం కోరుతూ శుక్రవారం రాష్ట వ్యాప్తంగా అన్ని డిఇఒ కార్యాలయాలను ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ తెలిపారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచకుండా, నాణ్యమైన భోజనాలు అందించాలని, మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ఇప్పటికే 11 నెలల అల్పాహారం బిల్లులుపెండింగ్లో ఉన్నాయి అన్నారు, అలాగే కోడిగుడ్ల బిల్లులు 9 నెలలు పెండింగ్లో ఉన్నవి అన్నారు, అలాగే వంట బిల్లులు ఆరు నెలలుగా, వేతనాలు 8 నెలలుగా పెండింగ్ లోనే ఉంటే,వంట కార్మికులు వంటలు ఎలా చేస్తారు అని ప్రభుత్వాన్ని, అధికారులను నిలదీశారు. అలాగే కోడిగుడ్డుకు ప్రభుత్వం ఆరు రూపాయలు చెల్లిస్తే,మార్కెట్లో రూపాయలు 7 నుండి 8 వరకు లభిస్తున్నది, మరి ఈ నష్టాలు ఎవరు చెల్లిస్తారు అన్నారు,దానితో పాటుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానం ప్రకారం రూపాయలు 10000 వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారు అన్నారు,,ఈ సమస్యలపై ప్రభుత్వాన్ని అధికారులను సంప్రదిస్తే ఏమాత్రం పట్టించుకోకపోవడం వలన, ప్రభుత్వం దృష్టికి మా సమస్యలు తీసుకుపోవాలని లక్ష్యంతో,తప్పనిసరి పరిస్థితులలో ఈ నెల 31 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలలో వంటలు బందు చేసి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల ముట్టడినికి పిలుపునివ్వడం జరిగింది .

## అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

### రొంపికుంట పంచాయతీ కార్యదర్శి విధుల నుంచి తొలగింపు : కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సంబంధించి ఎటువంటి అక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. బుధవారం కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామం జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఎం.తిరుపతి విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు. వారధి సొసైటీ ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా కమాన్ పూర్ మ ండలం రొంపికుంట గ్రామానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న ఎం.తిరుపతి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన కలెక్టర్, అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో వెంటనే సంబంధి త ఔ ట్ సోర్సింగ్ ఉద్యోగ సేవలను టర్మినేట్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తుందని, ఎ టువంటి అక్రమాలకు పాల్పడినా అత్యంత కఠిన చ ర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.



**గ్రామాలను పరిశుభ్రంగా తయారు చేయాలి**

గ్రామాలను పరిశుభ్రంగా తయారు చే యాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీ శాఖ ప నితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్రమ నిర్మాణా ల చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని, నవంబర్ 3నుంచి నవంబర్ 11 వరకు పెద్దపల్లి జిల్లాలోని ప్రతి గ్రామంలోప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని, గ్రామాలలో ప్లాస్టిక్ ఎక్కడ ఉండడానికి వీలు లేదని, చిన్న కవర్ కూడా ఉండవద్దని, ఆరితీలో పారిశు ధ్య పనులు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు ఎవరు బయట చెత్త వేయడానికి వీలులేదని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, ఎంపిఓలు, అధికారులు, పాల్గొన్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## 12 రాష్ట్రాలు, యుటిల్లో పెరగనున్న పోలింగ్ కేంద్రాలు

**న్యూఢిల్లీ:** వచ్చేవారం నుంచి 12 రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాల్లో (యుటి) ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణను (సర్) ఎన్నికల సంఘం నిర్వహించనుంది. అయితే ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఓటింగ్ క్యూలను తగ్గించడానికి మరిన్ని పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే బిహార్‌లో సర్ పూర్తికాగా, ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,500 మంది ఓటర్లతో దేశంలోనే మొదటి రాష్ట్రంగా అవతరించింది. హేతుబద్ధీకరణ కసరత్తులో భాగంగా ఎక్కువ పోలింగ్ కేంద్రాలు రానున్నాయి. బిహార్ తరహాలో ఇక్కడ ఈ సంఖ్య గతం లో 77,895 నుండి 90,712 కు పెరిగింది. అదే విధంగా హేతుబద్ధీకరణ అంటే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి తమ వంతు కోసం వేచి ఉన్నప్పుడు తక్కువ సమయం క్యూలలో గడపవలసి ఉండడమే. నవంబర్ 4న సర్ కసరత్తు ప్రారంభమయ్యే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సం ఘం సూచనల ప్రకారం ఎత్తయిన భవనాలు, నివాసి సంక్షేమ సంఘాలు ఉన్న కాలనీలు, మురికివాడల సమూహాలలో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

# ఓట్ల కోసం మోదీ ఏదైనా చేస్తారు!

### నృత్యం చేయడానికైనా సిద్ధంగా ఉన్నారు
### బిహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ విమర్శ



ముజఫర్‌నగర్/దర్భాంగ : ఓట్ల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఏదైనా చేస్తారని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. బిహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని బిజెపి 'రిమోట్ కంట్రోల్ ద్వారా' నడుపుతోందని ఆరోపించారు. రాహుల్ బుధవారం బిహార్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముజఫర్‌పూర్, దర్భంగాలలో నిర్వహించిన ర్యాలీల్లో పాల్గొన్నారు. ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్‌తో కలిసి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల్లో లబ్దిపొందడానికి ఏదో ఒక డ్రామా ఆడుతారని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఛట్ పూజ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ యమునా నదిలో స్నానం చేస్తానని చెప్పారని, అయితే నదిలో కాకుండా నది పక్కన ఒక కుంటను తవ్వించి, అందులో పైప్ ద్వారా స్వచ్ఛమైన నీళ్లను నింపించి స్నానం చేశారని తెలిపారు. ఈ చర్య ద్వారా యమునా నదిలో మురుగు నీరు ప్రవహిస్తుందనే నిజాన్ని దేశానికి తెలియజెప్పారని ఎద్దేవా చేశారు. ఎన్నికల కోసం ప్రధాని ఈ డ్రామా ఆడారని, అయితే కుంటలోకి స్వచ్ఛమైన నీళ్లను వదిలేందుకు ఏర్పాటు చేసిన పైపు ఫొటో బయటపడటంతో ఆ డ్రామా బెడిసికొట్టిందని రాహుల్ చెప్పారు. తర్వాత జరిగే ప్రధాని ప్రచార సభలో ఓ 200 మంది లేచి ఓట్ల కోసం డ్యాన్స్ చేయాలని ప్రధానిని కోరితే వెంటనే డ్యాన్స్ మొదలవుతుందని రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ఏకంగా భరతనాట్యమే చేస్తారని ఆయన విమర్శించారు. ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్ నాయకత్వంలో బిహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని, కుల, మతాలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రయోజనాలను జాగ్రత్తగా చూసుకుంటారన్నారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారనే భ్రమ నుంచి బయటపడాలని, తాను రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా అత్యంత వెనుకబడిన వర్గాలను కోరుతున్నానన్నారు. ఇది రిమోట్ కంట్రోల్ ద్వారా నడిచే ప్రభుత్వమని, బిజెపి, బిహార్‌ను పట్టించుకోదని విమర్శించారు. మీరంతా ధరించే దుస్తులు ఎక్కువగా చైనాలో తయారు చేసిన లేబుల్‌ను కలిగి ఉంటాయని, వాటిని బిహార్‌లో తయారు చేసిన వాటితో భర్తీ చేసే రోజును తాను చూడాలనుకుంటున్నానన్నారు. కానీ పెద్ద వ్యాపార సంస్థలకు పనిచేసే విధానంలో ఇది జరగదన్నారు. నోట్ల రద్దు, లోపభూయిష్ట జిఎస్‌టి వంటి చర్యల ద్వారా బిజెపి నాశనం చేసిన చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం అవసరమన్నారు. కాంగ్రెస్ పట్టుదల వల్లే మోదీ ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిందని గాంధీ పేర్కొన్నారు. 'రెండు భారతదేశాలు ఆవిర్భవిస్తున్నాయి. ఒకటి సా మాన్య ప్రజలకు చెందినది, మరొకటి ఐదుగురు లేదా పది మంది బిలియనీర్లకు చెందినది. బిహార్ వంటి ప్రాంతాలు పేదరికంలో ము నిగిపోవడానికి ఇదే కారణం, దాని విస్తారమైన సామర్థ్యం ఉపయోగించబడకుండానే ఉంది' అని ఆయన ఆరోపించారు. చౌకైన ఇంటర్నెట్ పేదలకు కూడా సోషల్ మీడియాను అందుబాటులోకి తెచ్చిందని ప్రధాని చెప్పుకుంటున్నారని, అయితే టెలికాం రంగంలో ఒక వ్యాపార సంస్థ గుత్తాధిపత్యాన్ని తాను అను ప్రజలు ఉద్యోగాలులేక రీల్స్, ఇన్‌స్టాగ్రామ్‌కు బానిస కావాలని ఆయన కోరుకుంటున్నారని మండిపడ్డారు. అమెరికా ఒత్తిడితో ఆపరేషన్ సిందూర్ ఆగిపోయిందని పదే పదే చెబుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఖండించాలని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. బిజెపి మహారాష్ట్ర, హర్యానాలో ఎన్నికలను దొంగిలించిందని, బీహార్‌లో కూడా అదే చేయడానికి ప్రయత్నిస్తుందని ధ్వజమెత్తారు. బిహార్‌లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రయోజనాలు కాపాడుతామని రాహుల్ గాంధీ హామీనిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. రాష్ట్ర ప్రజలు తమ సామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునిక నలంద విశ్వవిద్యాలయానికి కాంగ్రెస్ హయాంలోనే నాంది పడిందన్నారు. భవిష్యత్తులో అమెరికన్లు సైతం తమ ఉన్నత విద్య కోసం ఇక్కడికి వస్తారని జోస్యం చెప్పారు.

**ఫ్యాక్టరీలు గుజరాత్‌కు... బిహార్‌లో గెలుపు కావాలా: తేజస్వీ**

తేజస్వి యాదవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లో ఫ్యాక్టరీలను తెరవడానికి ఆసక్తి చూపుతున్నారని, కానీ బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఆర్‌జెడి నేతృత్వంలోని ప్రతిపక్షం అధికారంలోకి వస్తే వంట గ్యాస్ సిలిండర్లను రూ.500లకు అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. బిహార్ ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్నారు. రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఇటీవల కాలంలో తీసుకున్న అనేక ప్రజాకర్షక చర్యలు తాను గతంలో ఇచ్చిన హామీలకు 'కాపీ' అని కూడా ఆయన పేర్కొన్నారు. ఒక ఉదాహరణను ఉటంకిస్తూ, తాము మేము 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును హామీ ఇచ్చామని, అధికారంలో ఉన్నవారు ఇది ఓటర్లను ఆకట్టుకుంటుందని భయపడి 125 యూనిట్లను ఉచితంగా ఇస్తున్నారని ఆరోపించారు. నితీశ్ కుమార్‌ను విమర్శిస్తూ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని బిజెపి రిమోట్ కంట్రోల్‌బిహార్‌లో ఓట్లు కోరుతూ గుజరాత్‌లో మాత్రమే ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయడం పట్ల శ్రద్ధ వహించే బయటి వ్యక్తుల (బహారీ) నియంత్రణలో ఉన్న ప్రభుత్వాన్ని మనం బిహారీలు తరిమికొట్టాలని విజ్ఞప్తి చేశారు. తన కుటుంబంపై ఉన్న అవినీతి మరకలను , ఆర్‌జెడి పాలనపై ఎన్‌డిఎ మోపిన 'జంగల్ రాజ్' ఆరోపణలను గుర్తుంచుకున్న యాదవ్, ఈ రెండు ఉపద్రవాలపై రాజీలేని వైఖరిని అవలంబిస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

# అన్ని చోట్లా సర్‌ను వ్యతిరేకిస్తాం

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ



**వయనాడ్ :** పార్లమెంటు లోపల, వెలుపల చేసినట్లుగానే కేరళలో ఓటర్ల జాబితాల ఎస్‌ఐఆర్ అమలును తమ పార్టీ వ్యతిరేకిస్తుందని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా స్పష్టం చేశారు. కేరళతో సహా అనేక రాష్ట్రాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ చర్య గురించి విలేకరుల ప్రశ్నలకు వయనాడ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రియాంక సమాధానమిచ్చారు. 'కేరళతో సహా అనేక రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల సర్‌ను అమలు చేయాలని ఎన్నికల సంఘం యోచిస్తోంది. మేము దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తాము' అని ఆమె అన్నారు. 'వారు (ఇసి) బిహార్‌లో దీన్ని ఎలా చేశారో చూస్తే, పార్లమెంటులో, ప్రతిచోటా దీనికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాము' అని కాంగ్రెస్ ఎంపి బదులిచ్చారు. ఈ చర్యను 'ఎన్నికలలో మోసం, మోసం చేయడానికి ఏకైక మార్గం' అని పేర్కొన్నారు. బిహార్‌లో నిర్వహించిన విధంగా సర్ ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుందని ఆమె ఆరోపించారు. బిహార్‌లో ఏం జరిగిందో, అక్కడ సర్‌ను ఎలా అమలు చేశారో మనమంతా చూశామన్నారు. ప్రతి రాష్ట్రంలో వారు అదే చేయబోతున్నట్లయితే, అది ప్రజాస్వామ్యానికి అవమానం, మనం దానిపై పోరాడాలి అని ప్రియాంక సూచించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రియాంక వయనాడ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె తన నియోజకవర్గంలో అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. మంగళవారం ఉదయం కరిపూర్ విమానాశ్రయానికి చేరుకుని రోడ్డు మార్గంలో వయనాడ్‌కు ప్రయాణించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ముందు రోజు, ఆమె తన నియోజకవర్గం పరిధిలోకి వచ్చే మలప్పురం జిల్లాలోని ఎర్నాడ లో కొత్తగా నిర్మించిన రాజీవ్ గాంధీ స్మారక ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ భవనాన్ని ప్రారంభించారని వారు తెలిపారు.

# నకిలీ ఓటర్లను తొలగించండి

### పశ్చిమ బెంగాల్‌లో సిఇఒకు లెఫ్ట్‌ఫ్రంట్ మెమోరాండం

**కోల్‌కతా :** మృతి చెందిన, నకిలీ ఓటర్లను తొలగించాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) తర్వాత నిజమైన ఓటర్లను చేర్చాలని ఎన్నికల సంఘాన్ని పశ్చి మ బెంగాల్‌లోని లెఫ్ట్ ఫ్రంట్ డిమాండ్ చేసింది. 12 రాష్ట్రాలు, యుటిల్లో సర్ చేపడుతామని ప్రకటించిన నేపథ్యంలో ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ)కి ఒక మెమోరాండంను సమర్పించింది. ఆధార్, ఓటరు, ఉద్యోగం, రేషన్‌కార్డులను అర్హత కలిగిన ఓటరుకు రుజువుగా అంగీకరించాలని విజ్ఞప్తి చేసింది. సర్ పౌరసత్వాన్ని ధృవీకరించే ప్రక్రియ కాదని ఇసి ప్రచారం చేయాలని లెఫ్ట్ ఫ్రంట్ ఆ మెమోరాండంలో పేర్కొంది. మెమోరాండంపై సంతకం చేసిన వారిలో సిపిఐ, సిపిఐ(ఎం), ఆర్‌ఎస్‌పి, ఎఐఎఫ్‌బి, సిపిఐ (ఎంఎల్), సిపిఐ (ఎంఎల్) లబిరేషన్, ఎస్‌యుసిఐ(సి) నాయకులు ఉన్నారు. సర్ గురించి ప్రజలలో ముఖ్యంగా వెనుకబడిన వర్గాలలో గందరగోళం సృష్టించడానికి కొన్ని విభాగాల నుండి ప్రయత్నం జరుగుతోందని పేర్కొంటూ, పోల్ ప్యానెల్ ప్రజలకు ఈ అంశంపై స్పష్టతను నిర్ధారించాలని లెఫ్ట్ ఫ్రంట్ పేర్కొంది. అన్ని రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం సర్‌కు సంబంధించిన వివరణాత్మక మార్గదర్శకాలను అందించాలని పేర్కొంటూ, భారతీయ పౌరుల పేర్లను ఓటర్ల జాబితా నుండి మినహాయించకూడదని విజ్ఞప్తి చేశారు. పశ్చిమ బెంగాల్ నుండి వలస వచ్చిన కార్మికుల ఓటు హక్కులను కాపాడటానికి ఇసి ఆదేశాలు ఇవ్వాలని, ఇతర ప్రాంతాలలో చదువుతున్న విద్యార్థులు వారి స్వస్థల నియోజకవర్గాల ఓటరు జాబితాలో వారి పేర్లు ఉండాలి వామపక్షనేతలు పేర్కొన్నారు. సరైన ఓటర్ల జాబితాతో రాష్ట్రంలో ఎన్నికలు జరిగేలా చూసుకోవాలని తాము ఎన్నికల సంఘాన్ని కోరుతున్నామన్నారు. సర్ విధానం పారదర్శకతను నిర్ధారించడానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, కమిషన్‌తో కూడిన కమిటీలను ఏర్పాటు చేయాలని లెఫ్ట్ ఫ్రంట్ ఇసిని కోరింది. మెమోరాండం సమర్పించే ముందు జరిగిన సభలో ప్రసంగించిన లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమాన్ బోస్, 1952 నుండి దేశంలో కాగా, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రానున్న ఎన్నికలపై ప్రజలలో భయానక మానసిక స్థితి సృష్టించబడుతున్న విధానం అపూర్వమైనది, ఆశ్చర్యకరమైనదని బోస్ నొక్కిచెప్పారు. కేంద్రంలో, పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న పార్టీలు ఓటర్లకు సహాయం చేస్తున్నామని చెప్పి వారిలో అపోహలు వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

# రాఫెల్‌లో రాష్ట్రపతి గగన విహారం

### ఇది మరపురాని అనుభూతి
### అని రాష్ట్రపతి ఉద్ఘాటన



**అంబాలా (హర్యానా) :** రాఫెల్ యుద్ధ విమానంలో విహరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ దేశ రక్షణ సామర్థ్యాలు తనలో కొత్త గర్వాన్ని నింపిందని, ఇది 'ఒక మరపురాని అనుభూతి'గా ఆమె అభివర్ణించారు. బుధవారం ఆమె ఇక్కడి ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుండి విహరించిన తర్వాత తన ప్రయాణ అనుభూతిని తెలియజేశారు. రాష్ట్రపతి ముర్ము తన పర్యటన సందర్భంగా స్క్వాడ్రన్ లీడర్ శివాంగీ సింగ్‌తో కలిసి ఆకాశంలో విహరించడానికి ముందు ఫోటోలు దిగడంతో శివాంగీ సింగ్ వార్తల్లో నిలిచారు. శివాంగీ సింగ్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఆమె గురించి తెలుసుకునేందుకు నెటిజన్లు శోధిస్తున్నారు. దేశంలోనే మొట్టమొదటి మహిళా రాఫెల్ జెట్ పైలట్ అయిన శివాంగీ సింగ్ పహల్గాం దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో దాయాది పాకిస్థాన్ సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం చేశారు. భారత్ రాఫెల్ విమానాలను కూల్చివేశామని, ఒక మహిళా పైలట్‌ను బంధించామని తన అనుకూల సోషల్‌మీడియాలో పాకిస్థాన్ అసత్యాలు ప్రచారం చేసింది. మే 10న 'దిప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్' ఇది నకిలీది అని ఆరోపించింది. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాఫెల్ జెట్‌లో ప్రయాణించగా, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ కూడా అదే వైమానిక స్థావరం నుండి ఒక ప్రత్యేక ఎయిర్ క్రాఫ్ట్‌లో ప్రయాణించారు. భారత వైమానిక దళం నుండి రెండు యుద్ధ విమానాలను తీసుకున్న మొదటి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2023 ఏప్రిల్‌లో, అసోంలోని తేజ్‌పూర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుండి సుఖోయ్30 ఎంకెఐ ఫైటర్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. మాజీ రాష్ట్రపతులు ఎ.పి.జె. అబ్దుల్‌కలామ్, ప్రతిభాపాటిల్ 2006 జూన్ 8న, 2009 నవంబరు 25l పుణే సమీపంలోని లోహెగాన్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుండి తీసుకున్న సుఖోయ్30 ఎంకెఐ యుద్ధ విమానాలలో ప్రయాణించారు. రాఫెల్ జెట్‌ను ఎక్కడానికి ముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒక జిసూట్ ను ధరించారు. ఎయిర్ చీఫ్ మార్షల్, మరికొంతమంది ఇతర సీనియర్ భారత వైమానిక దళం అధికారులతో ఫోటోలు దిగారు. ఉదయం 11.27గంటలకు విమానం ఆఫ్ అయ్యే ముందు ఆమె విమానంలోపలి నుండి చెయ్యి ఊపింది. ఆమె తన బొటనవేలును పైకి చూపుతూ సంజ్ఞ చేయడం కూడా ఒక చిత్రంలో కనిపించింది. ఈ విహారం దాదాపు 30 నిమిషాల పాటు కొనసాగింది. దాదాపు 200 కి.మీటర్లు ప్రయాణించి తిరిగి ఇక్కడి వైమానిక దళ కేంద్రానికి చేరుకుంది. ఈ ఎయిర్ క్రాఫ్ట్‌ను 17వ స్క్వాడ్రన్ యొక్క కమాండింగ్ ఆఫీసర్ గ్రూప్ కెప్టెన్ అమిత్ గెహానీ నడుపుతారని రాష్ట్రపతి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది.ఈ ఫైటర్ జెట్ సముద్ర మట్టానికి ఎగువన దాదాపు 15,000 ఫీట్ల యెత్తున దాదాపు గంటకు 700 కి.మీటర్ల వేగంతో ప్రయాణించిందని ఆ ప్రకటన తెలియజేసింది. బుధవారం ఉదయం ఇక్కడి వైమానిక స్థావరానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సామరస్య పూర్వక గౌరవ వందనం లభించింది. అనంతరం రాష్ట్రపతి ఇక్కడి సందర్శకుల పుస్తకంలో ఒక సంక్షిప్త నోట్‌ను రాశారు. ముర్ము మాట్లాడుతూ 'భారత వైమానిక దళం యొక్క రాఫెల్ ఎయిర్ క్రాఫ్ట్‌లో నా తొలి విమానం కోసం అంబాలా లోని వైమానిక దళ స్టేషన్‌ను సందర్శించడం నాకు చాలా ఆనందంగా ఉంది. రాఫెల్‌లో సార్టీ నాకు మరపురాని అనుభవాన్ని మిగిల్చింది' అని రాష్ట్రపతి తన అనుభూతిని పంచుకున్నారు. 'శక్తివంతమైన రాఫెల్ విమానంలో ఈ మొదటి విమానం దేశ రక్షణ సామర్థ్యాలపై కొత్త గర్వాన్ని నింపింది. ఈ విన్యాసాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు, భారత వైమానిక దళం, అంబా లా వైమానిక దళ స్థావరం మొత్తం బృందాన్ని నేను అభినందిస్తున్నాను' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. ఈ సందర్భంగా రాఫెల్ గురించి, భారత వైమానిక దళం కార్యాచరణ యొక్క సామర్థ్యాల గురించి కూడా రాష్ట్రపతికి వివరించారు.

# బిహార్ సిఎం, ప్రధాని పదవులకు ఖాళీల్లేవ్

### ఆర్‌జెడి, కాంగ్రెస్‌పై అమిత్ షా విమర్శలు

**దర్భంగా/సమస్తిపూర్/బెగుసరాయ్ :** ఇండియా కూటమిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ తన కుమారుడు తేజస్వీని బిహార్ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని తన కుమారుడు రాహుల్‌ను ప్రధానమంత్రిగా చేయాలని చూస్తున్నారన్నారు. అయితే ఆ రెండు పదవులూ ఖాళీగా లేవన్నారు. బుధవారం బిహార్ దర్భంగాలో జరిగిన బహిరంగ ర్యాలీలో షా మాట్లాడుతూ అరెస్టయిన రాడికల్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్‌ఐ) సభ్యులు కాంగ్రెస్-ఆర్‌జెడి కూటమి బిహార్‌లో అధికారంలోకి వస్తే జైలులో ఉంటారా అని ప్రశ్నించారు. బిజెపి చాలా మంది యువకులకు బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు టిక్కెట్లు ఇచ్చింది, కానీ ఆర్‌జెడి, కాంగ్రెస్ ఇవ్వలేదని, ఎందుకంటే లాలూజీ తన కుమారుడు తేజస్వీని ముఖ్యమంత్రిగా చేయాలని, సోనియాజీ కూడా తన కుమారుడు రాహుల్‌ను ప్రధానమంత్రిగా చేయాలని కోరుకుంటున్నారన్నారు. లాలూ ప్రసాద్ పశుగ్రాసం, బిటుమెన్, భూమి ఉద్యోగాల కుంభకోణాలలో ఇరుక్కున్నారని ఆరోపిస్తూ మహాఘట్‌బంధన్‌ను 'దొంగ బంధన్'గా అభివర్ణించారు. కాంగ్రెస్ రూ. 12 లక్షల కోట్ల విలువైన అవినీతి కేసుల్లో చిక్కుకుందని ఆరోపించారు. బెగుసరాయ్ జిల్లాలో జరిగిన ర్యాలీలో షా ప్రసంగిస్తూ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఓటరు అధికార్ యాత్రను ప్రస్తావిస్తూ, రాహుల్ కొన్ని నెలల క్రితం బిహార్‌కు వచ్చి చొరబాటుదారులను రక్షించు యాత్రను ప్రారంభించారన్నారు. సమస్తిపూర్‌లో జరిగిన మరో ర్యాలీలో షా మాట్లాడుతూ, బిహార్ ఎన్నికలు రాష్ట్రంలో ఆటవిక రాజ్యం తిరిగి రాకుండా నిరోధించే ఎన్నికలని, రాష్ట్రంలోని ఎన్‌డిఎ 'పంచ్ పాండవ్' లాంటి ఐదు పార్టీల బలమైన కూటమి అని అన్నారు.

**బిహార్‌కు 'గూండా రాజ్' అవసరం లేదు : రాజ్‌నాథ్**

243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో ఎన్‌డిఎకు మూడింట రెండు వంతుల మెజారిటీ రావడం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజున (నవంబర్ 14న) ఆయనకు తగిన నివాళి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం అన్నారు. బిహార్‌కు 'గూండా రాజ్' అవసరం లేదని రాష్ట్రంలో ఆర్‌జెడి పాలనను ప్రస్తావిస్తూ ఆయన పేర్కొన్నారు. బిహార్ సిఎం నితీష్ కుమార్ ఆర్‌జెడి 'జంగల్ రాజ్' వల్ల కలిగే నష్టాన్ని తొలగించడంలో చాలావరకు విజయం సాధించారని రాజ్‌నాథ్ సింగ్ పాట్నా జిల్లాలోని బార్హ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో అన్నారు. ఎన్నికల కమిషన్‌పై దాడి చేసినందుకు కాంగ్రెస్, ఆర్‌జెడిలనును ఆయన తీవ్రంగా విమర్శించారు. 'రాజ్యాంగ సంస్థలను కించపరిస్తే ప్రజాస్వామ్యం ఎలా నడుస్తుంది' అని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.


**FORMAT C-2**

*(for political party to publish in website, newspapers, TV)*

**Declaration about criminal antecedents of candidates set up by the party**

*(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)*

**Name of Political Party : INDIAN NATIONAL CONGRESS**

**Name of Election : BYE ELECTION TO THE TELANGANA STATE LEGISLATIVE ASSEMBLY**

**Name of State/ UT : TELANGANA STATE**

**Name of the Constituency: 61-JUBILEE HILLS**

**Name of the candidate : NAVEEN YADAV. V**

**4 (A) Pending criminal cases**

| Sl. No. | Name of Court | Case No .and dated | Status of case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 575/2021 C.C No. 12608/2021 dt: 26-11-2021 | Examination of accused | U/S. 109, 505(2) & 506 of IPC. Abatement of any Offence, Conducting to public mischief and criminal intimidation |
| 2 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 95/2021 CC No. 11727/2021 dt: 27-10-2021 | Examination of accused | U/S. 506 of IPC. Criminal Intimidation |
| 3 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 93/2021 C.C No. 10432/2021 dt: 01-09-2021 | Examination of accused | U/S. 420 & 506 of IPC Cheating and Criminal Intimidation |
| 4 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 55/2021 C.C No. 8134/2021 dt: 30-06-2021 | Examination of accused | U/S. 341, 506, 509 r/w 143 of IPC Wrongful Restraint, Criminal Intimidation |
| 5 | III ACMM, Nampally, Hyderabad | FIR No. 395/2006, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad dt: 01-11-2006 | Summons to accused | Under section. 406, 420 & 506 of IPC. Criminal Breach of Trust, Cheating & Criminal Intimidation |
| 6 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 340/2021, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad Dt: 2-7-2021 | Under investigation | Under Section. 188, 419, 420, 427, 447, 467, 468 & 471 of IPC and under Section 3 of PDPP Act. Trespass and deliberate disobedience of Order. |
| 7 | XIV ACMM, Nampally, Hyderabad | FIR No. 655/2025, Madhura Nagar Police Station, Hyderabad Dt: 06-10-2025 | Under investigation | 123(1), 123(2) Representation of People Act, 1951, 170,171,174 of BNS. Bribery, undue influence, or illegal inducements during elections |

**5 (B) Details about cases of conviction for criminal offences**

| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description of offence(s) & punishment imposed | MaximumPunishment Imposed |
|---|---|---|---|
| 1 | NA | NA | NA |

**T.KUMAR RAO**
Vice President
Authorized Signatory

ప్రజాపక్షం
గురువారం, 30 అక్టోబరు

## క్యూబాపై అగ్రరాజ్య దుష్ప్రచారం

తన పెత్తనాన్ని ధిక్కరించే దేశాలను అమెరికా కక్షకట్టి వేధిస్తుంది. వాటికి వ్యతిరేకంగా ఎన్ని అబద్ధాలనైనా అవలీలగా ఆడేస్తుంది. క్యూబాపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని ఐక్యరాజ్య సమితిలో ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చే నిదర్శనం. క్యూబాపై బురద చల్లేందుకు తన దుష్ప్రచార అస్త్రాన్ని అమెరికా మరోసారి ప్రయోగించింది. తన ఆంక్షల నిర్ణయాన్ని సమర్థించుకోవడానికి విశ్వప్రయత్నాలు చేసింది. ప్రపంచ దేశాలను తప్పుతోవ పట్టించే వాదనల సంగ్రహాన్ని ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి మైక్ వాల్జ్ నిస్సిగ్గుగా వినిపించారు. అసలు ఆర్థిక నిర్బంధనం విధించ లేదని నమ్మబలికారు. అదే నిజమైతే, హెల్మ్స్‌బర్టన్ చట్టం, టోరిసెల్లి చట్టం ప్రకారం వివిధ రంగాల్లో క్యూబాపై విధించిన ఆంక్షల మాటేమిటో? క్యూబా ఆర్థిక వ్యవస్థ గొంతు నొక్కడం ద్వారా, సామాజిక అశాంతిని రెచ్చగొట్టడానికి చేస్తున్న ప్రయత్నం నిజంకాదా? ఇంధనం, ఆర్థిక, పర్యాటకం, వైద్యం తదితర రంగాలను నిర్వీర్యం చేయడమే అమెరికా లక్ష్యంగా ఎంచుకుంది. కుట్ర చేస్తున్నది. ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ వేదికలపై క్యూబాకు అనుకూలంగా ఓట్లు రాకుండా దౌత్యపరమైన ఒత్తిళ్లు పెంచుతున్నది. క్యూబాలో ఆహారం, మందుల కొరతకు అక్కడి ప్రభుత్వ విధానాలే కారణమని మరో నిరాధార ఆరోపణకు మైక్ తెగబడ్డారు. ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక ఔషధ జాబితాలో 69 శాతం అడ్డంకులను అమెరికా ఆర్థిక ముట్టడి కారణంగా ఎదుర్కొంటున్నది. కొన్ని కీలక ఔషధాలు, వైద్య పరికరాలపై ఉన్న ఆంక్షల చట్రం నుంచి బయటపడేందుకు క్యూబా చేస్తున్న ప్రయత్నాలను అమెరికా ప్రస్తావించనే లేదు. తప్పంతా క్యూబా ప్రభుత్వంపై నెట్టి, తనకు తాను క్లీన్‌చిట్ ఇచ్చుకుంది.

ఆహారం విషయంలోనూ ఇదే పరిస్థితి. అమెరికా ఆంక్షల కారణంగా దాదాపు 337,000 టన్నుల మొక్కజొన్న, 120,300టన్నుల సోయాబీన్స్ దిగుమతులు నిలిచిపోయాయి. గతంలో చేసుకున్న కొనుగోళ్ల ఒప్పందాలను సైతం అగ్రరాజ్యం విస్మరించింది. అక్కడితో ఆగకుండా, క్యూబాకు సాయం అందించకుండా ఇతర దేశాలను వివిధ రూపాల్లో నిరోధిస్తున్నది. ఇంకా అమల్లో ఉన్న '180 రోజుల నియమం'తో షిప్పింగ్ కంపెనీలు క్యూబన్ ఓడరేవులకు రావడం లేదు. ఎగుమతి, దిగుమతులకు తీవ్ర విఘాతం ఏర్పడున్నది. ఈ అంశాన్ని పక్కకుపెట్టి, ప్రస్తుత పరిస్థితులకు క్యూబాయే కారణమంటూ అమెరికా తప్పుడు సంకేతాలు ఇచ్చింది. బయోమెడిసిన్, మైనింగ్, పర్యాటకం, పెట్టుబడి లైసెన్సుల సడలింపు, బ్యాంకింగ్ రంగాలకు అధికారులు అనుమతులు ఇవ్వడం వంటివి అమెరికా ప్రభుత్వ పరిధిలో ఉంటాయి. కానీ, మైక్ తన సుదీర్ఘ ఉపన్యాసంలో నెపాన్ని క్యూబాపైకి నెట్టారు. యథేచ్ఛగా అబద్ధాలు ప్రచారం చేశారు.

క్యూబాతో లావాదేవీలు జరపకుండా బ్యాంకులను, సరఫరాదారులను బెదిరించే స్థాయికి అమెరికా దిగజారింది. 'స్వేచ్ఛా వాణిజ్యం' పేరుతో క్యూబా ప్రభుత్వంతో సంబంధం లేకుండా, అక్కడి వ్యక్తులు, సంస్థలతో ఒప్పందాలకు ప్రయత్నించడం అమెరికా పతనానికి పరాకాష్ట. ఒకవైపు ఆంక్షలను విధించి, ఆర్థికంగా దెబ్బతీయడమేగా, క్యూబాతో వ్యాపార సంబంధాలు పెట్టుకోకుండా ఇతర దేశాలను వివిధ రీతుల్లో బెదిరించడం దుర్మార్గం. క్యూబా ప్రభుత్వం దేశంలో ఉచిత విద్య, వైద్యాన్ని అందిస్తున్నది. అక్కడి నుంచే ఎంతోమంది వైద్యులు, వైద్య సిబ్బంది వివిధ దేశాల్లో సేవలు అందిస్తున్నారు. అక్కడ ప్రభుత్వం పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉంది.

రాజకీయ అస్థిరతకు తావులేదు. క్యూబాను పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థగా మార్చడానికి, ప్రైవేటు చేతుల్లోకి తీసుకోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. దీనిని అమెరికా జీర్ణించుకోలేకపోతున్నది. అందుకే కుయుక్తులతో, తప్పుడు సమాచారంతో, అబద్ధపు ప్రచారాలతో, అభూత కల్పనలతో దాడులు చేస్తున్నది. దిగ్బంధనాలతో ఆర్థిక ఒత్తిళ్లు పెంచుతున్నది. దీనిని వ్యతిరేకిస్తున్న ప్రపంచ దేశాల ముందు నిర్దోషిత్వాన్ని ప్రదర్శించుకోవడానికి ఏ స్థాయికైనా పతనమవుతున్నది. తన ప్రభావానికి లొంగని రష్యా, చైనా వంటి దేశాలపై అమెరికా ఆంక్షలు.. ఆర్థిక దిగ్బంధనాలు, కుయుక్తులు బహిరంగ రహస్యాలు. కరేబియన్ ప్రాంతాన్ని క్యూబా అస్థిరపరుస్తున్నదని, ఉక్రేన్‌పై యుద్ధంలో రష్యాకు మద్దతునిస్తున్నదని చేస్తున్న ఆరోపణలు సత్యదూరం. అమెరికా ఆధిపత్య ధోరణి జగద్విదితం. ఐక్యరాజ్య సమితి వేదికగా క్యూబాపై చేసిన ఆరోపణల్లో ఏదీ నిజం లేదు. అక్కడ అమెరికా దుష్ట రాజకీయం మరోసారి బయటపడింది. అంతే.

# పాశ్చాత్య దేశాల గందరగోళం : సర్కోజీ జైలు శిక్ష

## పారిస్ నుంచి వాషింగ్టన్ వరకూ సవాళ్ళు ఎదుర్కొంటున్న మితవాద ప్రభుత్వాలు

టి.ఎన్.అశోక్

ఫ్రాన్స్ దేశాధ్యక్షుడిగా పనిచేసి, జైలుకు పంపబడిన మొదటి వ్యక్తిగా ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ వార్తల్లో నిలిచారు. లిబియా ప్రచార నిధి కుంభకోణం ఆరోపణలపై ఐదు సంవత్సరాల శిక్ష పడిన ఆయన అవమానకర రీతిలో గతవారం జైలుకు వెళ్ళాల్సి వచ్చింది. తనకు వ్యతిరేకంగా 'నో కింగ్స్' నిరసనలో 70 లక్షల మంది ప్రజలు, డజనుకుపైగా నగరాల్లో వీధుల్లోకి రావడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఒత్తిడికి లోనవుతుండడం, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు, మితవాది బొల్సొనారో కుట్రకు ప్రయత్నించారని నిరూపితమవడం, చరిత్రలో మొదటిసారిగా ప్రధానమంత్రిగా ఒక మహిళ ఎన్నికవడంతో జపాన్‌లో కలకలం రేగడం వంటి పరిణామాలతో భౌగోళిక రాజకీయాలు గందరగోళంగా మారుతున్నాయి.

దౌత్యపరమైన ప్రయోజనం చేకూర్చినందుకు బదులుగా 2007 అధ్యక్ష ఎన్నిక ప్రచారం కోసం లిబియా నుంచి సర్కోజీకి నిధులు వచ్చాయి. ఆ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. ఈ కేసులోనే ఆయనకు శిక్ష పడింది. మరణించిన లిబియా నియంత్ర మోమేర్ ఖడ్డాఫి హయాంలో సర్కోజీ అక్రమంగా ఆర్థిక లావాదేవీలు నడిపినట్లు బలమైన ఆధారాలు కోర్టుకు లభించాయి. ఇది విదేశీ ప్రభావానికి లోనవడమనే ఫ్రెంచ్ ఎన్నికల చట్టాల కిందకు వస్తుంది.

ఇది నిజమైన అవినీతే తప్ప రాజకీయ వేధింపులు కాదు. సర్కోజీ అప్పీళ్ళు చేసుకునే అవకాశాలన్నీ పూర్తిగా అయిపోయే వరకు మూడు వేర్వేరు న్యాయస్థానాలు సాక్ష్యాలను సమీక్షించాయి. బలమైన చట్టబద్ధ ఆధారాల కారణంగానే దోషిగా నిరూపితమైంది. అయినప్పటికీ తాను బాధితుడిననే ముసుగులో సర్కోజీ ధిక్కారాన్ని ప్రకటిస్తున్నారు. 70వ ఏట మూడవసారి నేరంలో దోషిగా నిరూపించబడడంతో, ఆయన క్రియాశీల రాజకీయ జీవితం ముగిసినట్లుగానే కనపబడుతోంది.

సర్కోజీ శిక్ష ఫ్రాన్స్‌ను గందరగోళ రాజకీయ జలాల్లో నడిపిస్తోంది. 2022లో ఆయన సంకీర్ణ ప్రభుత్వం చట్టపరమైన మెజారిటీని కోల్పోయినా, పార్లమెంటరీ మెజారిటీ లేకుండానే అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మ్యాక్రాన్ పలనను కొనసాగిస్తున్నారు. వివిధ రాజకీయ వర్గాలతో నిరంతరం చర్చలు జరపాల్సిన స్థితి ఏర్పడింది. పెన్షన్‌లు, వలసలపై కీలక చట్టాలు, ఆర్థిక సంస్కరణల ప్రతిష్టంభనతో పరిపాలన స్తంభించిపోయింది.

సాంప్రదాయ మధ్య, మితవాద రిపబ్లికన్‌లైన సర్కోజీ పార్టీ మధ్యేవాదులతో జతకట్టడం లేదా మెరైన్ లీ పెన్ కి చెందిన నేషనల్ ర్యాలీకి వ్యతిరేకంగా పోటీ చేయడమనే మీమాంసలో చిక్కుకొని మద్దతును కోల్పోతుంది. ఆర్థిక స్థానాలను నియంత్రిస్తూ, వలసలు జాతీయ అస్థిత్వంపై కఠిన వైఖరిని కొనసాగిస్తూ లీ పెన్ అత్యంత సంప్రదాయవాదవాదుల మద్దతును విజయవంతంగా సాధించింది.

జీన్–లూక్ మెలెన్‌కాన్ అతివాద వామపక్ష ఫ్రాన్స్ అన్‌బోవ్డ్, ఇబ్బందులు పడుతున్న సోషలిస్టులు, గ్రీన్స్, కమ్యూనిస్టుల మధ్య వామపక్షాలు విడిపోయి ఉన్నాయి. వారు సర్కోజీ దోషిగా నిరూపితమవడాన్ని మితవాద అవినీతికి రుజువును ఒక ఆయుధంగా వాడుకుంటున్నారు. కానీ, పరిస్థితిని పూర్తిగా అనుకూలంగా మార్చుకునేందుకు వారి మధ్య ఐక్యత లేదు. పాలకుల వాగ్దానాలతో ఓటర్లు అలిసిపోవడంతో మధ్యేవాదులు క్షీణిస్తున్నారు.

మితవాదులు, ముఖ్యంగా లీ పెన్ నేషనల్ ర్యాలీ, దీని నుండి ఎక్కువగా ప్రయోజనం పొందుతుంది. పాత నాయకులు అక్షరాలా జైలుకు వెళుతుండగా, ప్రభుత్వ వ్యతిరేకతకు తమను తాముగా ప్రత్యామ్నాయాలుగా ఆ పార్టీ నేతలు నిలుపుకుంటున్నారు. సర్కోజీ జైలు శిక్ష మాక్రాన్‌కు భిన్నమైన చిక్కులను సృష్టిస్తుంది. ఇది న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని చాటుతుంది కోర్టులు మాజీ అధ్యక్షులను కూడా జవాబుదారీగా ఉంచడం, ప్రజాస్వామ్య బలం.









ప్రపంచవ్యాప్త ప్రజాస్వామ్య ఒత్తిడి పరీక్షకు గురవుతున్న నేపథ్యంలో ఫ్రాన్స్ నాటకీయత ఆవిష్కృతమైంది. 2022 తిరిగి ఎన్నికలో ఓడిపోయిన తర్వాత పదవిలో ఉండటానికి తిరుగుబాటుకు ప్రయత్నించినందుకు బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో దోషిగా నిర్ధారించబడ్డాడు. అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా చేతిలో తన ఎన్నికల ఓటమిని తిప్పికొట్టడానికి కుట్ర పన్నినందుకు 27 సంవత్సరాల 3 జైలు శిక్ష విధించబడింది.

లూలా, ఉపాధ్యక్షుడు గెరాల్డో ఆల్క్‌మిన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలెగ్జాండ్రే డి మోరేస్‌లను పేలుడు పదార్థాలు, ఆయుధాలు లేదా విషం ద్వారా హత్య చేయడం వంటి ప్రణాళికల గురించి బోల్సోనారోకు 'పూర్తి అవగాహన' ఉందని ప్రాసిక్యూటర్లు నిరూపించారు. డోనాల్డ్ ట్రంప్ తన మిత్రుడిని గట్టిగా సమర్థించారు. విచారణ పేరుతో ఉద్దేశ్యపూర్వకంగా వెంటాడారని అన్నారు. దీనికి అనుగుణంగా అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో స్పందిస్తారని పేర్కొంటూ, బ్రెజిలియన్ వస్తువులపై 50 శాతం సుంకాలను విధించారు. ట్రంప్ జోక్యంతో బోల్సోనారో విచారణను భౌగోళిక రాజకీయ ఒత్తిడి ప్రచారంగా మారుస్తుంది. అమెరికన్ ఆర్థిక శక్తికి వ్యతిరేకంగా బ్రెజిల్ న్యాయ స్వతంత్రతను పరీక్షిస్తుంది.సర్కోజీ చట్టపరమైన ఓటమిని నిశ్శబ్దంగా అంగీకరించడానికి భిన్నంగా, బోల్సోనారో కేసు అంతర్జాతీయ ఒత్తిడి, దేశీయ రాజకీయ కుయుక్తి ద్వారా పోరాడుతున్నారు.

ఖైదు చేయబడిన ఈ ఇద్దరు మాజీ అధ్యక్షుల మధ్య వ్యత్యాసం జవాబుదారీతనం పట్ల భిన్నమైన ప్రజాస్వామ్య ప్రతిస్పందనలను వెల్లడిస్తుంది. ఫ్రాన్స్ ప్రాసిక్యూషన్ అంతర్జాతీయ జోక్యం లేకుండా కొనసాగింది, బ్రెజిల్ అమెరికన్ ఆర్థిక ప్రతీకారాన్ని ఎదుర్కొంది.

జపాన్ పార్లమెంటు అతివాద సంప్రదాయవాది సనే తకైచిని తమ దేశ తొలిమహిళా ప్రధాన మంత్రిగా ఎన్నుకుంది. ఆమె తన లిబరల్ డెమోక్రటిక్ పార్టీ, మితవాద జపాన్ ఇన్నోవేషన్ పార్టీతో సంకీర్ణ ఒప్పందంతో ఇది సాధ్యమైంది.

జులైలో జరిగిన ఎన్నికలలో ఎల్‌డిపి ఘోరంగా ఓటమి పాలైన తర్వాత మూడు నెలల రాజకీయ శూన్యతను ముగించి, షిగెరు ఇషిబా స్థానంలో తకైచి ఎన్నికయ్యారు. ఆమె స్వల్ప విజయం, చివరి నిమిషంలో సంకీర్ణ చర్చలు అవసరం అనేది జపాన్ రాజకీయ విచ్ఛిన్నతను ప్రతిబింబిస్తుంది. ఈ కూటమికి పార్లమెంటు ఉభయ సభలలో అవసరమైన మెజారిటీ లేదు. చట్టాన్ని ఆమోదించడానికి ఇతర ప్రతిపక్ష గ్రూపులను ఆశ్రయించాల్సి ఉంటుంది, ఇది ఆమె ప్రభుత్వాన్ని అస్థిరంగా, స్వల్పకాలిక కొనసాగేదిగా మార్చే ప్రమాదాలను సృష్టిస్తుంది.

హత్యకు గురైన మాజీ ప్రధాన మంత్రి షింజో అబే శిష్యురాలు తకైచి బలమైన సైనిక, ఆర్థిక వ్యవస్థ, అలాగే జపాన్ శాంతివాద రాజ్యాంగాన్ని సవరించడం వంటి ఆయన విధానాలను అనుకరిస్తుందని భావిస్తున్నారు. ఆమె ఎంపిక పరివర్తన కంటే కొనసాగింపునే సూచిస్తుంది. ఇది సంస్థాగత సంస్కరణ కంటే రాజకీయ సంక్షోభానికి సాంప్రదాయిక సమాధానం.2020లో అబే పదవీవిరమణ చేసినప్పటి నుండి నలుగురు ప్రధానులు మారడం ద్వారా జపాన్ రాజకీయాలు ప్రపంచ ప్రభుత్వ అస్థిరత నమూనాలను ప్రతిబింబిస్తుంది.

ట్రంప్ అధికారానికి ఆచరణీయ మార్గాన్ని కొనసాగిస్తూనే పెరుగుతున్న చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. రాజకీయ విభజనతో జవాబుదారీతనాన్ని సమన్వయం చేసుకోవడానికి అమెరికన్ ప్రజాస్వామ్యం ఎలా కష్టపడుతుందో ఇది వెల్లడిస్తుంది. బ్రెజిల్ న్యాయ ప్రక్రియలో ట్రంప్ జోక్యం ప్రజాస్వామ్య జవాబుదారీతనం ఏ విధంగా భౌగోళిక రాజకీయాకరణ చెందుతుందో తెలియజేస్తుంది. శక్తివంతమైన దేశాలు చట్టపరమైన చర్యలను విదేశాంగ విధాన సాధనాలుగా ఆయుధంగా ఉపయోగిస్తున్నాయి.

2020 అమెరికా ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రయత్నించినందుకు క్రిమినల్ ప్రాసిక్యూషన్‌ను విజయవంతంగా తప్పించుకున్న తర్వాత ట్రంప్ ఇప్పటికే వైట్ హౌస్‌కు తిరిగి వచ్చారు. ప్రధాన అమెరికన్ నగరాలు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా నిరసనలను చూస్తున్నాయి. ప్రజాస్వామ్య నిబంధనలు, సంస్థాగత చట్టబద్ధత, జాతీయ దిశపై లోతైన సామాజిక విభజనలను ప్రతిబింబిస్తాయి. ఈ ఉద్రిక్తతలు ప్రపంచ నమూనాలను ప్రతిబింబిస్తాయి. ఇక్కడ పట్టణ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల నుండి రాజకీయంగా వేరుగా మారుతున్నాయి. ప్రజాస్వామ్య పాలనను క్లిష్టతరం చేసే భౌగోళిక విభజనను సృష్టిస్తాయి.

వామపక్ష, మితవాద పక్షాలు రెండిటికీ ప్రజాదరణ అనే ప్రపంచ ధోరణి సంస్థాగత వైఫల్యాన్ని పోషిస్తుంది. ఓటర్లు తమను తాము రక్షించుకునే సంస్థలను విశ్వసించరు. ఇబ్బందులకు కలిగించేలా బయటి వ్యక్తులను ఆలింగనం చేసుకుంటారు. అయినప్పటికీ ఆ బయటి వ్యక్తులు తరచుగా తమను తాము అవినీతిపరులుగా నిరూపించుకుంటారు లేదా వాగ్దానం చేసిన మార్పును అందించలేకపోతున్నారు, భ్రమలు కలిగించే ప్రక్రియలను శాశ్వతం చేస్తారు. బ్రెజిల్, ఫ్రాన్స్, జపాన్, అమెరికా ప్రతి ఒక్కటి ప్రత్యేకమైన సవాళ్లను ఎదుర్కొంటున్నా యి. అవన్నీ రాజకీయ అస్థిరత , సంస్థాగత ఒత్తిడి నమూనాలను కలిగి ఉన్నాయి. పాతుకపోయిన పార్టీలు విచ్ఛిన్నమవతాయి లేదా కూలిపోతాయి. సంకీర్ణ ప్రభుత్వాలు పనిచేయడానికి కష్టపడతా యి. ఓటర్లు పాతుకుపోయిన వ్యక్తులకు, వ్యవస్థ వ్యతిరేక ప్రజాదరణ కలిగినవారి మధ్య ఊగిసలాడుతున్నారు. ఇద్దరూ సంతృప్తికరంగా లేరని భావిస్తున్నారు. ఆర్థిక ఆందోళన, సాంస్కృతిక ఉద్రిక్తతలు,సాంకేతిక అంతరాయం రాజకీయ అస్థిరతను మరింత పెంచుతాయి.ఖండాలలో పెరుగుతున్న అనిశ్చితి, ప్రజాస్వామ్య పాలన ఇరవై ఒకట వ శతాబ్దపు ఒత్తిళ్లను తట్టుకుంటుందా లేదా దాని వైరుధ్యాల కింద కూలిపోతుందా అని నిర్వచిస్తుందా అనేది వేచి చూడాలి.

(ఐపిఎ సర్వీస్)

# బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం).. సత్వర వైద్యమే కీలకం...

గుండెకే కాదు మెదడు కూడా పోటుకు గురవుతుంది. మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, జన్యుపరమైన కారణాలతో చిన్న వయసులో బ్రెయిన్ స్ట్రోక్ అనేది చాలా తీవ్రమైన అనారోగ్య సమస్యగా పరిణమించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రతి నలుగురిలో ఒక్కరు తమ జీవిత కాలంలో స్ట్రోక్ బారిన పడుతున్నారు. సకాలంలో గుర్తించి, చికిత్స చేయడం ద్వారా స్ట్రోక్ను నివారించవచ్చు. అయితే, దీనిపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో.. అనేక మంది బ్రెయిన్ స్ట్రోక్కు గురై ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ఒకప్పుడు 60–70 ఏళ్ల వయసులో ఈ సమస్య కనిపించేది.. బాధితుల్లో 30–45 ఏళ్ల మధ్య వయసున్న వారు 15 శాతం వరకు ఉంటున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి.

బ్రెయిన్ స్ట్రోక్ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలను ఎలా గుర్తించాలి.. ఒకవేళ స్ట్రోక్ వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే కీలక వివరాలను రెనోవా సెంచరీ హాస్పిటల్స్, సీనియర్ కన్సల్టెంట్ & హెడ్, డిపార్ట్మెంట్ ఆఫ్ న్యూరాలజీ, డా. వై.మురళీధర్ రెడ్డి గారి మాటల్లో...

**బ్రెయిన్ స్ట్రోక్ అంటే ఏమిటి?**

మస్తిష్క రక్తనాళాల్లో ఏర్పడే వైఫల్యం కారణంగా బ్రెయిన్ స్ట్రోక్ సంభవిస్తుంది. రక్తం గడ్డకట్టడం ద్వారా రక్తనాళాలు పూర్తిగా లేదా పాక్షికంగా మూసుకుపోయి, మెదడుకు రక్త సరఫరా సక్రమంగా జరగకపోవడం స్ట్రోక్ కు కారణమవుతోంది. దీనివల్ల మెదడు కణాలు మరణించి, శాశ్వత వైకల్యం లేదా మరణం సంభవించవచ్చు.

**స్ట్రోక్‌కు ప్రధాన కారణాలు:**

* అధిక రక్తపోటు (హైపర్టెన్షన్)
* మధుమేహం (రక్తంలో అధిక చక్కెర స్థాయిలు)
* పొగ తాగడం, మద్యం సేవించడం
* స్థూలకాయం, అనారోగ్యకరమైన జీవన విధానం

స్ట్రోక్ లక్షణాలను గుర్తించడం

BE FAST:

B Balance (పట్టు): ఒక్కసారిగా మైకం రావడం లేదా పట్టు తప్పిపోవడం

E Eyes (కళ్లు) : అకస్మాత్తుగా చూపు పోవడం లేదా మసకబారడం

F Face (ముఖం): ముఖం ఒకవైపునకు జారిపోవడం

A Arm (చెయ్యి) : అవయవాలు బలహీనపడటం లేదా మొద్దుబారిపోవడం

S Speech (మాట): మాట్లాడేందుకు కష్టపడటం లేదా మాట అస్పష్టంగా ఉండటం

T Time (సమయం): తక్షణం ఆసుపత్రికి వెళ్లాలి తొలి 4,5 గంటలు చాలా కీలకం

**నిర్ధారణ:**

బ్రెయిన్ స్ట్రోక్‌ను నిర్ధారించడానికి, వైద్యులు మీ ఆరోగ్య చరిత్ర, శారీరక పరీక్షతో పాటు CT స్కాన్, MRI, రక్త పరీక్షలు, ఎలక్ట్రోకార్డియోగ్రామ్ (EKG), కరోటిడ్ అల్ట్రాసౌండ్, మరియు సెరెబ్రల్ యాంజియోగ్రామ్ వంటి అనేక పరీక్షలు చేస్తారు. ముఖ్యంగా CT స్కాన్ లేదా MRI స్కాన్ వంటి ఇమేజింగ్ పరీక్షలను ఉపయోగిస్తారు. ఈ పరీక్షలు మెదడులో రక్తస్రావం జరిగిందా లేదా మెదడు కణజాలానికి నష్టం జరిగిందా అని తెలుపుతాయి.

**రకాలు:**

రక్తనాళంలో అడ్డంకి ఏర్పడితే 'ఇస్కీమిక్ స్ట్రోక్', రక్తనాళం చిట్లిపోతే 'హెమరేజిక్ స్ట్రోక్'... ఇలా రెండు రకాల బ్రెయిన్ స్ట్రోక్స్ ఉంటాయి. అయితే రెండు స్ట్రోక్స్ లక్షణాలు ఒకేలా ఉంటా యి. కొన్ని సందర్భాల్లో హెమరేజిక్ స్ట్రోక్‌లో మూర్ఛలు కూడా రావచ్చు. తలనొప్పి, వాంతులు కూడా ఉండవచ్చు.

**ఎవరికి, ఎందుకు?**

రెండు రకాల బ్రెయిన్ స్ట్రోక్స్‌కు వయసుతో సంబంధం లేదు. అయితే 50ఏళ్లు పైబడిన వాళ్లలో మధుమేహం, అధిక రక్తపోటు సమస్యల ఉంటాయి కాబట్టి వాళ్లు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. అలాగే పెద్ద వయసులో రక్తనాళాల పటుత్వం తగ్గడం, ధూమపానం, మద్యపానం అలవాట్లు తోడవడం వల్ల కూడా ఈ సమస్య తలెత్తే అవకాశాలుంటాయి. ఇక పిల్లల్లో సికిల్ సెల్ అనీమియా, పుట్టుకతో రక్తనాళాలు బలహీనండా ఉండడం వల్ల, తలకు దెబ్బలు తగలడం వల్ల అరుదుగా కొందరు పిల్లలు కూడా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతూ ఉంటారు. ఇటీవలి కాలంలో మద్యపానం, ధూమపానం, డ్రగ్స్, సెడెంటరీ లైఫ్ స్టైల్, వ్యక్తిగత, వృత్తిగత ఒత్తిడులు, ఒబేసిటీల కారణంగా, మధ్య వయస్కుల్లో (32–50) కూడా బ్రెయిన్ స్ట్రోక్స్ పెరుగుతున్నాయి.

**సమయమే కీలకం**

చికిత్స ఒక సెకను పాటు వృథా అయినా, మెదడులో 19 లక్షల న్యూరాన్లు డ్యామేజ్ అయిపోతూ ఉంటాయి. కాబట్టి సమస్యను ఎంత త్వరగా నిర్ధారించి, చికిత్స అందిస్తే, మరింత నష్టం జరగకుండా అక్కడితే నియంత్రించ గలుగుతాం. ఇస్కీమిక్ స్ట్రోక్ విషయంలో తక్షణ చికిత్స ఎంతో కీలకం. లక్షణాలు తలెత్తిన నాలుగున్నర గంటల్లోగా బ్రెయిన్ స్కాన్ చేసి, రక్తపు గడ్డను గుర్తిస్తే, థ్రాంబోలైటిక్ ఇంజెక్షన్ ఇచ్చి, అంతటితో నష్టానికి అడ్డుకట్ట వేయవచ్చు. కొన్ని రక్తనాళాల్లో ఏర్పడే రక్తపు గడ్డలను థ్రోంబెక్టమీ చికిత్స ద్వారా ఆరు గంటల్లోపు తొలగించవచ్చు. కొన్ని ప్రత్యేకమైన సందర్భాల్లో 24 గంటల్లోగా చికిత్స అందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావచ్చు. అయితే ఈ చికిత్సలన్నీ స్ట్రోక్ వల్ల మెదడుకు జరిగిన నష్టాన్ని నివారించడానికి కాకుండా, మరింత నష్టం జరగకుండా నిలువరించడానికి మాత్రమే పనికొస్తాయి. థ్రోంబెక్టమీ చికిత్సలో గుండెకు యాంజియోగ్రామ్ చేసిన విధానాన్నే అనుసరిస్తారు. ఇక హెమరేజిక్ స్ట్రోక్‌కు ప్రధానంగా అధిక రక్తపోటే కారణమవుతూ ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో సూక్ష్మ రక్తనాళాలు చిట్లిపోతూ ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో మెదడులో వాపు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, రక్తపోటును అదుపు చేయవలసి ఉంటుంది. అయితే బ్రెయిన్ స్ట్రోక్ విషయంలో సమయం కీలకం.

**తదనంతర చికిత్స ఇలా...**

స్ట్రోక్ వచ్చిన కారణం మీద చికిత్స తదనంతర మందులు ఆధారపడి ఉంటాయి. ఫిజియోథెరపీతో పాటు, యాంటీ ప్లేట్లెట్లు, యాంటీ కాగ్యులెంట్లు, స్టాటిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి బ్రెయిన్ స్ట్రోక్ గురైన వాళ్లు మరొక స్ట్రోక్‌ను నివారించడం కోసం జీవితాంతం మందులు వాడక తప్పదు. అయితే మందుల మోతాదును వైద్యులు క్రమేపీ మారుస్తూ ఉంటారు. ఈ మందులతో పాటు మధుమేహం, అధిక రక్తపోటులను కూడా అదుపులో ఉంచుకోవాలి. గుండె సమస్యలను అదుపులో ఉంచుకోవడం, దురలవాట్లకు దూరంగా ఉండడం చేయాలి. పీచు, ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోవాలి.

సాధారణంగా మందులతో సమస్య సరిదిద్దుకోవచ్చు అనుకుంటారు. కానీ బ్రెయిన్ స్ట్రోక్‌లో ఇది అసాధ్యం. బ్రెయిన్ స్ట్రోక్ మూలంగా పక్షవాతం, మాటల్లో తేడా, అవయవాల్లో బలహీనతలు మందులతో మెరుగుపడవు. మందులతో రెండోసారి స్ట్రోక్ రాకుండా మాత్రమే నియంత్రించవచ్చు. అప్పటికే తలెత్తిన లక్షణాలను మెరుగు పరుచుకోవడం కోసం, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీలను అనుసరించాలి.

**నివారణ:**

90% బ్రెయిన్ స్ట్రోక్‌లు నివారించదగినవే! క్రమం తప్పకుండా రక్తపోటు, మధుమేహాలను పరీక్షించుకుంటూ, వాటిని మందులతో అదుపులో ఉంచుకోవడం, సమతులాహారం తీసుకోవడం, రోజుకు 30 నిమిషాల చొప్పున వారంలో ఐదు రోజుల పాటు వ్యాయామం చేయడం, మద్యపానం, ధూమపానం లాంటి దురలవాట్లకు దూరంగా ఉండడం, ఒత్తిడికి దూరంగా ఉండడం ద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌ను నివారించుకోవచ్చు.

# ఘనంగా ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం



ఎస్.బాల్‌రాజ్
ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
8074246685

స్వాతంత్ర్యానికి పూర్వం రవి అస్తమించని సామ్రాజ్యవాద బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో రహస్య జీవితాలు గడుపుతూ నాటి కార్మిక నాయకులు దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, బ్రిటీష్ సామ్రాజ్యవాది భారత దేశం వదిలి వెళ్ళాలని, పోరాడుతూనే, కార్మికులు అనేక కష్టాలకు, బాధలకు, ఆకలి, దరిద్రం, పేదరికానికి గురవుతూ పనిచేస్తున్న కార్మికులకు 30 సంవత్సరాల పోరాటాల తర్వాత, కార్మికులకు అండగా నిలబడేందుకు 31.10.1920న బొంబాయి నగర నడిసముద్రంలో రహస్యంగా పడవలో సమావేశమై ఎఐటియుసి పేరును నామకరణం చేసి నేటికి 106 సంవత్సరాలు అవుతున్నది. ప్రతి సంవత్సరం ఎఐటియుసి కార్మిక వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడుతూ, ఎఐటియుసి అవతరణ దినోత్సవాన్ని దీక్షదినంగా, పోరాటాలకు పదును పెడుతూ, దేశవ్యాపితంగా కోటాను కోట్ల కార్మికులు, యూనియన్ ఉన్న ప్రతిచోట యూనియన్ కార్యాలయాల వద్ద ఎఐటియుసి జెండావిష్కరణ కార్యక్రమాలు చేసేందుకు ఎర్ర తోరణాలు, ఎర్రరంగులతో దిమ్మెలకు రంగులు వేసి అందంగా అలంకరించి, దేశవ్యాపితంగా ఎఐటియుసి అవతరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు.మన తెలంగాణ రాష్ట్రంలో కూడా ఘనంగా జరుపుకుందాం.

1920లో ఎఐటియుసి ఏర్పడ్డ నాటి నుండి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, యూనియన్‌లు పెట్టుకొనే హక్కు కావాలని, నాటి బ్రిటీష్ ప్రభుత్వం మెడలు వంచి ప్రమాద నష్టపరిహార చట్టం 1923, 1926లో ట్రేడ్ యూనియన్‌లు ఏర్పాటు చేసుకునే చట్టం, వేతనాల చెల్లింపు చట్టం 1936 సాధించుకుంది. ఆ తర్వాత స్వతంత్ర భారతదేశంలో పారిశ్రామిక వివాదాల చట్టం 1947, కనీస వేతనాల చట్టం 1948, ఫ్యాక్టరీల చట్టం 1948, ఇయస్‌ఐ చట్టం 1948 (కార్మికరాజ్య బీమా), ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) చట్టం 1952, ప్రసూతి ప్రయోజనాల చట్టం 1961, బోనస్ చెల్లింపు చట్టం 1965, కాంట్రాక్టు కార్మికుల పర్మినెంట్ చేయాలన్న చట్టం 1970, గ్రాట్యుటీ చెల్లింపు చట్టం 1972, బాలకార్మిక నిషేధ చట్టం 1986, దుకాణాల సంస్థల చట్టం 1988, ఉద్యోగుల పదవి విరమణ పెన్షన్ పథకం 1995, భవన నిర్మాణ మరియు ఇతర కార్మికుల సంక్షేమ చట్టం 1996, ఉపాధి హామీ చట్టం 2005 వీటితో పాటు 44 కార్మిక చట్టాలను ఎఐటియుసి అగ్రభాగాన నిలబడి పోరాటాలు, ఉద్యమాలు చేయడం ద్వారా సాధించుకో గలిగామని చెప్పటానికి ఏమాత్రం సంకోచం లేదు. పై చట్టాలన్నీ నేటికి అమలవుతున్నాయి. మోడీ ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు లాభాలు చేకూర్చేందుకు 29 చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లు తేవడం జరిగింది.

దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు నిండినా, భారతదేశం ఆశించిన మేరకు అభివృద్ధి చెందలేదు. తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చినా కార్మికవర్గానికి ఒరిగిందేమీ లేదు. నేడు కూడా 13వేల కోట్ల మంది ఒక్కపూట తిండికి నోచుకోని, కనీసం భరోసలేని బ్రతుకులు గడుపుతు దరిద్ర భారతదేశంలో ప్రజలు, కార్మికులు ఇసురోమని జీవితాలు వెల్లదీస్తున్నారు. దేశంలో 9కోట్ల మంది విద్యావంతులు ఉద్యోగాలు లేక పొట్టచేత పట్టుకొని పట్టణాలలో బ్రతుకుదామని, బ్రతకలేక ఎంతోమంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాలవుతున్నారు. నేడు దేశంలో 47 కోట్ల మంది అసంఘటితరంగ కార్మికులు పనిచేస్తున్న వారికి, ఎఐటియుసి పోరాడి సాధించిన కార్మిక చట్టాలు అమలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోగా గత 11 సంవత్సరాల క్రితం అధికారానికి వచ్చిన మోడీ ఏన్డీయే ప్రభుత్వం, కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుంది. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను సమూలంగా మార్చేసి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, బడా వ్యాపారస్తులకు, మోడీ స్నేహితులకు లాభం చేకూర్చేందుకు 4 కోడ్‌లు తెచ్చి 47 కోట్ల ప్రజల కార్మిక, రాజ్యాంగ ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నది. దేశంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలలో భాగంగా 3 రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి రైతుల ఆత్మహత్యలకు కారణమవుతున్న మోడీ ప్రభుత్వం తన విధానాలను ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని 27సార్లు ఈ దేశంలో 10 కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఐక్యంగా నిరసనలు, సమ్మెలు చేస్తున్నా, దున్నపోతుపై వర్షంపడ్డట్లుగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న విషయాన్ని ఎండగడుతున్నాం. కార్మికవర్గ పోరాటాలకే పెట్టుబడిదారి విధానాన్ని అంతంచేసి కార్మికరాజ్యం (సోషలిజం) తెచ్చే శక్తి యుక్తులు ఉన్నాయని చరిత్ర నిరూపించింది. మన ముందు అదే కర్తవ్యం ఉన్నది.

భారతదేశంలోని కార్మికవర్గానికి దిక్సూచిగా తెలంగాణ రాష్ట్ర ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల సభ్యులు, ఎఐటియుసి అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త నుండి నాయకుని వరకు శపథంబూని, ఎఐటియుసి బలోపేతానికి రాష్ట్రంలో పనిచేస్తున్న కార్మికవర్గానికి యూనియన్లు ఏర్పాటు చేసి, పోరాటాలు, ఉద్యమాలు, సమ్మెలు, నిరసనలు కొనసాగిస్తూనే కార్మికులకు రాజకీయ, సైద్ధాంతిక, వర్గ దృక్పథంతో చైతన్యవంతమైన పోరాటాలు, ఉద్యమాలు చేసేందుకు ఎఐటియుసి అవతరణ దినోత్సవం సందర్భంగా దీక్షబూనుదాం, ప్రతిజ్ఞ చేద్దాం. ఎఐటియుసి ఎర్రజెండాను మరింత ఎరుపెక్కిద్దాం.

పోరాటాల సంవత్సరం : కార్మికవర్గం ఐక్యంగా పోరాటాలు, ఉద్యమాలు చేస్తూ మరిన్ని పోరాటాలు, ఉద్యమాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చే ద్దాం, బిజెపి ఏన్డీయే కూటమిని బొందపెట్టేందుకు, బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటు, కేంద్ర కార్మిక సంఘాలు, వివిధ యూనియన్‌లు, అసోసియేషన్‌లు, దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తునందున కార్మికులను, ప్రజలను, సమస్త పీడిత, తాడిత వర్గాలకు అండగా ఉంటూ పోరాటాలు ఉద్యమాలు చేయాల్సిన ఆవశ్యకత అసన్నమైనది.

దేశ ఆర్థిక వ్యవస్థకు సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, బీడీ కార్మికులు, తునికాకు ఉత్పత్తి దారులు, కాంట్రాక్ట్ కార్మికులు, హమాలీలు, బొగ్గుగని కార్మికులు, ఇంటిపనివారలు, నిర్మాణ కార్మికులు, ప్లాంటేషన్, వ్యవసాయ కార్మికులు, వలస కార్మికులు, ప్రభుత్వరంగ సంస్థల కార్మిక ఉద్యోగులు, ఎల్‌ఐసి, పోస్టల్, విద్యుత్, టెలికాం ఇతర రంగాల కార్మికులు, మెడికల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, మధ్యాహ్న భోజన కార్మికులు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా పోరాటాలు, ఉద్యమాలు చేసినప్పుడే కార్మికులకు ప్రయోజనం.

కావున ఎఐటియుసి అవతరణ దినం సందర్భంగా ఎఐటియుసి అనుబంధ సంఘాలు, ఎఐటియుసి దిమ్మెలకు రంగులు వేసి, ఎర్ర తోరణాలతో భారీగా అలంకరించి, ఎర్ర షర్టులు, ఎర్ర చీరలు ధరించి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి.

## నూతన తహసీల్దార్ చంద్రశేఖర్‌కి శుభాకాంక్షలు

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : నూతన తహసీల్దార్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యుడు తాల్క రాములు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు జహీరుద్దీన్, భాగ్యలక్ష్మి, బొడ్డు నర్సింగ్ రావు, తదితరులు పాల్గొన్నారు.



## ఇండ్లు కోల్పోతున్న బాధితులకు చెక్కులు పంపిణీ : కలెక్టర్

ప్రజాపక్షం/వికారాబాద్ : కొడంగల్ నియోజకవర్గంలోని శ్రీమహలక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయ విస్తరణలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ చెక్కులు పంపిణీ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో దేవాలయ విస్తరణలో భాగంగా దేవాలయ అభివృద్ధికి సంబంధించిన ఇండ్లు కోల్పోతున్న నిర్వాశితులకు నష్ట పరిహారంగా చెక్కులను కలెక్టర్ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌తో కలిసి బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## లక్ష్మాపూర్ రాములగుట్ట సిసి రోడ్డుకు నిధులు మంజూరుకు వినతి

ప్రజాపక్షం/శామీర్‌పేట: మూడుచింతలపల్లి మున్సిపల్ లక్ష్మాపూర్ గ్రామంలోని రాములగుట్ట దేవాలయానికి సిసి రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌కు బిజెపి నాయకులు వినతిపత్రాన్ని బుధవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. అలాగే లక్ష్మాపూర్ తాండ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని ఆ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎంపిని జిల్లా బిజెపి నాయకుడు గుగ్లావత్ వెంకటేష్ కోరారు. అనంతరం బిజెపి నాయకులు సింగం రాకేష్, గుగ్లావత్ వెంకటేష్, సింగం విజయలక్ష్మి, లగిశెట్టి అరున్‌లు మాట్లాడుతూ లక్ష్మాపూర్‌లోని రాములగుట్టకు సిసి రోడ్డు వేయడానికి ఎంపి సానుకూలంగా స్పందించారని తెలిపారు. లక్ష్మాపూర్ తాండ రోడ్డుకు మరమ్మతులు చేయుటకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మూడుచింతలపల్లి బిజెపి అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు

ప్రజాపక్షం/చర్లపల్లి: కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పర్యవేక్షణలో ఇసిఐఎల్ బస్టాండ్‌లో ఆర్‌టిసి డ్రైలర్లు, విద్యార్థులు, ప్రయాణీకులతో కలసి అమరవీరుల త్యాగాలకు సంఘీభావం తెలిపి వారికి నివాళులర్పించారు. అనంతరం డ్రైవర్లకు,విద్యార్థులకు, ప్రయాణీకులకు ట్రాఫిక్ నిబంధనపై అవగాహన కల్పించారు. అమర వీరుల త్యాగాలు మరువలేనివని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ రామలక్ష్మణరాజు, ఎస్ఐ మధు, ఎన్ భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

### కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ప్రజాపక్షం/కూకట్‌పల్లి: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి సమస్యల పరిష్కారానికే పాదయాత్ర చేపట్టం జరిగిందని కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ అన్నారు. బుధవారం 124 ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని జన్మభూమి కాలనీలో డ్రైనేజ్, సీసీ రోడ్డుకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని కాలనీవాసుల కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ స్పందించిక కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమి కాలనీలో ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కొంతమేర డ్రైనేజీ, సీసీ రోడ్లకు సంబంధించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని, వాటిని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. డ్రైనేజీ లైన్స్ నిర్మాణం పనులు పూర్తయిన తరువాత సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ, రెహ్మాన్, నాగరాజు, బాలకృష్ణ, రాము, భీముడు, మహేష్, తిరుపతి, రామకృష్ణ, శివ, ప్రవీణ్, పెద్దరాజు, సోమయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా దేవతామూర్తుల ప్రతిష్టాపన

ప్రజాపక్షం/నాగారం: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌వి నగర్ రోడ్ నంబర్ 8లో శ్రీ లక్ష్మి గణపతి అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం శ్రీ కోదండ రామాంజనేయ స్వామి శ్రీవల్లి దేవసేనా సహిత సుబ్రహ్మణ్యస్వామి, నాగబంధ, మృత్యుంజయ, మేధా దక్షిణామూర్తి, అభయాంజనేయ, నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సప్త సహస్రాధిక ప్రతిష్టాపనాచార్యులు జక్కి కృష్ణావధాని, పిరాట్ల హేమదుర్గా రామకృష్ణ శర్మ, నరహరి అవధాని, హరిపవన కుమార శర్మలచే వింశతి(20) సంఖ్యాక ఋత్విగ్వరేణ్యులను నిర్వహించారు.



## బిఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాపక్షం/నవాబుపేట్ : నవాబుపేట్ మండలం చిట్టిగిద్ద గ్రామ బిఆర్ఎస్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షులుగా బక్కని రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేవెళ్ల జయపాల్ రెడ్డి, అయ్యగాల నరేందర్, ప్రధాన కార్యదర్శిగా బ్యాగరీ అనంతయ్య, కార్యదర్శులుగా మర్మారి రమేష్, తరుణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా దాసరి సందీప్, అధికార ప్రతినిధిగా అయ్యగాల నవీన్, యువజన విభాగం అధ్యక్షుల దాసరి ప్రదీప్, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా బక్కని శ్రీకాంత్, బిసి సెల్ అధ్యక్షులుగా ప్రశాంత్, మైనారిటీ సెల్ అధ్యక్షులుగా ఆసిఫ్ తదితరులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మండల కార్యవర్గ సభ్యులు ఎన్నుకోబడిన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ చిటిగిద్ద గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే విధంగా కార్యాచరణ ఉంటుందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకెళ్తామని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చిటిగిద్ద గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఎంపిటిసి, జెడ్పిటిసి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నవాబుపేట్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గణపురం శాంతి కుమార్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి సిల్వరీ గోవర్ధన్, విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, మండల నాయకులు శేఖర్, రాము తదితరులు పాల్గొనడం జరిగింది.

# సమయపాలనతో ఉద్యోగుల పనితీరు మెరుగు

### అటవీ శాఖ చీఫ్ డాక్టర్ సువర్ణ




ప్రజాపక్షం/హైదరాబాద్:ఉద్యోగంలో సమయపాలన పాటిస్తే పనితీరు మెరుగుపడుతుందని తెలంగాణ అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారిణి డాక్టర్ సువర్ణ తెలిపారు. పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దూలపల్లి తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో ''పర్సనల్ ఎఫెక్టివినెస్'' పై మూడు రోజుల పాటు జరుగుతున్న వర్క్‌షాప్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 18మంది ఐఎఫ్ఎస్ అధికారులతో నిర్వహిస్తున్న వర్క్ షాప్(కార్యశిబిరం) కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగస్తులుగా వ్యక్తిగత–ఉద్యోగ జీవితాల మధ్య సమతుల్యత కీలకమన్నారు. సమయాన్ని సరైన పద్ధతిలో సద్వినియోగం చేసుకుంటే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా ఉన్నట్లయితే సమయాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగుతామని సూచించారు. ఇండియాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ అని, ఇక్కడున్న అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు, అర్బన్ పార్కులు, ఎకోటూరిజం ఆకర్షణలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు. అధికారులు తిరిగి సమయం చూసుకుని రైజింగ్ వైబ్రంట్ తెలంగాణను సందర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమలో అకాడమీ డైరెక్టర్ SJ ఆశా, డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో మొంథా ఎఫెక్ట్...కుండపోత వర్షం

* విద్యార్థులు, ఉద్యోగుల ఇబ్బందులు
* రోడ్లన్నీ జలమయం



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా మొంథా తుఫాన్ ప్రభావం చూపుతోంది. మంగళవారం రాత్రి నుండి చిన్నగా ప్రారంభమైన వర్షం అర్ధరాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురుస్తూనే ఉంది. కూకట్‌పల్లిలో 22.7 మి.మీగా అధికంగా వర్షం కురవగా మూడుచింతలపల్లిలో 3.9 మిమీగా నమోదైంది. మండలాల వారీగా బుధవారం కూకట్‌పల్లిలో 22.7, బాచుపల్లిలో 22.2, కుత్బుల్లాపూర్‌లో 13.2, మేడ్చల్, బాలానగర్‌లలో12.1, ఉప్పల్‌లో11.8,మల్కాజిగిరిలో 10.1, కాప్రాలో 807, ఆల్వాల్‌లో8, మేడిపల్లిలో 6.2, కీసరలో 5, ఘట్‌కేసర్‌లో 4.2, మూడుచింతలపల్లిలో 3.9 మిమీగా నమోదైంది. జిల్లాలోని అన్ని ప్రాంతాలు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. విద్యా సంస్థలకు సెలవు ఇవ్వక పోవటంతో తమ ఇళ్లనుండి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి రావటంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు తమ కార్యాలయాలు, దుకాణాలకు వెళ్లటం తడుసుకొంటూనే రాకపోకలు చేయాల్సి వచ్చింది. నిత్యంరద్దీగా ఉండే తార్నాక, హబ్సిగూడ, ఉప్పల్, ఘట్‌కేసర్, మేడ్చల్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, రాం పల్లి, బాచుపల్లి మల్కాజిగిరి తదితర అన్ని ప్రాంతాల్లోనూ కుండపోత వర్షం కురుస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ప్రధాన రహదార్లే కాకుండా బస్తీల రోడ్లు సైతం ఏర్పడిన గుంతలు పూడ్చటంలో జిహెచ్‌ఎంసి అధికారులు మరమ్మత్తు పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలివేయటంతో తాజా కుండపోత వానలతో గుంతలన్నీ నీటితో నిండటం వాటిని గుర్తించలేక వాహనదార్లు ప్రమాదపుటంచునే రాకపోకలు చేయాల్సి వచ్చింది.

## వరి, పత్తికి పెట్టుబడి రావడం కూడా కష్టమే

### ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రజాపక్షం/వికారాబాద్ : మొంథా తుఫాను ప్రభావంతో వికారాబాద్ జిల్లాలో ఉదయం 4గంటలనుండి ఎడతేరపు లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలతో పత్తి రైతులకు ఈ సీజనల్లో ఇబ్బందులు తప్పడంలేదు ,సాగు ప్రారంభంలో వర్షాభావం తర్వాత వరుస వర్షాలు ఇప్పుడు మొంథా తుఫాను ప్రభవంతో అతివృష్టితో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వారం రోజుల నుండి అడపదడప వర్షాలు కురుస్తుండడంతో పత్తి సేకరణ పూర్తిగా నిలిచిపోయింది. కొమ్మలపై తడిసిన పత్తిని ఏరడం నిలిచిపోయింది. చెట్టుపై మిగిలిన పత్తి తడవడంతో ఏరేందుకు ప్రయత్నించినా ఫలితం ఉండడం లేదు దీంతో కొంతమంది రైతులు పత్తి పాలాలను దున్నుతూ తొలగిస్తున్నారు. తద్వారా రాబోయే యాసంగి సీజన్ కోసం మొక్కజొన్న, ఇతర పంటలకోసం సిద్ధమవుతున్నారు. అయితే వర్షాలు ఆగకపోతే యాసంగి పంటలు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని రైతులు అందోళన చెందుతున్నారు. ఇప్పటికి నష్టాలతో నిలదొక్కుకోలేని రైతులు తుపాను ప్రభావంత మరికొన్ని రోజులు కొనసాగుతుందని వాతావరణశాఖ హెచ్చరికతో అందోళనలో ఉన్నారు.

వర్షాలు ఇలగే కొనసాగితే చెట్టుపై ఉన్న పత్తి పూర్తిగా తుడిచి పెటుకపోతుందనే భయం రైతులకు ఏర్పాడింది. భారీ వర్షాలతో ఈ ఆసరి పత్తి రైతులు నిండా మునిగిపోతున్నారు. ప్రకృతి దెబ్బకు పత్తి కుదేలవుతన్న పత్తి రైతులు ప్రభుత్వం సాయంకోసం ఎదురుచూస్తున్నారు. ఒక వైపు విత్తనాలు, ఎరువుల వ్యయభారం, మరో వైపు వాతవరణదెబ్బతో ఈ సీజన్ పత్తి రైతులను నష్టాలను మిగిల్చిపోతుంది.

పత్తి సేకరణ సమయంలో ఎడతెరిపి లేని వర్షాలతో పత్తి రంగు మారడం, గింజలు మొలకెత్తే ప్రమాదం పెరిగింది. ప్రారంభంలో వర్షాభావం వల్ల పూత కా య రాలిపోవడం, ఇప్పుడు అతి వృష్టి వల్ల పత్తి నాణ్యత దెబ్బతింది. పగిలిన పత్తిని సమయానికి తీయకపోతే మొక్కలు నేల వాలే అవకాశం ఉంది. ఇంకా కాత పూతలకు రోగం వచ్చే ప్రమదం ఉంది ఈసారి ఎక్కువగా ఒక్కసారికే దిగుమతి సాధ్యమై రెండవసారి పత్తి తీయడం కష్టంగా మారింది. నల్ల నేలల్లో పది క్వింటాళ్లు వచ్చేది కాని ఈసారీ నాలుగు క్వింటాళ్లు వచ్చే అవకశం లేదని రైతులు తెలిపారు.

## నూతన మున్సిపాలిటీలకు మహర్దశ : ఊరడి వెంకటేష్

ప్రజాపక్షం/శామీర్‌పేట:కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో అభివృద్ధికి ఢోకాలేదని సిఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి కట్టుబడి కొత్తగా ఏర్పాటైన మూడు మున్సిపాలిటీలకు రూ. 45నిధులు మంజూరు చేశారని శామీర్‌పేట మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు ఊరడి వెంకటేష్ (తుర్కపల్లి) అన్నారు. బుధవారం శామీర్‌పేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తున్నాయని చెప్పారు. మేడ్చల్ జిల్లాలో మూడుచింతలపల్లి మున్సిపాలిటీ, అలియాబాద్ మున్సిపాలిటీ, ఎల్లంపేట మున్సిపాలిటీలకు రూ. 45 కోట్లు నిధులు ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందని, జయభేరి మ్రోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక నిధులు కేటాయించుటకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## భారీ వర్షాలతో అప్రమత్తం

### ఎస్‌పి నారాయణరెడ్డి



ప్రజాపక్షం /వికారాబాద్ : జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కురుస్తాయని వాతవరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ అధికారులు వెంటనే తమతమ పోలీసు స్టేషన్ పరిధిలోని వాగులు, కుంట లు, చెరువులలోని వరద నీటి ప్రవాహంపై నిరంతర పటిష్టం చేయాలని సూచించారు. ముఖ్యం గా రాకపోకలకు ఆటంకం కలిగించేలా పొంగిపోర్లుతున్న వాగులు, నాళాల దగ్గర రోడ్లను బ్లాక్ చేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు, ఇతర శాఖల అధికారులు గ్రామాల పెద్దలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని కోరారు. బందోబస్త్ విధులలో పాల్గొని సిబ్బంది, అధికారు లు తప్పకుండా రెయిన్ కోట్లను వినియోగించి తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్‌పి తెలిపారు. వికారాబాద్ జిల్లా ప్రజలకు కొన్ని కీలకమైన సూచనలు చేశారు.

ప్రజలు ఎవ్వరు కూడా నీటి ప్రవాహం వేగంగా వెళ్తున్న వాగులు, కాలువలను రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దు అని తెలిపారు. పాతబడిన ఇండ్లు భవనాలలో ఎవ్వరూ కూడా ఉండవద్దు. ప్రమాదాలు జరగకుండా తక్షణ మే సురక్షిత ప్రదేశాలకు తరలివెళ్లాలి అని సూచించారు. ఎవరికైన ఏదైనా అత్యవసరమైతే పోలీసు సహాయం అవసరమైతే వెంటనే ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులకు డైల్ 100కి గాని లేదా పోలీసు కంట్రోల్ నెంబర్ 87126 70056 కాల్ చేయాలని ఎస్‌పి తెలిపారు.

## బాచుపల్లిలో కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

ప్రజాపక్షం/ నిజాంపేట్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సీనియర్ నేతలు ప్రారంభించారు. మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్ ఆగం పాండు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలం గౌడ్, మైనంపల్లి హన్మంతరావు, రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డిలు విచ్చేసి ప్రారంభించారు.





ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నాయకులు కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింతగా బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కాసాని మహేశ్, దూసకంటి గిరి, కేశం, నరేశ్, బాబు, నవీన్, రాజేశ్, షకీల్, నందిగామ మహేశ్, రంజిత్ పాల్గొన్నారు.

## ఓ వైపు కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం.. మరోవైపు ఆక్రమించిన పార్కుని కాపాడిన హైడ్రా..




ప్రజాపక్షం/నిజాంపేట్: ఓ వైపు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం, మరో వైపు ఆక్రమించిన పార్కుని హైడ్రా అధికారులు కాపాడడం ఒకే రోజు జరగడం చర్చనీయాంశమైంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లి, కౌసల్య కాలనీలో బన్యాన్ ట్రీ పార్కు స్థలాన్ని ఓ మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్ ఆక్రమించుకుని ఫ్రీకాస్ట్ వాల్‌ని నిర్మించారు. కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు హైడ్రా అధికారులకు ఇచ్చిన ఫిర్యాదుతో స్పందించిన హైడ్రా బన్యాన్ ట్రీ పార్కు స్థలంలో వేసిన ఫ్రీకాస్ట్ వాల్‌ని జేసీబీ సహాయంతో తొలగించి హైడ్రా సూచిక బోర్డుని ఏర్పాటు చేసి నలుగురు సిబ్బందిని ఏర్పాటు చేశారు. అయితే బాచుపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్ నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పలువురు విచ్చేసి బుధవారం ప్రారంభించారు. అయితే ఇటి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించడం, అటు కౌసల్య కాలనీలో కబ్జా చేసిన పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడడం ఒకే సారి జరగడం విశేషం. అధికార పార్టీలో ఉంటూనే కబ్జా చేసిన స్థలాన్ని కాపాడుకోలేకపోవడం పై సర్వత్రా ఆ నేత పై విమర్శలు గుప్పిస్తున్నారు. తన స్థలాన్నే కాపాడుకోలేని నేత ప్రజల సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తాడనే వాదనలు వినపడుతున్నాయి. అయితే హైడ్రా అధికారులు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నేత కబంద హస్తాల్లో ఉన్న పార్కు స్థలాన్ని కాపాడడం గమనార్హం. హైడ్రా వచ్చిందంటే ఏ పార్టీకి చెందిన నాయకులైనా ప్రజావసరాలకు కేటాయించిన స్థలాలను కబ్జా చేస్తే సహించేది లేదు అని చెప్పకనే చెప్పినట్లు. కాంగ్రెస్ నేత కబ్జా చేసిన పార్కు స్థలాన్ని కాపాడడమే కాకుండా చుట్టూ ఫెన్సింగ్‌ని ఏర్పాటు చేసిన సూచిక బోర్డుని ఏర్పాటు చేశారు.

అదేవిధంగా నిజాంపేట్ గ్రామం, బృందావన్ కాలనీలో సర్వేనంబరు 93లోని ప్రభుత్వ స్థలంలో హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేసి సూచిక బోర్డుని ఏర్పాటు చేశారు. కాలనీ వాసులు హైడ్రా అధికారుల పనితీరుని ప్రశంసించారు.



## వీర్‌శెట్టిపల్లి యువకుల సాహసం

### కాగ్నా నదిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడిన యువకులు

ప్రజాపక్షం/తాండూరు: తాండూరు కాగ్న నదిలో వచ్చి వరద ఉధృతిలో కొట్టుకపోతున్న ఓ వ్యక్తిని వీర్‌శెట్టి గ్రామ యువకులు కాపాడారు. తుపాన్ కారణంగా కురుస్తున్న వర్షాలతో తాండూరు ప్రాంతంలోని కాగ్నా నది వరద ఉధృతి నెలకొంది. తాండూరు మండల పరిధి వీర్‌శెట్టిపల్లి గ్రామం వద్ద కాగ్న నదిలో కొట్టుకపోతున్న ఓ వ్యక్తిని అదే గ్రామానికి చెందిన యువకులు హరి, శ్రవణ్ గమనించారు. వెంటనే ఆ వ్యక్తిని కాపాడాలనే నిర్ణయించుకున్న యువకులు తమ ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా ఎంతో సాహసంతో వాగులోకి దూకి వాగులో కొట్టుకపోతున్న వ్యక్తిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఈ యువకులు చేసిన సహాసాన్ని గ్రామస్తులు అభినందించారు. వాగులో కొట్టుకపోతున్న వ్యక్తి యాలాల మండల పరిధి అగ్గనూర్ గ్రామానికి చెందిన పెద్దింటి నర్సిములుగా గుర్తించారు. అగ్గనూర్ సమీపంలో వాగుదాటే సమయంలో నదిలో చిక్కుకుని వరదలో కొట్టుకపోయాడు. ఇది గమనించిన వీర్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన యువకులు ఎంతో సాహసంతో ధైర్యంగా వాగులోకి దూకి నర్సింములును ప్రాణాలతో కాపాడారు. అనంతరం ఆ వ్యక్తిని చికిత్స నిమిత్త తాండూరులో జిల్లా ఆసుపత్రికి తరలించారు. వాగులో కొట్టకపోతున్న వ్యక్తిని కాపాడిన యువకులను గ్రామస్తులు అభినందించారు.



## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు అన్నారు.బుధవారం గురుకుల్ కళాశాలలో స్వచ్ఛభారత్ స్వచ్ఛ గురుకుల్ భాగంగా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్ గౌడ్, ఏనుగు సుదర్శన్ రెడ్డి, మారం లక్ష్మారెడ్డి, రేసు లక్ష్మారెడ్డి, బొక్క మహిపాల్ రెడ్డిలు గురుకుల్ కళాశాలను ప్రతి ఒక్కరు శుభ్రత విషయంలో జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సారా శ్రీనివాస్ గౌడ్, బచ్చు నాగేష్ గుప్తా, మాధవ రెడ్డి, కొమ్మిడి రాఘవ రెడ్డి, కడప ఈశ్వర్, సిరాజ్, ఖలీల్, సురేష్ యాదవ్, కమలకర్,గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు, వాకర్ అసోసియేషన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, జెఎసి నాయకులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## అట్టహాసంగా గురుకుల కళాశాల ఫ్రెషర్స్ డే

ప్రజాపక్షం/శామీర్‌పేట : తెలంగాణ సాంఘిక గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్టలో ఫ్రెషర్స్ డే మంగళవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. కళాశాల విద్యార్థినిలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చేతన, అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ మేఘస్రవంతి, కల్చరల్ కోఆర్డినేటర్ ధనవేణి,అంతుల్, అధ్యాపక బృందం, విద్యార్థినిలు,తదితరులు పాల్గొన్నారు.

## జూరాల కొత్తపల్లి బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ విడుదల

**ప్రజాపక్షం / ఆత్మకూరు :** వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం జూరాల గ్రామం దగ్గర కృష్ణా నదిపై జోగులాంబ గద్వాల జిల్లా కొత్తపల్లి వరకు హై లెవెల్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం కోసం టెండర్ విడుదల చేయడం జరిగిందని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదివరకు పాలించిన వారు ఆత్మకూరు పట్టణాన్ని అభివృద్ధికి వంద ఏళ్ళు వెనకకు తీసుకువేళ్లారని విమర్శించారు. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసినందుకు అభినందనలు తెలిపారు. ఈ బ్రిడ్జి దాదాపు 10.50 కిలోమీటర్లు, ఇరువైపులా 5.20కిలో మిటర్ల పంచాయతీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బ్రిడ్జి నిర్మాణం సంకల్పంతో 123 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే ఆత్మకూరు పట్టణం కోల్పోయిన పూర్వ వైభవం మళ్లీ తిరిగి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## యువతి వివాహానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/కేశంపేట:** పేదింటి యువతి వివాహానికి కాంగ్రెస్ నాయకులు ఆర్థిక సహాయం చేశారు. బుధవారం కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన ముల్తుంకర్ ఇసుబాబు, ఈశ్వర్‌బాయ్ దంపతుల కుమార్తె లక్ష్మీ బాయి వివాహం ఈనెల 30వ తేదిన ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు ఆర్థిక సహాయం చేయడంతోపాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పోగుల భీమయ్య, గుత్తి శేఖర్, గుత్తి చంద్రయ్య, డాక్టర్ వెంకటేష్, అలూరి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకోలు



నిరంజన్, శంభుల శేఖర్, పోగుల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత రాండమైజేషన్ పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ఏర్పాట్లలో భాగంగా బుధవారం కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో రెండో విడత ఇవిఎంల రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నియమించిన జనరల్ అబ్జర్వర్ రంజిత్ కుమార్, పోలీస్ అబ్జర్వర్ ఓం ప్రకాశ్ త్రిపాఠీ, వ్యయ పరిశీలకుడు సంజీవ్ కుమార్ లాల్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల ఏజెంట్లు సమక్షంలో ఈసీఐ మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి , జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, రిటర్నింగ్ ఆఫీసర్ పి. సాయి రామ్ తదితర ఎన్నికల అధికారులు హాజరయ్యారు. ఈ రాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఇవిఎంలను నిష్పక్షపాతంగా కేటాయించడం జరుగుతుంది.

## ఆస్తిపన్ను రద్దు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన పౌల్ట్రీ రైతులు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పౌల్ట్రీ రైతులకు ఆస్తిపన్ను రద్దు చేసిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు పాతూరి వెంకట్‌రావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆస్తిపన్ను రద్దుకు సహకరించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, వేం నరేందర్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పాతూరి వెంకట్‌రావు మాట్లాడుతూ పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామని, ప్రభుత్వానికి తాము ఎల్లప్పుడు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి పౌల్ట్రీ రైతులకు రూ. 5.51కోట్ల ఆస్తి పన్నులను రేవంత్‌రెడ్డి మానవతాదృక్పదంతో రద్దు చేసి జిఓ విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. జీవనోపాధి కోసం సుమారు 200 కుటుంబాలు చటాన్‌పల్లి గ్రామ పంచాయతీకి వచ్చి పౌల్ట్రీ షెడ్లను ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నామని గుర్తు చేశారు. దాంతో మున్సిపల్ ఏర్పడిన తరువాతే ఆస్తి పన్నులు విపరీతంగా పెంచి వేశారని దాంతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ప్రభుత్వం ముందుకు వచ్చి పన్నులను రద్దు చేయడం ఎంతో సంతోషంగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో పౌల్ట్రి రైతులు గుదె వసంతరావు, మక్కాపాటి మల్లేశ్వర్ రావు, కొర్రపాటి శ్రీనివాసరావు, మలినేని శ్రీనివాసరావులు ఉన్నారు.

## ప్రహారీగోడ లేక ప్రైవేట్ వాహనాలకు అడ్డాగా మారిన బస్టాండ్



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఆర్‌టిసి బస్టాండ్‌కు ప్రహారీ గోడ లేక ప్రైవేట్ వాహనాలకు అడ్డాగా మారిపోయిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్‌టిసి బస్సులు డిపోకు రాకుండానే రోడ్డుపై నిలిచి ప్రయాణీకులకు ఎక్కించుకోవాల్సి వస్తుందని అంటున్నారు. కొందుర్గు బస్టాండ్‌కు ప్రహారిగోడను నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అనేక మార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ వాహనదారులు ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని అంటున్నారు. అధికారులు ప్రహారీ గోడ నిర్మించకపోవడంతో వాహనాల పార్కింగ్ కాకుండా కబ్జాలకు గురయ్యే అవకాశాలు సైతం ఎక్కువగానే ఉన్నాయని ప్రజలు అంటున్నారు. బస్టాండ్‌కు ప్రహారీగోడ నిర్మించాలని గతంలో కొంతమంది యువకులు ధర్నాలు, రాస్తారోకోలు సైతం చేశారని, అయినా అధికారుల్లో ఎలాంటి స్పందన లేదని వాపోతున్నారు. ప్రయాణీకుల సౌకర్యాలను దృష్టిలు పెట్టుకొని బస్టాండ్‌కు ప్రహారీ గోడను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంతో మరోమారు ధర్నా, రాస్తారోకో చేస్తామని యువకులు హెచ్చరిస్తున్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/మియాపూర్:** భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు.అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అయితే సిబ్బందిని నియమించారు.వర్షాలకు రోడ్లపై ఎక్కడ నీరు నిలువకుండా తగు చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల మీద నుంచి కాల్వల్లోకి వరద వెళ్లే లా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని విభాగాల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు.సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని తమకు కేటాయించిన కాలనీల్లో పర్యటించి ప్రమాదకార మ్యాన్ హోల్స్,నాలాలకు సేఫ్టీ జాలీలు,అనధికార సెల్లార్ గుంతలు, శిథిల భవనాలు,లోతట్టు ప్రాంతాలు మొదలైనవి గుర్తించి ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం ఇచ్చి గుర్తించిన వాటిలో పనులు వెంటనే జరిగేలా చూడాలని సూచించారు.

## యువతిపై బలవంతంగా లైంగికదాడి

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** ఓ యువతిని వేధించడం, బెదిరింపులకు దిగటమే కాకుండా బలవంతంగా లైంగిక దాడి చేయడమే కాకుండా తీవ్రంగా గాయపరిచిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించిన ఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకొన్నది. ఎస్‌ఐ వెంకటకిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్, కపాడియా వీధిలోని ఓ ఆపార్టుమెంట్‌లో బాధిత యువతి గత మూడేళ్లుగా నివాసముంటూ మణికొండలోని లాంకోహిల్స్ వద్ద సదర్లాండ్ ప్రై.లిమిటెడ్ కంపెనీలో టెక్నికల్ సపోర్టు ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నది. అదే సమయంలో ఆ యువతికి భాను ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడగా, ఆమెను పెళ్లి చేసుకొంటానని నమ్మించాడు. తరచూ యువతి వద్దకు భానుప్రసాద్ వచ్చి వేధించడం, కొట్టడం, బెదిరించడం మొదలుపెట్టాడు. ఈ ఏడాది అక్టోబర్ 26న రాత్రి 9.30 గంటల సమయంలో అతను యువతి గదికొచ్చి, ఆమె తోటి స్నేహితురాళ్లు అడ్డుపడినా బలవంతంగా లైంగిక దాడి చేశాడు. ఈ క్రమంలో కత్తెరతో యువతి వేళ్లకు, గొంతు నులిమి గాయాలు చేశాడు. పైగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే, యాసిడ్ దాడి చేస్తానని, చంపేస్తానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

# నగరంలో జోరువాన




### పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు

### ఉస్మాన్‌సాగర్ 10 గేట్లు ఎత్తి మూసీలోకి 2,630 క్యూసెక్కుల నీరు విడుదల

**హైదరాబాద్ :** మొంథా తుఫాన్ ప్రభావంతో హైదరాబాద్ నగరంలో జోరువాన కురుస్తోంది. బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. వరద నీటితో ఉప్పల్, నాగోల్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి. అమీర్‌పేట్, ఎస్‌ఆర్‌నగర్, సనత్‌నగర్, మధురానగర్, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, ఎల్లారెడ్డిగూడలో తదితర ప్రాంతాల్లో వర్షపు చినుకులకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రగడ్డ, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, కూకట్‌పల్లి, జెన్‌టియు, మూసాపేటలో రోడ్లు కాలువల్లా మారాయి. రాయదుర్గం కారిడార్‌లో పదుల కిలోమీటర్ల కొద్ది ట్రాఫిక్ జామ్ అయింది. కార్యాలయాల నుంచి వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**ఉస్మాన్‌సాగర్ 10 గేట్లు ఎత్తివేత**

తుఫాన్ ప్రభావంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపిలేని వర్షం ఏకధాటిగా పడుతోంది. దీంతో జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లకు వరద ప్రవాహం పెరిగింది. ఉస్మాన్‌సాగర్ 10 గేట్లు ఎత్తి మూసీలోకి 2,630 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. జంట జలాశయాల్లోకి వరద పెరగడంతో చాదర్‌ఘాట్, మూసి పరీవాహక ప్రాంత ప్రజలను జిహెచ్‌ఎంసి అధికారులు అప్రమత్తం చేశారు. భారీ వర్షానికి అంబర్‌పేట్‌లోని అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి వర్షపు నీరు ప్రవహిస్తోంది. ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని జిహెచ్‌ఎంసి కూల్చివేతలను కూడా గతంలోనే చేపట్టింది. అంబర్‌పేట్ నుంచి మూసారాంబాగ్ బ్రిడ్జి మీదుగా దిల్‌సుఖ్‌నగర్‌కు వేగంగా ప్రయాణికులు చేరుకునేవారు. కానీ ప్రస్తుతం గోల్నాక మీదుగా వెళ్లి అక్కడ ఉన్న మూసీ నది బ్రిడ్జి దాటాలంటే అదనంగా మరో 3 నుంచి 4 కిలోమీటర్ల మేర ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఈ సమస్యను త్వరగా పరిష్కరించి బ్రిడ్జి నిర్మాణం వేగంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికారులతో జలమండలి ఎండి టెలీ కాన్ఫరెన్స్**

నగరంలో కురుస్తున్న భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలమండలి ఎండి అశోక్ రెడ్డి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు (ఇఆర్‌టి), ఎస్‌పిటి వాహనాలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. సూచించారు. తరచూ సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్‌హోళ్ల గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నీరు నిలిచే ప్రాంతాలపైన ఈ బృందాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.. ఈ సమయంలో కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తాగునీటిలో తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.అలాగే వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటి సరఫరాపై అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాల అదేశించారు. అధికారులు 24 గంటలు క్షేత్ర స్థాయిలో సిబ్బందితో ర్యవేక్షించుకోవాలని సూచించారు. జిహెచ్‌ఎంసి, హైడ్రా, పోలీస్ శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్ హోల్ మూతలను తెరవకూడదని ఆయన సూచించారు. ఇతర వివరాలకు జలమండలి కస్టమేర్ కేర్ 155313కి కాల్ చేయాలని ఆయన కోరారు.

**నగరంలో హైడ్రా, జిహెచ్‌ఎంసి కమిషనర్ల క్షేత్రస్థాయి పర్యటన**

గ్రేటర్ హైదరాబాద్ లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లక్డికపూల్ పరిసర ప్రాంతాలను బుధవారం హైడ్రా, జిహెచ్ ఎంసి కమిషనర్లు ఏవీ రంగనాథ్, ఆర్.వి. కర్ణన్‌లు సంయుక్తంగా పరిశీలించారు. నగరంలో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి తరుచు ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతుండడంతో కమిషన్లు ఇద్దరు పలు ప్రాంతాలను పరిశీలించారు. మాసబ్ ట్యాంకు నుంచి లక్డికపూల్ వైపు వస్తున్నప్పుడు మెహదీ ఫంక్షన్ హాల్ వద్ద వర్షపు నీరు రోడ్డు మీద నిలవడానికి కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఇరువురు కమిషనర్లు అధికారులను ఆదేశించారు.

**రంగారెడ్డి జిల్లాలో**

రంగారెడ్డి జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది.దీంతో జన జీవనం పూర్తిగా స్తం భించింది.కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని తలకొండపల్లి మండలం 117.2,ఆమనగల్లు లో 81.6, షాద్ నగర్ నియోజకవర్గం పరిధిలోని కే శంపేట్ మండలంలో 62.9,కొందుర్గు మండలం 57.1వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

## గ్రామీణ నిరుపేదలు ఆర్థికంగా రాణించేందుకు కృషి :ఎమ్మెల్యే కాలే




**ప్రజాపక్షం/షాబాద్:** గ్రామీణ నిరుపేదలు ఆర్థికంగా రాణించేందుకు కృషి చేస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మైక్రోసాఫ్ట్ నిర్వాహకులు శ్రీ చందన పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో మైక్రోసాఫ్ట్ సహకారంతో యునైటెడ్ ఆఫ్ హైద్రాబాద్ కమిటి ఆధ్వర్యంలో కమ్యూనిటి ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో వివిధ వృత్తుల్లో పని చేస్తున్న నిరుపేద కార్మికులకు 32రకాల వృత్తి పరమైన పనిముట్లు మహిళలకు కుట్టు మిషన్లు, యువకులకు కూరగాయ బండ్లు, ప్లంబర్ కిట్, ఎలక్ట్రిక్ కిట్లు, డ్రై క్లినింగ్ మిషన్లు, ఐరన్ బాక్స్‌లను మైక్రోసాఫ్ట్ నిర్వాహకులు శ్రీ చందన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మధుసూదన్‌రెడ్డిలు మాట్లాడుతూ షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ పారిశ్రామిక వాడ అభివృద్ధిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు స్కిల్ డెవలప్‌మెంట్ నేర్పించి అందరికి ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. యువత విద్యను అభ్యసించి పరిశ్రమల్లో మంచి ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. స్థానిక పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పొందేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి కార్మికులు వచ్చి జీవనోపాధి పొం దుతున్నారని గుర్తు చేశారు. ఇదే తరహాలో స్థానిక యువత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగ, ఉపా ధి అవకాశాలు పొందేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపిటిసి కుమ్మ రి చెన్నయ్య, మైక్రోసాఫ్ట్ కమిటి అడ్వైజర్స్, సిబ్బం ది హర్ష, రాములు, మైక్రోసాఫ్ట్ మేనేజర్ సతీష్‌లు పాల్గొన్నారు.



## 35 గంజాయి పాకెట్ల పట్టివేత..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బీదర్ నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు తీసుకువచ్చిన 35 గంజాయి ప్యాకెట్లను ఎస్‌టిఎఫ్ టీం ఎస్‌ఐ బాలరాజు స్వాధీనం చేసుకుని మల్కాజ్‌గిరి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. రవి తేజ, సతీష్‌గౌడ్‌తో పాటు మరో వ్యక్తి గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం రావడంతో ఎస్‌ఐ బాలరాజు బుధవారం కొకూరులో దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు





● దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలు ● లబోదిబోమంటున్న అన్నదాతలు ● ఎకరాలకు రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పంటపోలాల్లో ఎక్కడ చూసినా వర్షపునీరు నిల్వ ఉండటంతో అన్నదాతలు ఏమి చేయలేక తలలు పట్టుకుంటున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల్లో కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం కష్టపడి పంటలను సాగుచేసిన అన్నదాతలకు నిరాషే మిగులుతుందని వాపోతున్నారు. చేతికొచ్చిన పంటలు పూర్తిగా వర్షపునీటిలో ఉండిపోవడంతో ఏమి చేయలేక దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నామని రైతులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నుండి బుధవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న తుఫాన్ వర్షాలతో వివిధ మండలాల్లో ఉన్న వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. దాంతో వ్యవసాయ క్షేత్రాలలో వర్షపు నీరు నిలువదంతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పత్తి పంట చేతికొచ్చే సమయంలో తుఫాను వర్షాలు రావదంతో పూర్తిగా నేలపాలు అవుతుందని, ఇదే విధంగా వర్షం కొనసాగితే పత్తి మొలకొచ్చే అవకాశం ఉంటుందని అన్నదాతలు పేర్కొంటున్నారు. వ్యవసాయ పోలం నుండి పత్తి పంటను ఇంటికి తీసుకువద్దామని అనుకునే సమయంలోనే తుఫాను వర్షాలు వచ్చి తీవ్ర నష్టాలను మిగిల్చాయని అన్నదాతలు లబోదిబోమంటున్నారు. పంటల సాగుకోసం వేల రూపాయాలు ఖర్చు చేసి పంటలను ఇంటికి తీసుకువద్దామని అనుకునే సమయంలోనే ఇలాంటి దుస్థితి ఏర్పడటంతో ఏమి చేయాలో తెలియక అనేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు అంటున్నారు. పంటల సాగుకోసం పెట్టిన పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితులు కనిపించడం లేదని, దాంతో అప్పుల పాలు కావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు. పత్తి, మొక్కజొన్న, వరి, కూరగాయల పంటలు పూర్తిగా ఎక్కడికక్కడే దెబ్బతిన్నాయని అంటున్నారు. తుఫాను వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన అన్నదాతలకు ఎకరాలకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వమని చెప్పడం గొప్పకాదు..ఇలాంటి పరిస్థితుల్లో అన్నదాతలను అదుకుంటేనే గొప్పవిషయమని పేర్కొన్నారు.

**సర్వే చేసి నష్టపోయిన పంటవివరాలను సేకరిస్తాం**

తుఫాను వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన వాటి వివరాలను సేకరించేందుకు సర్వే నిర్వహించనున్నట్లు ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ శాఖ అధికారి నిశాంత్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు ఎలాంటి అదేశాలు రాలేదని, పంటల నష్టంపై అంచనాలు వేసేందుకు కృషి చేస్తున్నామని, గ్రామాల వారిగా రైతుల వివరాలను సేకరించేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఎవరు కూడా ఆదైర్య పడోద్దని, దైరంగా ఉండాలని ఆకాంక్షించారు.

## పేదలను అన్ని విధాలా ఆదుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

### షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్/కేశంపేట:** పేద ప్రజలను అన్ని విధాల అదుకోవాలన్నదే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగానే ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తున్నామని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ వివరించారు. బుధవారం పట్టణంలోని ఎంపిడివో కార్యాలయ సమావేశ మందిరంలో కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఆడ పిల్లల తల్లిదండ్రులకు ఎలాంటి ఆర్థిక పరమైన ఇబ్బందులు రావద్దనే లక్ష్యంతోనే ప్రభుత్వం కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేస్తుందని వివరించారు. రాష్ట్రం ఆర్థిక పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఎలాంటి కష్టాలను రానివ్వకుండా జాగ్రత్తగా చూసుకుంటుందని పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ మండలానికి వచ్చిన 54 కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా కేశంపేట మండలానికి వచ్చిన 21కళ్యాణలక్ష్మీమ, షాది ముబారక్ చెక్కులను ఆయా మండలాల ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్లను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామని, ఒకేసారి కాకుండా దశల వారిగా అభివృద్ధిచేసేందుకు కృ షి చేస్తున్నామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ మహ్మద్ బాబర్‌ఖాన్, కేశంపేట మాజీ జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, తహశీల్దార్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

**పాఠశాలకు రూ.10కోట్ల నిధులు**

ఫరూక్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద జి ల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.10కోట్ల నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే వివరించారు. గత జనవరి 31వ తేది పాఠశాల 150వ వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే ఆ హ్వానించారు. వారి ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై పాఠశాల అభివృద్ధికి రూ.10కోట్ల నిధులు ఇస్తామని హామీ ఇచ్చిన మేరకు రూ.10కోట్ల నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.

## 31న హరిహర కళాభవన్‌లో ‘గల మ్యాజిక్ షో ’




**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** నగరవాసులను అలరించేందుకు మొట్టమొదటి సారిగా ఈ నెల 31న సికింద్రాభాద్‌లోని హరిహర కళాభవన్‌లో సూపర్ స్టార్ జాద్గుర్ సికిందర్ ఆధ్వర్యంలో ‘గల మ్యాజిక్ షో’ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వాహకులు ప్రదీప్, సంపత్, రెహమాన్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది విభిన్న ఆవిష్కరణలు, విన్యాసాలుంటాయన్నారు. మెజిషియన్ సికిందర్ బృందం డైనోసార్ భ్రమను కల్పించే విన్యాసాలు, బెర్ముడా ట్రయాంగిల్ ఎఫెక్ట్, ఇతర అనేక ఉత్కంఠభరితమైన విన్యాసాలు ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రత్యేక కామెడీ షో కూడా ఉంటుందన్నారు. వివరాలకు www. jadugarsikindar.comను సంప్రదించాలని సూచించారు.

## రోడ్లు తవ్వారు.. పనులు మరిచారు..

### వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు


**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మున్సిపల్ అభివృద్ధి పేరుతో రోడ్లు తవ్వారు.. కంకర వేసి రోడ్డు వేయడం మరచిపోవడంతో ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రోడ్లపై వర్షపు నీరు నిలువడంతో వ్యాపారస్తులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ముందస్తు ప్రణాళికలు లేకుండానే ఇష్టారాజ్యంగా రోడ్లు తవ్వి వదిలేశారే తప్పా పనులు చేయడంతో అధికారులు శ్రద్ధ చూపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఫరూఖ్‌నర్, పద్మావతి కాలనీ, భాగ్యనగర్ కాలనీలతోపాటు మిగతా వార్డులో సిసి రోడ్లు వేసేందుకు అధికారులు ఇష్టం వచ్చినట్లు రోడ్లు తవ్వారు..సిసి రోడ్లు వేయడంతో నెలలు గడిస్తుండటంతో ప్రజలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనులు చేస్తే ఇబ్బందులు ఉండేవి కావని, నిర్లక్ష్యంగా పనులు చేయడంతోనే ఇలాంటి అవస్థలు ఎదుర్కొవాల్సి వస్తుందంటున్నారు. మున్సిపాలిటికి పాలక మండలి సభ్యులు లేకపోవడంతోనే అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, నిర్లక్ష్యం వీడి పనులు చేస్తేనే బాగుంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేసేందుకు చర్య లు తీసుకోవాలని, లేని పక్షంతో ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాగా రోడ్డు విస్తరణ పనుల వల్లనే కొంత జాప్యం చోటు చేసుకుంటున్న మా ట వాస్తవమేనని, త్వరలోనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని షాద్‌నగర్ మున్సిపల్ కమీషనర్ సునీత తెలిపారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో వేసిన సిసి రోడ్లు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని పేర్కొన్నారు.



# క్రీడ

# వర్షార్పణం..

## టీమ్‌ఇండియా.. ఆసీస్ మధ్య తొలి టీ20 రద్దు



అయిదు టీ20 సిరీస్‌లో భాగంగా టీమ్‌ఇండియా, ఆస్ట్రేలియా మధ్య బుధవారం కాన్‌బెర్రా వేదికగా తొలి మ్యాచ్ వర్షం కారణంగా అర్ధాంతరంగా రద్దైంది. కేవలం 9.4 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. మొదట టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఆట నిలిచి పోయే సమయానికి భారత్ 1 వికెట్ కోల్పోయి 97 పరుగులు చేసింది.

మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆది నుంచి దూకుడుగా ఆడే ప్రయత్నం చేసింది. ఓపెనర్‌గా వచ్చిన అభిషేక్ శర్మ తనకు దక్కిన ఆరంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో (3.5) అతడు ఫీల్డర్ మీదుగా ఫోర్ కొట్టే ప్రయత్నంలో భాగంగా బంతిని గాల్లోకి లేపాడు. దాన్ని టిమ్‌డేవిడ్ ఒడిసి పట్టుకున్నాడు. దీంతో అభిషేక్ 19 పరుగులకు (14 బంతుల్లో, 4 ఫోర్లు) పెవిలియన్‌కు చేరాడు. దీంతో టీమ్‌ఇండియా తన తొలి వికెట్‌ను 35 పరుగుల వద్ద కోల్పోయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన టీమ్ ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, గిల్‌తో కలిసి టీమ్‌ఇండియాను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో 5 ఓవర్లు ముగిసిన తర్వాత వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. తర్వాత కాసేపటికి వాన ఆగిపోవడంతో మ్యాచ్ ప్రారంభమైంది. అయితే ఆటను 18 ఓవర్లకు కుదించారు. మ్యాచ్ తిరిగి ప్రారంభమైన తర్వాత కాసేపటికి.. సూర్యకుమార్ 18 పరుగుల వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. జేవియర్ బ్రేట్‌లెట్ బౌలింగ్‌లో (7.3) అతడు ఇచ్చిన క్యాచ్‌ను జోష్ ఫిలిప్ పట్టుకోలేకపోయాడు. అనంతరం మరింత జాగ్రత్తగా ఆడిన.. గిల్, సూర్యకుమార్ యాదవ్ రెండో వికెట్‌కు 32 బంతుల్లోనే అర్ధశతక భాగస్వామ్యం నమోదు చేశారు. భారత బ్యాటర్లు ఇక గేర్లు మార్చి వేగంగా పరుగులు చేయాలని చూస్తున్న తరుణంలోనే 9.4 ఓవర్ల వద్ద వరుణుడు ఆటకు మరోసారి ఆటంకం కలిగించాడు. అప్పటికి టీమ్‌ఇండియా స్కోర్ 97/1గా ఉంది. రెండోసారి మ్యాచ్ ఆగడానికి ముందు నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో (9.3) సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన సిక్స్ బాదాడు. ఇది అతడికి టీ20ల్లో 150వ సిక్స్. అతడు 86 ఇన్నింగ్స్‌ల్లో, 1649 బంతులు ఎదుర్కొని ఈ ఘనతను సాధించాడు.

తర్వాత ఆటను కొనసాగించే పరిస్థితులు లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను అర్ధాంతరంగా ముగించారు. మ్యాచ్ ఆగే సమయానికి శుభ్‌మన్ గిల్ (37*), సూర్యకుమార్ యాదవ్ (39*) నాటౌట్‌గా నిలిచారు. రెండో టీ20 మ్యాచ్ మెల్‌బోర్న్ వేదికగా.. శుక్రవారం (అక్టోబర్ 31) జరగనుంది.

## ‘కంగారూ’ను జయిస్తేనే ఫైనల్‌కు..


మహిళల ప్రపంచ కప్ ఆఖరి దశకు చేరుకుంది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా.. ఆశించిన మేరకు ప్రదర్శన చేయకపోయినా కాస్త అదృష్టం తోడవడంతో నాలుగో స్థానంలో నిలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. వర్షం అంతరాయంతో టోర్నీలో ఇతర జట్లకు సంబంధించిన చాలా మ్యాచ్‌లు రద్దు కాగా.. భారత్ ఏడు పాయింట్లతో నాకౌట్ దశకు క్వాలిఫై అయింది.



కానీ, ఇక్కడితో సంబరపడొద్దు. అసలు సిసలు పరీక్ష ముందుంది. ఇప్పటివరకు రెండుసార్లు ఫైనల్ చేరినా కప్పు కలను సాకారం చేసుకోలేకపోయిన టీమ్‌ఇండియా.. మూడోసారి టైటిల్ పోరుకు దూసుకెళ్లాలంటే ముందుగా ‘కంగారూ’ను జయించాలి. అక్టోబర్ 30న జరిగే రెండో సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను హర్మన్‌ప్రీత్ సేన అమీ తుమీ తేల్చుకోనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియాను ఓడించడం భారత్‌కు అంత తేలిక కాదు. ఇప్పటికే లీగ్ దశలో కంగారూలతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 330 పరుగులు చేసినా లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. ఎల్లిస్ పెర్రీ, ఆష్లీన్ గార్డ్‌నర్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ బెత్ మూనీలతో ఆ జట్టు బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగా ఉంది. వీరంతా ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపుతిప్పగల సత్తా ఉన్నవాళ్లే. సూపర్ ఫామ్‌లో ఉన్న ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ భారత్‌తో సెమీస్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు. ఇది భారత్‌కు ఉపశమనాన్ని ఇచ్చే అంశం. బౌలింగ్‌లో ప్రధానంగా అలానా కింగ్, అన్నాబెల్ సదర్లాండ్‌తో భారత్‌కు ముప్పుంది. సోఫీ మోలినెక్స్, ఆష్లీన్ గార్డ్‌నర్ కూడా బంతితో రాణిస్తే టీమ్‌ఇండియాకు ఇబ్బందులు తప్పవు. సెమీస్‌కు ముందు ఫామ్‌లో ఉన్న ప్రతీక రావల్ గాయంతో టోర్నీకి దూరమవడం భారత్‌కు ప్రతికూలంగా మారింది. స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్ సింగ్, దీప్తి శర్మ, రిచా ఘోష్‌లతో పేపర్ మీద టీమ్‌ఇండియా బ్యాటింగ్ విభాగం బలంగా కనిపిస్తున్నా వీరు ఏ మేరకు రాణిస్తారనే దానిపైనే భారత్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. క్రాంతి గౌడ్ శ్రీచరణి, దీప్తి, రేణుకా సింగ్ బంతితో మెరిస్తే ఆసీస్‌కు షాకిచ్చి ఫైనల్‌కు దూసుకెళ్లడం ఖాయం!


మహిళల క్రికెట్లో ఇప్పటి దాకా 12 వన్డే ప్రపంచకప్‌లు జరగ్గా.. భారత్ నాలుగుసార్లు సెమీస్‌కు చేరింది. ప్రస్తుతం జరుగుతోన్న 13వ ఎడిషన్‌లో భారత్ మరోసారి నాకౌట్ దశకు అర్హత సాధించగలిగింది. 1997లో ఆస్ట్రేలియా, 2005లో న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలైంది. 2005లో కివీస్‌ని 40 పరుగుల తేడాతో మట్టికరిపించిన మిథాలి రాజ్ సేన.. తుది పోరులో ఆస్ట్రేలియా జోరు ముందు నిలవలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 2017లో కప్పు గెలిచేందుకు భారత అమ్మాయిలకు మంచి అవకాశమే వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయారు. సెమీస్‌లో భీకర ఆస్ట్రేలియాను ఓడించిన భారత్.. ఫైనల్‌లో ఇంగ్లాండ్ చేతిలో 9 పరుగుల తేడాతో ఓడి విశ్వవిజేతగా నిలిచే ఛాన్స్‌ను మిస్ చేసుకుంది. ఇప్పుడు టైటిల్‌కు మరో రెండు అడుగుల దూరంలో నిలిచిన టీమ్‌ఇండియా.. సెమీస్‌లో ‘ఆస్ట్రేలియా’ గండాన్ని దాటితే.. ఫైనల్‌లో ఇంగ్లాండ లేదా సౌతాఫ్రికాతో తలపడుతుంది.

# ఫోకస్




## పాఠాలు నేర్పే సలమిస్ యుద్ధం

చారిత్రక ఘటనలు కేవలం చరిత్రను మాత్రమే వివరిస్తాయనుకుంటే పొరపాటే. కొన్ని ఘట్టాలన పాఠాలు నేర్పుతాయి. క్రీస్తు పూర్వం 480లో జరిగిన ‘సలమిస్ యుద్ధం’ ఇందుకు ఉదాహరణ. పర్షియన్ సామ్రాజ్యం (ప్రస్తుత ఇరాన్ తదితర ప్రాంతాలు) విస్తరణకు జెర్జెక్స్ విస్తారమైన సైన్యాన్ని సమకూర్చుకున్నాడు. అన్ని రకాలుగా యుద్ధ సామాగ్రిని సిద్ధం చేసుకొని గ్రీస్ (యవన దేశం)పై దాడికి దిగాడు. ఆ రోజుల్లో పర్షియన్ నౌకా బలానికి తిరుగు లేకపోయేది. నౌకాదళం పొంచి ఉండగా, పర్షియన్ సైనికులు ఏథెన్స్‌పై విరుచుకుపడ్డారు. నగరాన్ని ధ్వంసం చేశారు. ప్రజలు భయంతో పారిపోయారు. గ్రీస్ ఓటమి అంచున నిలిచింది. ఆ సమయంలో గ్రీకు వ్యూహకర్త థెమిస్టోక్లిస్ తన దేశాన్ని రక్షించుకోవడానికి గొప్ప ప్రణాళిక వేశాడు.



పర్షియన్ నౌకా దళంలో భారీ నౌకలు ఉండగా, గ్రీస్ వద్ద ఉన్నవి చిన్న నౌకలు. ఈ విషయాన్ని గుర్తించిన థెమిస్టోక్లిస్ మధ్యదరా సముద్రం నుంచి తమ భూభాగాన్ని కలిపే ఒక ఇరుకైన జల సంధిలోకి తమ నౌకలను చేర్చాడు. పర్షియన్ నౌకాదళంపై మెరుపుదాడి దాడి చేసి, వెంటనే వెనుదిరగాల్సిందిగా సూచించాడు. అతని వ్యూహం ఫలించింది. గ్రీకు నౌకలను అనుసరిస్తూ వెళ్లిన పర్షియన్ నౌకలు, ఆ ఇరుకైన జలసంధిలో చిక్కుపడ్డాయి. భారీగా ఉండడంతో, పక్కకు తిప్పడానికిగానీ, వెనక్కు తిరగడానికిగానీ వీలులేని పరిస్థితి. అదే అదునుగా గ్రీకు నౌకా దళం చెలరేగిపోయింది. దాడులు ముమ్మరం చేసింది. ఒకదాని తర్వాత మరొకటిగా నౌకలను ముంచేయడం మొదలు పెట్టింది. తన కళ్ల ముందే నౌకాదళం నాశనం కావడాన్ని చూసి పర్షియన్ రాజు జెర్జెక్స్ దిగ్భ్రాంతికి గురయ్యాడు. యుద్ధం విరమించి, మిగిలిన సేనలను తీసుకొని తిరుగుప్రయాణమయ్యాడు. ఈ యుద్ధంలో గ్రీస్ చారిత్రక విజయాన్ని సాధించింది. ఒకే ఒక వ్యక్తి తన వ్యూహ రచనతో అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. గ్రీకులు తమ స్వాతంత్ర్యాన్ని కాపాడుగోలిగారు. పాశ్చాత్య నాగరికతను పునాది అయిన ప్రజాస్వామ్యం, తత్వశాస్త్రం, కళలు గ్రీస్ నుంచి ఉద్భవించాయి. ప్రపంచమంతటా విస్తరించాయి. ఈ యుద్ధం ద్వారా బలంతో మాత్రమే విజయం సాధ్యం కాదని, బుద్ధి, వ్యూహం, ధైర్యం ఉంటే అసాధ్యమనే పదమే ఉండదని థెమిస్టోక్లిస్ నిరూపించాడు. తక్కువ సైన్యంతోనే, వ్యూహాత్మకంగా పెద్ద సామ్రాజ్యాన్ని ఓడించాడు. అందుకే సముద్ర యుద్ధ మేధావిగా చరిత్రలో నిలిచిపోయాడు.

## కెర్బ్‌స్టోన్

ఐర్లాండ్‌లోని బోయిన్ వ్యాలీ ప్రాంతంలో ఉన్న ‘నోత్’ అనేది సుమారు 5000 సంవత్సరాల నాటి నియోలితిక్ సమాధి సముదాయం. కెర్బ్‌స్టోన్ (పురాతన కాలంలో దీనిని ఫుట్‌పాత్ లేదా పేవ్‌మెట్ కోసం వాడేవారు) రాతి పలకలు ఆధునిక





పురావస్తు పరిశోధనల్లో అత్యంత మర్మమైన కళాఖండాలుగా పేరు సంపాదించాయి. ఇక్కడ మొత్తం 124 రాతిపలకాలలో గొప్ప అందం, జ్యామితీయ (జామెంట్రికల్) నైపుణ్యం, ఖగోళ సార్థకత కారణంగా విశేష ప్రాధాన్యం పొందింది. ఈ రాయి ఉపరితలంపై చెక్కిన స్పైరల్‌లు, వజ్రాకారాలు, జిగ్‌జాగ్ ఆకారాలు చూసినప్పుడు అవి సాధారణ అలంకారాలు కాదనే విషయం తెలుస్తుంది. పురావస్తు శాస్త్రజ్ఞుల ప్రకారం ఈ నమూనాలు సూర్యుడు, చంద్రుడు, మాసాలు, ఋతువులు వంటి ఖగోళ చక్రాలకు సంకేతాలై ఉండవచ్చు. ప్రత్యేకంగా కనిపించే గీతలు , కేంద్రీకృత వృత్తాలు ప్రాచీన సూర్య చంద్ర గమనాలు గుర్తించేందుకు ఉపయోగించబడిన సూచికలుగా కొంతమంది పరిగణిస్తున్నారు. సౌర కాలమానం సిద్ధాంతంకొన్ని పరిశోధకులు కెర్బ్‌స్టోన్ 15 ను సౌర క్యాలెండర్ లేదా ప్రాచీన దిన గణన పరికరంగా అభివర్ణించారు. రాయిపై కనిపించే 13 స్పైరల్ తిరుగులు ఒక సంవత్సరంలోని నెలలను లేదా రుతు మార్పులను సూచిస్తాయని, కేంద్రం నుండి బయటి వృత్తాల దిశలో సూర్యుని మార్గాన్ని సూచించే ప్రయత్నమని భావిస్తున్నారు. ఇది ప్రాచీన ఐరిష్ ప్రజల ఖగోళ అవగాహనకు, కాలం గమనాన్ని గమనించే గణనాత్మక ప్రయత్నాలకు ఉదాహరణగా నిలుస్తుంది. ఆస్ట్రోనామికల్ నిర్దేశాలు ‘నోత్’ సమాధి సముదాయంలోని



తూర్పు–పడమర మార్గాల దిశలతో అనుసంధానం చెందుతాయి. ఇది సూర్యోదయం, సూర్యాస్తమం మధ్య సమతౌల్యం సాధించేందుకు నిర్దిష్టంగా రూపొందించబడినట్టు సూచిస్తుంది. ఈ రాతిపై నమూనాలు కేవలం ఖగోళ వివరాలు కాకుండా, పూజా కర్మకాండాలు, ఆత్మల పట్ల గౌరవం, జీవిత చక్రం పట్ల విశ్వాసంతో కూడిన ఆధ్యాత్మిక చిహ్నాలుగా కూడా ఉండవచ్చు. ఈ స్థలంలో కళ, నమ్మకం, ప్రకృతి జ్ఞానం వంటి అంశాలు ఇవి కలిసిన ప్రాచీన ప్రజల మేధస్సును ప్రతిబింబిస్తున్నాయి.



# కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం

- ఎల్ఐసి బీమా డబ్బులను అదానీకి అప్పగించిన కేంద్ర సర్కార్
- డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ముగింపు ఉత్సవాల భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి..
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/యాదాద్రి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎల్ఐసిలో ఉన్న రూ.33 వేల కోట్ల ప్రజల బీమా సొమ్మును ఆదానీ కంపెనీకి కట్టబెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగ వ్యవహరిస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ఆరోపించారు. బుధవారం సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఎండి ఇమ్రాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఎల్ఐసి అనేది కోట్లాది ప్రజల నమ్మకానికి ప్రతీక. ఈ సంస్థను ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి వదిలేయడం అంటే ప్రజల భవిష్యత్తుతో ఆటలాడటమే. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు బహుమతిగా ఇస్తూ, ప్రజా రంగ సంస్థలను క్రమంగా బలహీనపరుస్తోంది అని, ప్రభుత్వం నిర్ణయాని వ్యతిరేకిస్తూ ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం వేదికగా డిసెంబర్ 26న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని ఇందుకోసం ప్రతి కార్యకర్త నడుం బిగించి ఖమ్మంకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సిపిఐ 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించిందని, దేశ స్వతంత్ర పోరాటంలో అగ్రభాగం నిలిచిందని, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదే అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆర్‌ఆర్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని, బీసీ రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలుపాలని, వాతావరణంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన వరి ధాన్యం, పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. వరి,పత్తి తేమ శాతం పేరుతో ఇబ్బందులు పెట్టకుండా వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. వరి ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవడానికి రైతులకు సరైన వసతులు కల్పించాలని ప్రభుత్వాని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య, చెక్క వెంకటేష్, కుసుమని హరిచంద్ర, ఏశాల అశోక్, పల్లె శేఖర్ రెడ్డి, చిగుల్ల లింగం, పెరబోయిన మహేందర్, జిల్లా సమితి సభ్యులు గాదెగాని మాణిక్యం, అన్నెపు వెంకట్, కళ్లేపల్లి మహేందర్, రేకల శ్రీనివాస్, దాసరి లక్ష్మయ్య, గోరేటి రాములు, బబ్బూరి శ్రీధర్, ఆలేటి బాలరాజు, ఇంజ హేమలత, వడ్లకొండ భరతమ్మ తదితరులు పాల్గొన్నారు.




# డిసెంబర్ 26న ఖమ్మం నగరానికి దండుగా కదులుదాం

- బస్తీలు, పల్లెల్లో సిపిఐ వందేళ్ల ఉత్సవాలు ఘనంగా జరపాలి
- ప్రజాక్షేత్రంలో విస్తృతంగా ప్రచారం చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ శత వసంత సంబురాలను పురస్కరించుకుని రానున్న డిసెంబర్ 26వ తేదిన ఖమ్మం నగరంలో జరిగే ముగింపు సభను ప్రతి పల్లె, బస్తీ నుండి దండుగా కదలాలని, ఇందు కోసం పార్టీ శ్రేణులు నిరంతరం శ్రమించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో శేషగిరి భవన్‌లో జరిగిన కొత్తగూడెం పట్టణ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యాతిధిగా పాల్గొని మాట్లాడారు. సిపిఐ శంతవసంతాల ఉత్సవాలు కేవలం పార్టీ వేడుకులుగా కాకుండా ప్రజల ఉద్యమ చరిత్ర గుర్తు చేసే సమయంగా ఉండాలని, ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం పోరాటాలు నిర్వహించిన సిపిఐ చరిత్ర నేటి తరానికి ఆదర్శంగా ఉండేలా గ్రామ స్థాయిలో ఉత్సవాలు నిర్వహించాలని, వందేళ్ల ఉత్సవాలు సిపిఐ ఆలోచనలు, విలువలను కొత్తతరం వరకు తీసుకెళ్లే అవగాహన కార్యక్రమాలుగా మలచాలని సూచించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ డిసెంబర్ 26 వరకు సిపిఐ శ్రేణులు ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రచారాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. వందేళ్ల ఉత్సవాన్ని వేదికగా చేసుకుని కార్మికులు, కూలీలు, రైతులు, ఉద్యోగులు, యువత, మహిళా సమస్యలపై విస్తృతంగా చర్చలు, సదస్సులు, ర్యాలీల ద్వారా ప్రజా చైతన్యం పెంచాలనిసూచించారు.

ప్రతీ వార్డు ప్రతి గ్రామంలో ఎర్రజెండా ఎగురవేయాలని, సిపిఐ శతాబ్ది ఉత్సవాలను ప్రజల పండుగగా మార్చాలని కూనంనేని పిలుపునిచ్చారు. మర్రి గోపికృష్ణ, మాచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, గెద్దాడు నగేష్, రమణమూర్తి, నేరెళ్ల రమేష్, వంగ వెంకట్, కందుల భాస్కర్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్‌కు ఎఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా శ్రీ చైతన్య పాఠశాలను నడిపిస్తున్నారని అన్నారు. శ్రీ చైతన్య పాఠశాలలో ఫీజులు కట్టని విద్యార్థులను గంటల తరబడి క్లాస్ రూమ్ ముందు నిలబెట్టుతున్నారని, వారికి ఎటువంటి పరీక్షలకు అనుమతించకుండా విద్యార్థులను నానా ఇబ్బందుల కు గురి చేస్తున్నారని అన్నారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలను తనిఖీ చేసి ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న శ్రీ చైతన్య పాఠశాలలను వెంటనే సీజ్ చేయాలని ప్రవీణ్ డిమాండ్ చేశారు.



## సిపిఐలో 30 కుటుంబాలు చేరిక



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం సాంబయ్య గూడెం గ్రామానికి చెందిన సుమారు 30 కుటుంబాలు బుధవారం సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా సమక్షంలో సిపిఐలో చేరారు. వీరికి ఎర్ర జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా సాంబయ్యగూడెం గ్రామంలో సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పులిగల రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కెసాబీర్ భాషా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిన చరిత్ర ఉందని అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పేద ప్రజల కోసం, నిత్యం పనిచేసే కమ్యూనిస్టు పార్టీని ప్రజలు ఆకర్షితులై నేడు సామాన్యగూడంలో 30 కుటుంబాలు చేరిక జరిగిందని ఇది శుభ పరిణామం అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పనిచేసే ముందుకు సాగాలన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ముగింపు వేడుకలకు సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం హాజరై మాట్లాడుతూ శత వసంతాల ముగింపు వేడుకలకు 45 దేశాల నుండి ప్రతినిధులు, జాతీయ, రాష్ట్ర నాయకత్వం మొత్తం భారీ బహిరంగ సభలో పాల్గొటారని కావున ఈ శత జయంతి ముగింపు వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రద చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, సిపిఐ మణుగూరు మండల పట్టణ కార్యదర్శిలు రాజబాబు, సుధాకర్, జిల్లా సమితి సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.

## దేశాల ఆర్థిక స్థితిగతులను దెబ్బ తీయడానికి ట్రంప్ ప్రయత్నం

- ఎగుమతులు దిగుమతులపై అధిక సుంకాలు విధించడం సరికాదు
- చరిత్రలో నిలిచే సిపిఐ శత వసంతాల ఉత్సవాలను విజయవంతం చేద్దాం
- జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** దేశాల స్థితిగతులను దెబ్బ తీయడానికి ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారని ఎగుమతులు, దిగుమతులపై అధిక సుంకాలు విధించడం సరికాదని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. బుధవారం జిల్లా సిపిఐ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేశ్వర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సిపిఐ కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య జిల్లా కౌన్సిల్‌ను ఉద్దేశించి పశ్య పద్మ మాట్లాడారు. డిసెంబర్ 26న సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని, అందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావలన్నారు. చరిత్రలో నిలిచే సిపిఐ శతజయంతి ఉత్సవ కార్యక్రమం విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. అమెరికా బిగ్ అగైన్ అని అతి పెద్ద సంపద గల దేశంగా మార్చుకోవటంలో భాగంగా ఎగుమతులు, దిగుమతులను పెంచుతూ ట్రంప్ కుట్ర చేస్తున్నారన్నారు. అమెరికా దేశ ఆర్థిక స్థితిగతులను పెంచేలా చేస్తున్నారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు న్యాయబద్ధంగా లేకపోవటంతో పాటు వివిధ దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీసేలా ప్రయత్నిస్తున్నారన్నారు. రష్యా నుంచి దిగుమతి అవుతున్న నేపథ్యంలో క్రూడాయిల్‌కు సంబంధించి వెంటనే ఆపాలని, లేని పక్షంలో 25 శాతం అదనంగా సుంకాలు వసూలు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. రష్యా నుంచి ఆయిల్‌ను దిగుమతి చేసుకోమని మోదీ మౌనం వహించటం ఏంటని ప్రశ్నించారు. బిజెపి అవలంభిస్తు న్న తీరుపై ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉం దన్నారు. ప్రజాపోరాటాలు సిపిఐ సాధించిన విజయాలపై చర్చించగలిగే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావలన్నారు. కేంద్రం ప్ర భుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక, రైతు వ్య తిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 26న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. నవంబర్ 18న మైనార్టీలపై దళితలనై మహిళలపై జరుగుతున్న దారుణమైన హత్యలు దాడులను నిరసిస్తూ కార్యక్రమం చేపట్టాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ కార్యవర్గం ఇచ్చిన పిలుపుని విజయవంతం చేయాలని కోరారు. కౌన్సిల్ సమావేశంలో బి.రఘురాం, బొంబాయి గంగారాం, కె. గంగామణి, ఎం. సాయిలు, ఎన్.సాయిలు, అనిల్, హన్మాండ్లు, ఆలీ, ఇమ్రాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

# స్థానికం REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం : అడిషనల్ కలెక్టర్



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ యాదయ్య తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ వార్డు అధికారులతో సమావేశమై ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చర్చించారు. తుఫాను దృశ్య ప్రజలు శిథిలావస్థలో భవనాలు ఉండకుండా చూడాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శశిధర్, వార్డు అధికారులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమ్మె కాలం వేతనాలు చెల్లించాలి



ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకటేష్

**ప్రజాపక్షం/ధన్వాడ:** తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలం వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకటేష్ ధన్వాడ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం ముందు ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్య కోసం ఉద్యమం చేసినప్పుడు వారి ఉద్యమాన్ని విరమింప చేసే సమయంలో ప్రభుత్వానికి సంబంధించిన పెద్దలు సమ్మె కాలం వేతనంతో పాటు నాన్ ఫైనాన్షియల్ సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కానీ ఇప్పటివరకు కనీసం సమ్మె కాలం వేతనం కూడా ఇవ్వలేదని ఆయన వాపోయారు. ఇప్పటికైనా సమ్మె కాలం వేతనం చెల్లించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నీరటి రాఘవేందర్, నాయుడు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు, నాయకులు కుమ్మరి వెంకట్రాములు, శ్యాం ప్రసాద్, రాజేశ్వరి, గోవిందమ్మ పాల్గొన్నారు.

## గొర్లకాపరుల కుటుంబాలను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** తాడూరు మండలం ఐతోల్, గోవిందాయపల్లి, భలాన్‌పల్లి గ్రామాలలో తుఫాన్‌ముసురువర్షం ఈదురుగాలులవలన పెద్ద ఎత్తున గొర్రెలు చనిపోయాయని బాధిత కుటుంబాలను ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని దళితహక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లానాయకులు వెంకటస్వామి, ఎఐవైఎఫ్ జిల్లానాయకులు డిమాండ్ చేశారు. బుధవారంరాత్రి జరిగిన ఘటనలో గొర్రెలు చనిపోయిన కుటుంబాలను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా కొమ్ముభరత్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం నుండి తుఫాన్ వర్షం కారణంగా తాండ్ర ముసలయ్య అనేగొర్రెలకాపరి గొర్రెలు 50నుండి 60 వరకు మరణించాయి. అదేగ్రామానికి చెందిన బండారు రామచంద్రి 50గొర్రెలు చనిపోయాయి. గోవిందాయపల్లి గ్రామంలో బొంకురి నారాయణ 20గొర్రెలు, బొంకూరు బచ్చన్న 20 గొర్రెలు చనిపోయాయి. కాశన్న 35గొర్రెలు చనిపోయాయి వారికి ఒక్కొక్కరికి రూ.4లక్షల నష్టం వాటిల్లిందన్నారు. కావున తక్షణమే రాష్ట్రప్రభుత్వం ఆకుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వెంకటస్వామి, గొల్లరవి, తిరుపతి, బాలయ్య, బాధితులు తాండ్ర ముసలయ్య, బండారు రామచంద్రి, బండారు మురళి, బొంకూరి నారాయణ, బొంకూరి బచ్చన్న, కాశన్న, డిహెచ్‌పిఎస్ నాయకులు అభినవ్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/నర్వ:** మంత్రి శ్రీహరి ఆదేశాల మేరకు బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నర్వలో ప్రారంభించారు. నర్వ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు రైతులు తాము పండించిన వరి ధాన్యం పంటను మద్దతు ధరకు అమ్ముకునేందుకు గాను తెలంగాణ పౌరసరఫరాల సంస్థ వారి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను నర్వ సింగిల్ విండో సంఘం అధ్యక్షులు యల్.శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించడం జరిగింది. రైతులు అందరూ కూడా ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, తాహసీల్దార్ మల్లారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి అఖిలరెడ్డి, నర్వ సంఘం ఉపాధ్యక్షులు యం. లక్ష్మణ్, పాలకవర్గ సభ్యులు ఎ.వివేకానంద రెడ్డి, యం.రామేశ్వర్ రెడ్డి, బి.లింగన్న, యస్.వెంకటేశ్వర్ రెడ్డి, కె.రాములు నాయక్, నడిపి బుచ్చన్న, బి.శ్రీనివాస్ రెడ్డి, పల్లె శేఖర్, రాజకీయ పార్టీ నాయకులు జగన్మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, డిసిసి జనరల్ సెక్రెటరీ నాగన్న, శ్రీనివాస్ రెడ్డి, నాగన్న, వివేకానంద రెడ్డి శరణప్ప, శ్రీనివాస్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, నరేందర్ రెడ్డి, లంకాల రెడ్డి, అయ్యప్పరెడ్డి, నరేందర్‌రెడ్డి, లంకాల జనార్ధన్, రైతులు పాల్గొన్నారు.

## పంటలకు రక్షణ చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో రైతులు తమ పంటలను సస్యరక్షణ చర్యలు తీసుకుని కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పుల్గర్ చర్ల గ్రామంలోని వేరుశనగ, మినుము పంటల పరిశీలన రైతులతో కలిసి పంటల పరిస్థితిని పరిశీలించారు. నిరంతర వర్షాల కారణంగా తేమ అధికమై పంటల్లో తెగుళ్లు, పురుగుల దాడులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రైతులు సమయానికి తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే పంట నష్టం నివారించవచ్చు అని అన్నారు. పంటల్లో తేమ నియంత్రణ, నీరు నిల్వ లేకుండా చూడడం, తెగుళ్ల నియంత్రణ కోసం సూచించిన ఔషధాలను మాత్రమే వాడాలని రైతులకు సూచించారు. జిల్లా హార్టికల్చర్ అధికారి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో కూరగాయ పంటలలో చీడపీడలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంలో పంటల పరిశీలన, తెగుళ్ల గుర్తింపు, సేంద్రియ పద్ధతుల్లో నియంత్రణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల హార్టికల్చర్ అధికారి కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి మోహన్ కుమార్ రెడ్డి, రైతులు గోవిందు, మదగం నరేష్, జుర్రు శివుడు, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థినికి ఘనసన్మానం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి ఎంజేపిటిబిసి బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్‌మొదటి సంవత్సరం ఎంపిసి గ్రూపుచదువుతున్న సుప్రియ కర్నాటక రాష్ట్రంలోని దావనగెరి జిల్లాలో జరుగుతున్న జాతీయస్థాయి క్రీడాపోటీలలో ఖోఖోలో కాంస్యపతకం సాధించడం కళాశాలకు చాలా గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.యామిని, పిఇటిలు బాలశ్రీ, లలిత లు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో పతకాలు సాధించి కళాశాలకు మంచిపేరుతేవాలని తెలిపారు.

# బాలానగర్ పత్తి రైతుల సమస్యకు పరిష్కారం

ముంబైలో సిసిఐ చైర్మన్‌ను మంత్రి కోమటిరెడ్డితో పాటు కలిసి పత్తి రైతుల సమస్యను వివరించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల నియోజకవర్గంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని, బాలానగర్ మండలం చెందిన రైతులు షాద్ నగర్ పత్తి కొనుగోలు కేంద్రంలో తాము పండించిన పత్తిని అమ్ముకోవడానికి అనుమతులు ఇస్తామని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ సిఎండి లలిత్ కుమార్ గుప్తా హామీ ఇచ్చారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. దీంతో తాము పండించిన పంటను అమ్ముకోవడానికి బాలానగర్ ప్రాంత రైతులు ప్రస్తుతం పడుతున్న ఇబ్బందులు తీరిపోతాయని చెప్పారు. ముంబైలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ కార్యాలయంలో మంగళవారం చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కుమార్ గుప్తాను రాష్ట్ర ఆర్.బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాటుగా వెళ్లి కలిశామని ఈ సందర్భంగా నియోజకవర్గంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఇబ్బందులపై ఆయనతో చర్చించి వాటి పరిష్కారానికి వినతిపత్రాన్ని అందజేసామని మీడియాకు విడుదల చేసిక ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి తెలిపారు. బాలానగర్ మండలానికి చెందిన పత్తి రైతులు తాము పండించిన పంటను అమ్ముకోవడానకి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న జడ్చర్ల పత్తి కొనుగోలు కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. బాలానగర్‌కు కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న షాద్‌నగర్ పత్తి కొనుగోలు రైతులు అనుమతించకపోవడంతో దూరభారమైనప్పటికీ జడ్చర్లకు వారు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. దీని వల్ల రవాణ ఖర్చులు రెట్టింపు అవుతుండటంతో రైతులు నష్టపోతున్నారని, అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని లలిత్ కుమార్ గుప్తాకు వివరించగా ఆయన బాలానగర్ పత్తి రైతులు షాద్‌నగర్ పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించుకోవడానికి అవసరమైన అనుమతులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు అనిరుధ్ రెడ్డి వివరించారు. కాగా రాష్ట్రంలో పత్తి పంట సాగు విస్తీర్ణం 45 లక్షల ఎకరాలకు పైగా ఉందని, అయితే ఈ సీజన్‌లో అకాల వర్షాలు సైక్లోన్ ప్రభావం, పురుగు దాడులు, పెరిగిన ఉత్పత్తి ఖర్చులు రైతులు తీవ్రంగా కుంగదీశాయనీ చైర్మన్‌కు వివరించారు. పత్తికి కనీస మద్దతు ధర ప్రకటించినా మార్కెట్‌లో రైతులు దాన్ని పొందలేకపోతున్నారని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెంటనే జోక్య చేసుకొని మద్దతు ధరను పెంచడం, ప్రతి పత్తి సాగు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం, గత సీజన్ల బకాయిలను తక్షణమే విడుదల చేయడం, పంట నష్టపోయిన రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం పురుగు నిరోధిక విత్తనాలపై పరిశోధన పంపిణీ బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకోవాలని అనిరుధ్ రెడ్డి లలిత్ కుమార్ గుప్తాకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ పత్తి రైతులు సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తక్షణ చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉదండాపూర్ ప్రాజెక్టుపై నిర్లక్ష్యం ఎందుకు?



ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నిర్వాసితులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**ప్రజాపక్షం/జడ్చర్ల:** తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద జిల్లా అయిన పాలమూరులో ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు ఎందుకు నిర్లక్ష్యంగా చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. మంగళవారం ఆమె జడ్చర్ల మండల పరిధిలోని ఉదండాపూర్ రిజర్వాయర్‌ను ఆమె సందర్శించి నిర్వాసితులతో మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వం ఉదండాపూర్ ప్రాజెక్టు పనులు పెండింగ్‌లో పెట్టడానికి కరణం ఏంటని ఆమె ప్రశ్నించారు. బాధితులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం ఎందుకు చిన్నచూపు చూస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని ఆమె ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. 80 శాతం పూర్తయిన పనులు 20 శాతం పెండింగులో పెట్టడానికి కారణం ఏంటని అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినా నేటికి ఒక్క అడుగు కూడా ముందుకు సాగడం లేదని ఆమె విమర్శించారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఉదండపూర్ నిర్వాసితులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆమె కోరారు. డిసెంబర్ నెల నాటికి నష్టపరిహారం ప్రాజెక్టు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండు చేశారు. అదే విధంగా రిజర్వాయర్ పనులు పూర్తి చేసి బాధితులకు అండగా ఉండాలని ఆమె కోరారు. ప్రజలకు ఎలాంటి అన్యాయం జరిగిన తెలంగాణ జాగృతి ముందు ఉంటుందని సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఆమె ఉదండాపూర్ బాధితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి ఆవిర్భావ ఉత్సవాలు జెండాలు ఎగురవేయాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఎఐటియూసి 105వ ఆవిర్భావ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ కోరారు. 1920 అక్టోబర్ 31న ఎఐటియూసి ఆవిర్భవించిందన్నారు. ఈసందర్భంగా జెండాలను జిల్లా వ్యాప్తంగా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంతోపాటు హమాలి అడ్డాల వద్ద, ఆటోకార్మికుల అడ్డాల వద్ద, ఐఎంఎఫ్ఎల్ డిపో వద్ద, వివిధరంగాలలో పనిచేస్తున్నటువంటి సంఘటిత అసంఘిత కార్మిక రంగాల ఆధ్వర్యంలో ఎగరవేసి కార్మికుల హక్కుల కోసం సమ్మెలు ధర్నాచేసి కార్మికుల హక్కులు సాధించిపెట్టిన ఘనత ఎఐటియూసికి దక్కిందన్నారు. సమానపనికి సమానవేతనం, ఉద్యోగభద్రత, కాంట్రాక్టు , ఔట్‌సోర్సింగ్ విధానం రద్దుచేసి పర్మినెంట్ విధానాన్ని అమలుచేయాలన్నారు. అనేక పోరాటాలద్వారా నిత్యం కార్మికులను చైతన్యపరుస్తూ తమ హక్కుల సాధనకై అలుపులేని పోరాటాలు చేసిన ఘనత ఎఐటియూసికే దక్కిందన్నారు.

## తుఫాన్‌తో జాగ్రత్తగా ఉండాలి

కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** మొంథా తుఫాను ప్రభావంతో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ విభాగం హెచ్చరికల నేపథ్యంలో అన్నిశాఖలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో ఎన్నడూ లేని విధంగా నిరంతరం అత్యంత భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా రాబోయేరోజుల్లో భారీనుండి అతిభారీవర్షాలుపడే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ తన ఛాంబర్ నుండి అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయంలతో కలిసి నీటిపారుదల, పంచాయతీరాజ్, డిఇఓ, విద్యుత్, వైద్య ఆరోగ్య, మున్సిపల్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పోలీస్, ఫైర్, వ్యవసాయశాఖల అధికారులు, ఆర్‌డిఓలు, తహసీల్దారు, ఎంపిడిఓలతో మొంథా తుఫాన్ వల్ల కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్షాల నేపథ్యంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ మాసం నుండి జిల్లాలో కురిసిన వర్షపాతంకన్న మంగళవారం రాత్రి అత్యంతభారీవర్షం నమోదైందని తెలిపారు. కలెక్టరేట్‌లో 24గంటలు పనిచేసేలా కంట్రోల్‌రూమ్‌నెంబర్ 08540230201 ఏర్పాటు చేయడం జరిగిందని, కంట్రోల్‌రూమ్‌వద్ద పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులందరూ స్థానికంగానే ఉంటూ ప్రజలకు ఇబ్బందులు ఎదురవకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

## పద్నాలుగేళ్లు గడుస్తున్నా కనీస వేతన జిఒల సవరణ ఏది?

తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్



**ప్రజాపక్షం/జడ్చర్ల:** ప్రతి ఐదేళ్లకొకసారి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతన జీవోలు సవరించాల్సి ఉన్న ప్రభుత్వ అధినేతల అలసత్వం కారణంగా 14 ఏళ్లు గడుస్తున్న కనీస వేతన జీవోలు సవరణ ఏది అని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. బుధవారం జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో పి.సురేష్ మాట్లాడుతూ 2012 సంవత్సరంలో అవిభాజ్య ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతన జీవోలను సవరించిందని అప్పటినుండి ఇప్పటివరకు కనీస వేతన జీవోలు సవరణకు నోచుకోలేదని మండిపడ్డారు. స్వరాష్ట్ర తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంటు చేస్తామని హామి నెరవేర్చకపోగా కార్మిక చట్ట ప్రకారం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వేతన జీవోలను సవరించి వేతనాలు అందించాలని ఉన్న అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ఫలితంగా కార్మికులు తీవ్రమైన ఆర్థిక శ్రమ దోపిడికి గురవుతున్నారని అన్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడ అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు గడుస్తున్న అతిగతి లేదని అన్నారు. తెలంగాణ కనీస వేతన బోర్డు సభ్యులు ఏకగ్రీవంగా కనీస వేతనాలు రూ.20,257 అందించాలని ఏకగ్రీవంగా ఆమోదించి ప్రభుత్వానికి నివేదికలు అందజేసి నెలలు గడుస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. కార్మిక వర్గం సంక్షేమం పట్ల నిర్లక్ష్యం చేస్తే కార్మిక వర్గ ఆగ్రహ జ్వాలలు చవిచూడాల్సి వస్తుందని అన్నారు. ఈపిఎఫ్ పరిమితి కూడ అస్తవ్యస్తంగా ఉన్నదని పిఎఫ్ పరిమితి 15 వేల నుండి 30 వేలకు పెంచాలని డిమాండు చేశారు. కార్మికులకు పెండింగు వేతనం తక్షణమే అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు నరసింహా, నాయకులు కార్మికులు శేఖర్, రామకృష్ణ, నవీన్, మల్లేశ్, పేర్మల్, సుక్కమ్మ, మనెమ్మ, శివలీల, విజయలక్ష్మి , అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

## మాతృ మరణాలను తగ్గించేందుకు తగిన చర్యలు



కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లాలో మాతృ మరణాల సంఖ్యను తగ్గించేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు అవసరమైన జాగ్రత్త చర్యలను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జరిగిన మాతృ మరణాల సమీక్షా సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. జిల్లాలోని గుండు మల్, దామరగిద్ద, కోటకొండ, ధన్వాడ నారాయణపేట అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో సంభవించిన 8 మాతృ మరణాల గురించి ఆయా కేంద్రాల వైద్యాధికారులు క్లుప్తంగా వివరించారు. ఆయా మరణాల పై కలెక్టర్ వివరణ కోరారు. మాతృ మరణాల సంఖ్యను తగ్గించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై వైద్య అధికారులతో చర్చించారు. ఇక ముందు మాతృ మరణాల నివారణకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకునేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణీల ఆరోగ్యం పై ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇక పై ప్రతీ మూడు నెలలకు సమావేశం నిర్వహించాలని, కలెక్టర్ సూచించారు. అయితే ప్రసూతి మరణ నివేదిక అనేది ప్రసూతి మరణ సమీక్ష () నుండి వచ్చే గోప్య పత్రం, ఇది మరణం చుట్టూ ఉన్న పరిస్థితులను విశ్లేషిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్ తెలిపారు. ఇది మరణానికి గల కారణాలను, భవిష్యత్తులో ప్రసూతి మరణాలను నివారించడానికి నేర్చుకున్న పాఠాలను గుర్తించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అందరం సమిష్టిగా, సమన్వయంతో పని చేసి జిల్లాలో మాతృ మరణాలను పూర్తిగా తగ్గించేందుకు కృషి చేద్దామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్।। కె.మల్లికార్జున్, ఐ.ఎం.ఏ. జిల్లా చైర్మన్ డా।। మల్లికార్జున్, డిప్యూటీ డి ఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్।। శైలజ, పీవో ఎం హెచ్ ఎన్ డాక్టర్।। సుధేష్ణ, డీజీవోహెచ్ ఓడీ డాక్టర్।। అమిత కుమారి, అనస్థటిస్ట్ డాక్టర్।। తేజస్విని, జి.ఎంపీహెచ్ ఈవో గోవిందరాజు, 108 కో ఆర్డినేటర్ రాఘవేందర్, సూపర్ వైజర్ నర్మద, నర్సింగ్ అధికారిని, ఆయా పీహెచ్ సీల వైద్యులు, ఏఎన్ఎమ్ లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు, బాల్య వివాహాల నివారణపై కట్టుదిట్టమైన చర్యలు

కలెక్టర్ ఆదర్శ్ సురభి



**ప్రజాపక్షం/వనపర్తి :** జిల్లాలో వరి కోతలు ప్రారంభమైనందున ఐ.కె.పి సభ్యులకు కేటాయించిన అన్ని కొనుగోలు కేంద్రాలను రెండు రోజుల్లో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అవసరమైన తూకం యంత్రాలు తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్‌లు తదితర పరికరాలను మార్కెటింగ్ శాఖ నుండి తీసుకోవాలని సూచించారు. నియమ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని సేకరించాలని, అందుకు రైతులకు సైతం తేమ, తాలు విషయంలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా అరికట్టడానికి నవంబర్ 14న అన్ని మండల కేంద్రాల్లో మహిళా సంఘాల సభ్యులతో, గ్రామ పెద్దలు, కుల పెద్దలతో అవగాహన కార్యక్రమం చేపట్టాలని, బాల్య వివాహం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగే అవకాశం ఉంటే వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం ఇచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యాలయాల నుండి మధ్యలోనే చదువు మానేసిన అమ్మాయిల జాబితా ఇవ్వడం జరిగిందని, జాబితా ప్రకారం ఇళ్లకు వెళ్ళి అమ్మాయి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి విద్యాలయాల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎ.పి.యంలను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్లు కట్టుకోవడానికి మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని తద్వారా వారు అధిక వడ్డీకి రుణాలు తీసుకోకుండా తక్కువ వడ్డీతో బ్యాంకు రుణా లు పొంది ఇళ్లు నిర్మించుకుంటారని తెలియజేశారు. ఎక్కడైనా బ్యాంకర్లతో సమస్యలు ఉంటే సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. పి.డి.డి ఆర్డి ఉమాదేవి లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్ సహాయ లీడ్ బ్యాంక్ మేనేజర్ సాయి, డి.పి.యంలో, ఎ.పి.యంలు పాల్గొన్నారు.

**వర్షాల నేపథ్యంలో డెంగీ పరీక్షలు తప్పనిసరి**

జిల్లాలో వర్షాల ప్రభావం ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చే రోగులకు డెంగీ పరీక్షలు కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం గోపాల్‌పేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, అటెండెన్స్ వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. జిల్లాలో వర్షాల ప్రభావం ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చే రోగులకు డెంగీ పరీక్షలు కొనసాగించాలని ఆదేశించారు. అదేవిధంగా మలేరియా, డెంగీకి సంబంధించిన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో రూపొందించిన హెల్త్ యాప్‌లో టీబీ స్క్రీనింగ్, డయాబెటిస్ స్క్రీనింగ్‌కు సంబంధించిన రిపోర్టులను అప్లోడ్ చేయాలని ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, ప్రోగామ్ ఆఫీసర్ సాయినాథ్ రెడ్డి, వైద్యాధికారులు పరిమళ ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి :** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం చిట్యాల మార్కెట్ యార్డ్‌లో జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వెంటనే వరి ధాన్యం సంచిని తూకం చేసి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభు త్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే తెలియజేశారు. ప్రభుత్వం సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇస్తుందని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వరి ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులను నిర్వాహకులు సహకరించాలని సూచించారు. రైతులు పంట తెచ్చిన రోజు రిజిస్టర్లలో ఏ రోజు తెచ్చారు, తెచ్చినప్పుడు ఎంత తేమశాతం ఉంది అనే వివరాలను నమోదు చేసుకుని, సీరియల్ నెంబర్ల వారీగా కొనుగోలు చేసి పంపించాలన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే అక్కడే ఉన్న వరి ధాన్యం ఆరబెట్టే యంత్రాన్ని పరిశీలించి దానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఎమ్మెల్యే, కలెక్టర్‌ని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డిఆర్‌డిఓ ఉమాదేవి, మార్కెటింగ్ అధికారి స్వరన్ సింగ్, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## నేడు సిపిఐ సూర్యాపేట జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్** : నేడు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సిపిఐ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ ఎమ్మెల్సీ నెలికంటి సత్యంతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సిపిఐ జాతీయ కమిటి నిర్ణయాలను విస్తృత కౌన్సిల్ సమావేశంలో సభ్యులకు తెలియజేస్తారన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మహిళపై దాడి చేసిన వారికి శిక్ష ఖరారు

**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 2019 సంవత్సరంలో నమోదైన కేసులో నర్సాపురం గ్రామానికి చెందిన కవాటి మహేశ్, కవాటి నరేశ్, కవాటి శివ, ఎనుగుల ఉప్పలయ్య, జక్కుల రామకృష్ణ , కవాటి సుధర్శన్ అనే ఆరుగురు నిందితులు మహిళపై దాడి చేసి, గాయపరిచిన సంఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వలిగొండ ఎస్ఐ పి.శివనాగ ప్రసాద్, (ప్రస్తుతం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్,నాగోల్ పోలీస్ స్టేషన్) ఆధారాలను సేకరించి, సాక్ష్యాలతో కోర్టులో చార్జ్ సమర్పించారు. బుధవారం రామన్నపేట అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు, న్యాయమూర్తి యస్. శిరీష నిందితులందరినీ దోషులుగా నిర్ధారించి, ప్రతి ఒక్కరికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. ఈ కేసు విచారణలో ఏపీపీ పి.వెంకట అవినాష్ సమర్థంగా వాదించారు. కేసు విజయవంతంగా పూర్తికావడంలో సహకరించిన సిడిఓ ఏ.రామచారి వలిగొండ పోలీస్ సిబ్బందికి అభినందించారు. వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసే పనులకు మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు.

## 31 జిల్లా వ్యాప్తంగా ఎఐటియుసి ఆవిర్భావ వేడుకలు

సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈ నెల31న జిల్లా వ్యాప్తంగా ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అధ్యకతన నల్లగొండ మఖ్దూమ్ భవనంలో జరిగింది ఈ సమావేశంలో దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమం లో ఎఐటియుసి కీలక పాత్ర పోషించిన చరిత్ర ఘనమైనదన్నారు. మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించిన 29 చట్టాల ని 4 కోడ్ లుగా మార్చి హక్కులు లేకుండా చేసి యాజమాన్యంలకు తొత్తు లుగా చట్టాలు మార్పులు చేశారు అని ఆరోపించారు. దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అని నాటి నుండి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం నిరంతరం రాజిలేని సమరశీల పోరాటాలు నడుపుతుందన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు కోసం కనీస వేతనాలు అమలు కోసం ఉద్యోగ భద్రత కోసం రాబోయే కాలంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సయీద్,కేవిస్ రెడ్డి,సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు,దోటీ వెంకన్న,జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండె రవి,నాగరాజు, వి లెనిన్ పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ

**ప్రజాపక్షం/మోటకొండూరు** : మోంథా తుపాను ప్రభావంతో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన గత రెండు రోజులగా కురుస్తున్న బారీ వర్షాలకు వరి, పత్తి పంటలు చేతికి వచ్చే సమయంలో రైతులు బారీగా నష్ట పోతున్నారని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన బుధవారం మోటకొండూరు మండల కేంద్రంలో మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరిపొలాలు మొత్తం పడిపోయి, రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయివున్నారని, ప్రభుత్వం వెంటనే అధికారులతో సర్వే చేయించి, నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. పత్తి పంటలు వర్షాలకు పూర్తిగా తడిసి పోయిందని సిసిఐ ద్వారా ఎలాంటి షరతులు లేకుండా పత్తి కొనుగోల్లు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మండల వ్యవసాయాదికారులతో సర్వే చేయించి నష్టపోయిన పత్తి, వరి పంటల వివరాలు సేకరించి పరిహారం అందించాలని సత్యనారాయణ కోరారు.

## రైతులకు కన్నీటిని మిగిల్చిన 'మొంథా'




**ప్రజాపక్షం/చింతలపాలెం** : సూర్యాపేట జిల్లా ఉమ్మడి మండలాలైనటువంటి చింతలపాలెం, మేళ్లచెరువు మండల కేంద్రాల్లో సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములు నీరు సరిగ్గా అందకపోవడంతో ఇక్కడి ప్రాంత రైతులు ఎక్కువగా మెట్ట ప్రాంతం అయినటువంటి పత్తి, మిరప అత్యధికంగా సాగు చేయడం జరుగుతుంది. మరికొన్ని చోట్ల బోర్లకింద వరి నాట్లు వేయడం జరిగింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్నటువంటి భారీ వర్షాలు, తుఫాన్ దాటికి పత్తి ఏరివేసే సమయం ఆసన్నమైనప్పటికి వర్షాలు కురవడంతో రైతులు వెనుకబడటం జరిగింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలంలోని పత్తి రంగు మారటం, గింజలు మొలకలు రావడం జరుగుతుందని ఒకవేళ వర్షం తగ్గినాక ఏరించినా పత్తి కొనే పరిస్థితి ఉండదని కూలీ ఖర్చులు అధికంగా అవుతాయని, గిట్టుబాటు కూడా కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి కలెక్టర్లకు, ప్రభుత్వానికి చేరవేయాలని, ఒకవేళ ప్రభుత్వాలు ఆదుకోలేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు కన్నీటితో తమ బాధను వెలుబుచ్చుతున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రైతుల పక్షాన చొరవ తీసుకొని రైతులకు వెంటనే పంట నష్టం అంచనా వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు అందించాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

## పొట్టకూటి కోసం వస్తే ప్రాణం పోయింది

విద్యుత్ షాక్ తగిలి మృతి

నల్లగొండ ఉర్సు మేళాలో విషాదం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలో గత 20రోజులుగా నడుస్తున్న ఊర్సులో ఏక్ మాల్ ఐటమ్స్ అమ్ముకోవడానికి యుపి రాష్ట్రానికి చెందిన రియాజ్(25) వచ్చి వ్యాపారం చేసుకుంటు న్నారు. ఈ క్రమంలో మృతుడు రియాజ్ షాపులో కరెంటు కోసం పక్క షాపు నుంచి తీగ లాగి, టేప్ బదులు ప్లాస్టిక్ కవర్లు చుట్టాడు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల నీరు కవర్లలో చేరి, ఇనుప ర్యాకులకు కరెంట్ సరఫరా కావడంతో అది గమనించని రియాజ్ ర్యాక్ తాకగానే షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకొని వన్ టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడిని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# సూర్యాపేట జిల్లాలో పత్తి, వరి పంటలకు తీవ్రనష్టం


మొంథా తుపాన్‌తో విస్తారంగా వర్షాలు

చందంపేట మండలం చిత్రియాలలో పదుల సంఖ్యలో గొర్రెలు మృత్యువాత



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మొంథా తుపాన్‌తో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో చెరువులు, కుంటలు, లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. సూర్యాపేటతోపాటు కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజక వర్గాలలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో తుపాన్ ప్రభావంతో వీధులు జలమయంగా మారి మురుగు కాలువలు ఉప్పొంగిపోతున్నాయి. పలు చోట్ల రోడ్లు, వంతెనలపైకి నీరు రాగా గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలలోని ఇండ్లలోకి నీరు చేరాయి. తుఫాన్ ప్రభావంతో పత్తి, వరి పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలో బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఆయా ప్రాంతాలలో నమోదైన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. తుంగతుర్తి మండలంలో అత్యధికంగా 125.0 మీ.మీ. వర్షపాతం నమోదుకాగా, అతి స్వల్పంగా మునగాల మండలంలో 1.8 మీ.మీ. వర్షపాతం నమోదైంది. నాగారం మండలంలో 106.8 మీ.మీ., తిరుమలగిరి మండలంలో 105.5 మీ.మీ., అర్వపల్లి మండలంలో 99.3 మీ.మీ., నాగారం మండలంలో 90.3 మీ.మీ, సూర్యాపేట మండలంలో 89.8 మీ.మీ., మద్దిరాల మండలంలో 87.5 మీ.మీ, మోతె మండలంలో 61.5 మీ.మీ., చిలుకూరు మండలంలో 42.5 మీ.మీ., నూతనకల్ మండలంలో 24.0 మీ.మీ., కోదాడ మండలంలో 22.8 మీ.మీ., పెన్‌పహాడ్ మండలంలో 22.3 మీ.మీ., చివ్వెంల మండలంలో 20.0 మీ.మీ., ఆత్మకూర్(ఎస్) మండలంలో 16.5 మీ.మీ. వర్షపాతం నమోదైంది. పాలకీడు, గరిడేపల్లి మండల్లాలో 15.0 మీ.మీ., మేళ్లచెరువు మండలంలో 14.0 మీ.మీ., చింతలపాలెం మండలంలో 13.5 మీ.మీ., మట్టంపల్లి మండలంలో 9.8 మీ.మీ., నేరేడుచర్ల మండలంలో 6.3 మీ.మీ., హుజూర్‌నగర్, నడిగూడెం మండల్లాలో 2.0 మీ.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.





మోంతా తుఫాన్‌తో జిల్లాలో పత్తి, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా రైతులు పత్తి పంటను 91వేల ఎకరాలలో సాగు చేయగా, వరి పంటను 4 లక్షల 85 వేల 69 ఎకరాలలో సాగు చేశారు. పత్తి చేతికందిన సమయంలోనే వర్షాలు కురుస్తుండడంతో చెట్టు మీద ఉన్న పత్తి నేల రాలడంతోపాటు రంగు మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఇప్పటి వరకు మొదటి పంట మైల పత్తిని మాత్రమే తీశారు. మిగతా పత్తి అంతా పంట చేలలోనే ఉండిపోయింది. ఇదిలా ఉంటే వరి పంటకు కూడా అదే స్థాయిలో నష్టం వాటిల్లింది. బావులు, బోర్ల కింద వరి పంటను సాగు చేసిన రైతులు కొంతమంది పంటను కోసి నూర్పిడి చేయగా, మరి కొంత మంది పైరును కోసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇటీవల కాలంలో వరుసగా అకాల వర్షాలు కురవడం తోపాటు గత రెండు రోజులు నుండి మోంతా తుపాన్‌తో కురుస్తున్న వర్షాలతో పైరు నేలకు ఒరిగి కిందపడిపోయి గింజలు నేలరాలాయి. ఈ తుపాన్ ప్రభావం ఇలానే మరో 24 గంటలు కొనసాగితే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్న పరిస్థితి.

**ప్రజాపక్షం/చందంపేట** : మొంథా తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని వాగులు, వంకలు, చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండి అలుగు పొస్తున్నాయి. మంగళవారం రాత్రి నుండి కురిసిన భారీ వర్షానికి చిత్రియాల గ్రామంలో తుమ్మల వెంకటయ్యకు చెందిన గొర్రెలు పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డాయి.


హాలియాలో


భూదాన్‌పోచంపల్లి


కొండమల్లేపల్లిలో



# గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు యువతను చైతన్యం చేయాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపు

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఎంజాయి పేరుతో గంజాయి వద్దు నాటక కళా ప్రదర్శన



**ప్రజాపక్షం/నల్లగొండ** : అనేక ప్రజాద్యమాలకు కీలక పాత్ర పోషించిన యూనివర్సిటీ విద్యార్థులు సామాజిక రుగ్మతలకు మూల కారణమైన గంజాయి, డ్రగ్స్ నిర్మూలించేందుకు ప్రజలను,విద్యార్థి యువతను చైతన్యం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా నాట్యమండలి నేతృత్వంలో చేపట్టిన ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దు బస్సు కళా జాత బుధవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఒకసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని, ఆ వ్యవసం నుంచి బయటపడడం చాలా కష్టమని, వ్యసనాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఈ వ్యసనాలు ఆర్థిక విధ్వంసాన్ని సృష్టిస్తుందని, పర్యావరణానికి నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంలో అతి కొద్ది మంది సంపన్నులకే పరిమితమైన గంజా యి ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో కిరాణం షాపలలో చాక్లెట్ రూపంలో రావడం దురదృష్టకరమన్నారు. వీటి నిర్మూలనకు విస్తృతమైన ప్రచారం కోసం బస్సు కళాజాత చేపడుతున్న ప్రజా నాట్య మండలిని ఆయన అభినందించారు. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ సామాజిక రుగ్మతల రూపుమాపుటలో క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో,తెలంగాణ సాంస్కృతిక సలహా మండలి సభ్యులు,ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, రాష్ట్ర అధ్యక్షులు కె శ్రీనివాస్, ఎఐఎస్ఎఫ్ యూనివర్సిటీల కన్వీనర్ రెహమాన్, జిల్లా అధ్యక్షుడు ముదిగొండ మురళి కృష్ణ, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, ఎంజియూ అధ్యాపకులు డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి,డాక్టర్ అనిత కుమారి,డాక్టర్ ఆనంద్, డాక్టర్ ఏ మధు తదితర అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం డ్రగ్స్ బారిన పడు తున్న విద్యార్థులు ఆ కుటుంబ పరిస్థితులపైన ప్రదర్శించిన వీధి నాటకం విద్యార్థులను ఎంతో ఆకట్టుకున్నది.



## సాగర్ ప్రాజెక్టుకు భారీ వరద..

గంట గంటకూ పెరుగుతున్న వరద ఉద్ధృతి..

4గేట్లు ఐదు అడుగుల మేర పైకి లేపి నీరు విడుదల

**ప్రజాపక్షం/నందికొండ:** మొంథా తుఫాన్ కారణంగా ఎగువ ప్రాంతాలలో భారీగా వర్షాలు పడుతుండటంతో ఎగువ ప్రాజెక్టులనుంచి శ్రీశైలం కు భారీగా ఇన్ ఫ్లో వస్తున్న నేపథ్యంలో నాగార్జునసాగర్ వైపు 3 లక్షల క్యూసెక్కుల పైన నీటిని విడుదల చేస్తున్నారు. ఉదయం 11 గంటలకు 50 వేల క్యూసెక్కులుగా ఉన్న వరద ఒకేసారి 4 లక్షలకు పెరగడంతో ప్రాజెక్ట్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తూ గరిష్ట నీటిమట్టానికి చేరుకొని ఉండటంతో ప్రాజెక్టు అధికారులు సాయంత్రం ఏడు గంటల తరువాత నాలుగు క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేర పైకి లేపి 65077 క్యూసెక్కుల నీటిని దిగువ విడుదల చేస్తున్నారు. దీనితో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో గా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతూ ఉండగా కుడి ఎడమ కాలువల నుంచి ఎటువంటి నీటి విడుదల కొనసాగటం లేదు ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 589.60 అడుగులుగా ఉన్నది. వరద ఉధృతి ఇదేవిధంగా కొనసాగితే ఇంకా మరిన్ని గేట్లు తెరిచే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

# మైనర్ పిల్లలను అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరం

బేబీలను అక్రమ దత్తత చేసిన ఏడుగురు వ్యక్తులు అరెస్ట్.. రిమాండ్

జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ వెల్లడి




**ప్రజాపక్షం/నల్లగొండ** : మైనర్ పిల్లలను అమ్మడం, కొనడం, దత్తత తీసుకోవడం, మధ్యవర్తిత్వం వహించడం చట్టరీత్యతీవ్ర నేరం అని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డిడబ్ల్యుఓ, డిసిపిఓ,ఐసిడిఎస్ అధికారులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో రెండు రోజుల క్రితం 10 రోజుల బేబీని 21 రోజుల బాబును అక్రమంగా దత్తత చేసుకున్నారన్న విషయంలో వన్‌టౌన్,టు టౌన్ పోలీస్ స్టేషన్‌ల లో ఐసిడిఎస్ సూపర్వైజర్ సరస్వతి ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసుకొని విచారణ చేపట్టడం జరిగిందని తెలిపారు. అక్రమ దత్తత చేసిన ఏడుగురు వ్యక్తుల ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందని బేబీలను సురక్షితంగా రెస్క్యూ చేసి, శిశు గృహానికి అప్పగించి మధ్యవర్తిత్వం చేసిన డాక్టర్, మరొక వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు.అరెస్టు చేసిన వారి దగ్గర నుండి 20 వేల రూపాయల నగదు, ఏడు సెల్ ఫోన్లు, అగ్రిమెంట్ డాక్యుమెంట్ స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎ1 అయిన కుర్ర బాబుది సొంత ఊరు ఎల్లాపురం, తిరుమలగిరి సాగర్ మండలం ప్రస్తుత బిటిఎస్ నల్లగొండలో ఉంటున్నానని, తనకు పార్వతితో 11 ఏండ్ల క్రితం వివాహమై కూలి పని చేస్తూ, తాగుడుకు బానిసై, వివాహం అయిన దగ్గర నుండి కొడుకు కావాలని భార్యని వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో వారికి మొదట మగ పిల్లగాడు పుట్టి చనిపోగా,తర్వాత ఇద్దరు ఆడపిల్లలు పుట్టినాక మళ్లీ ఒక ఆడపిల్ల పుట్టి 2 సం.ల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. తిరిగి 15 రోజుల క్రితం బాబు పుడతాడు అనుకుని, హాలియాలోని నిర్మల హాస్పిటల్ లో పార్వతిని అడ్మిట్ చేయగా,మళ్ళీ ఆడపిల్ల పుట్టేసరికి ఆడపిల్లను సాకడం భారమవుతుందని అదే హాస్పిటల్ ఉక్రెయిన్‌లో ఎంబిబిఎస్ చేసి డ్యూటి డాక్టర్ గా పనిచేస్తున్న ఎ4 శాంతి ప్రియా అనే డాక్టర్ కి తెలియజేయగా తనకు తెలిసిన బంధువు సరస్వతి ద్వారా సాంబమూర్తి దంపతులకు పిల్లలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిసి ఏలూరుకు చెందిన ఎ 2 సాంబమూర్తి, ఎ 3 రజితలకు తెలియజేసి, ఈనెల 25నఈనెల నల్లగొండ బస్టాండ్ నల్లగొండ,రైల్వే స్టేషన్ పోవు దారి మధ్యలో రోడ్డు దగ్గరికి వచ్చి కుర్ర బాబు, అతని భార్య పార్వతి దగ్గర నుండి పాపను రెండు లక్షల 30 వేల రూపాయలకు దత్తత ఒప్పందం కుదుర్చుకొని, అడ్వాన్సుగా పదివేల రూపాయలను ఇచ్చి, పాప హెల్త్ చెకప్ లీగల్ ప్రాసెస్ పూర్తి చేసి మిగతా డబ్బులను ఇచ్చే విధంగా ఒక ఒప్పందంతో పాపను సాంబమూర్తి దంపతులు తీసుకొని వెళ్ళిపోయరని తెలిపారు.

## చట్టాలకు విలువనివ్వని వారు దేశద్రోహులు : మందకృష్ణ మాదిగ

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** సిజెఐ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా నవంబర్ 1న హైదరాబాదులో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో మహా నిరసన ప్రదర్శనచేపట్టడం జరుగుతుందని చేపట్టడం జరుగుతుందని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులపై ఇప్పటికి వివక్ష, అంటరానితనం, దాడులు, హత్యలు, హత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇవి నిత్యం సామాన్య ప్రజల మీద ఎక్కడో ఓ దిక్కు జరుగుతూనే ఉన్నాయని మీడియా ద్వారా చూస్తూనే ఉన్నామన్నారు. దేశ అత్యున్నత వ్యవస్థ సుప్రీం కోర్టు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ దళితుడైన గవాయ్ మీదనే సుప్రీం కోర్టులో బూటుతో దాడి జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనతో దేశం, ప్రపంచంలోనే ప్రజలు నివ్వెరపోయారన్నారు. దేశంలో దళితులకు ఇప్పటికీ రక్షణ లేదని స్పష్టంగా రుజువు అవుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవింద్ నరేష్ మాదిగ,ఎంఎస్ ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ, ఉద్యోగ సంఘం నాయకులు మల్లేపాక వెంకన్న, నాయకులు మేడి శంకర్, కొమిరే స్వామి,కూరపాటి కమలమ్మ, పోలే యాదయ్య పాల్గొన్నారు.








# నవంబర్ 21న ‘రాజు వెడ్స్ రాంబాయి’

అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా ‘రాజు వెడ్స్ రాంబాయి‘. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ‘రాజు వెడ్స్ రాంబాయి‘ చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ ఢ్స్ బ్యానర్స్ పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ 21న ‘రాజు వెడ్స్ రాంబాయి‘ సినిమాను వంశీ నందిపాటి ఎంటర్‌టైన్ మెంట్స్, బన్నీ వాస్ వరక్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ థియేట్రికల్ రిలీజ్ కు చేస్తున్నారు. ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించేందుకు హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ.. రాజు వెడ్స్ రాంబాయి సినిమా చూశాను. ఇది నా మనసుకు హత్తుకుంది. కొందరి లైఫ్‌లో జరిగిన ఘటనల ఆధారంగా ఈ సినిమా చేశారు. ఇది కాల్పనిక కథ అయితే మనం ఆ దర్శకుడి ఊహకు ఆశ్చర్యపోయేవాళ్లం. ఇలా ఎలా ఆలోంచించారు అనుకునేవాళ్లం. ఈ సినిమా చూసి బయటకు వచ్చే ప్రేక్షకులు ఒక ఎమోషనల్ ఫీల్ తో వస్తారు. అఖిల్ రాజు పాత్రలో బాగా నటించాడు. తేజస్విని తెలుగు అమ్మాయి. ఈ సినిమాలో తన స్క్రీన్ ప్రెజెన్స్, పర్ ఫార్మెన్స్‌తో ఆకట్టుకుంది. హీరో సిద్ధు జొన్నలగడ్డ బ్రదర్ చైతన్య ఒక మంచి రోల్ చేశాడు. అతనికి నటుడిగా మంచి పేరు తెచ్చే మూవీ అవుతుంది. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ఆయనతో పాటు ఈటీవీ విన్ వారికి మంచి విజయాన్ని అందించాలని కోరుకుంటున్నా.



# ఆయన నటనకు అభిమానిని

## ‘మాస్ జాతర’ ప్రీ రిలీజ్ వేడుకలో సూర్య

మాస్ మహారాజా రవితేజ తాజా చిత్రం ‘మాస్ జాతర’. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రవితేజ, శ్రీలీల, నవీన్ చంద్ర ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. 31న సాయంత్రం ప్రత్యేక ప్రదర్శనలతో థియేటర్లలో అడుగుపెట్టనున్న ‘మాస్ జాతర’ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు.ఈ వేడుకకు తమిళ అగ్ర కథానాయకుడు సూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సూర్య మాట్లాడుతూ.. రవితేజతో నాది 20 ఏళ్ళ అనుబంధం. తెరపై ఒక కామన్ మ్యాన్‌ని కింగ్ సైజ్‌లో సహజంగా చూపించాలంటే అది రవితేజకే సాధ్యమవుతుంది.ఇడియట్, కిక్ సహా రవితేజ నటించిన పలు సినిమాలు తమిళ్ లోనూ మంచి ఆదరణ పొందాయి. విక్రమార్కుడు రీమేక్ నా సోదరుడు కార్తీ కెరీర్‌కి టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. రవితేజలా వినోదాన్ని పంచే వాళ్ళు అరుదుగా ఉంటారు. రజినీ కాంత్ , అమితాబ్ బచ్చన్ ఎలాగైతే వినోదాన్ని పంచగలరో రవితేజ కూడా అలాగే అలరిస్తారు. రవితేజ ఇలాగే వినోదాన్ని పంచుతూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. రేపు మాస్ జాతర రూపంలో రవితేజ జాతర చూడబోతున్నాం. 31 విడుదలవుతున్న మాస్ జాతర సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటూ, ‘టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్.’ అన్నారు. రవితేజ మాట్లాడుతూ.. శివుడు పాత్ర చేసిన నవీన్ గురించి మాట్లాడాలి. నవీన్ ఇలా కూడా చేయగలడా అని ఆశ్చర్యపోయేలా చేశాడు. నటుడిగా ఈ సినిమాతో మరో స్థాయికి వెళ్ళాలని కోరుకుంటున్నాను. సినిమా విడుదలయ్యాక శివుడు పాత్ర గురించి మాట్లాడుకుంటారు. రాజా ది గ్రేట్ తర్వాత రాజేంద్ర ప్రసాద్ తో కలిసి నటించాను. రాజేంద్ర ప్రసాద్ పాత్ర అద్భుతంగా ఉంటుంది. మా కాంబినేషన్ ని ప్రేక్షకులు మళ్ళీ మళ్ళీ కోరుకుంటారని అనుకుంటున్నాను. నాది, శ్రీలీలది సూపర్ హిట్ జోడి. ఈ సినిమాలో కొత్త శ్రీలీలను చూడబోతున్నారు. ఫుల్ మాస్ పాత్ర చేసింది. గెస్ట్‌గా విచ్చేసిన సూర్యకి థాంక్యూ సో మచ్. మాస్ జాతర చిత్రం ఖచ్చితంగా బాగుంటుందని నమ్ముతున్నాను అని అన్నారు. కథానాయిక శ్రీలీల మాట్లాడుతూ.. ‘పెళ్లి సందడి విడుదలకు ముందు రవితేజతో ధమాకా సినిమా చేశాను. ధమాకా తర్వాత మళ్ళీ ఆయనతో కలిసి నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. రవితేజ ఎప్పుడు హుషారుగా ఉంటారు. ఎంత బాధ ఉన్నా పైకి నవ్వుతూ ఉండటం రవితేజని చూసి నేర్చుకోవచ్చు అన్నారు. నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ‘అన్ని మసాలాలు సరిగ్గా ఉన్న మాస్ సినిమా ఈ మధ్య కాలంలో రాలేదు. ఆ లోటుని తీర్చే సినిమా ఈ మాస్ జాతర. ఈ చిత్రం చూసి మీరందరూ ఆశ్చర్యపోతారు. ఇప్పటిదాకా ఎందరో హీరోలతో కలిసి నటించాను. కానీ, రవితేజతో నటించలేదు. ’మాస్ జాతర’ లాంటి మంచి సినిమా చేయాలనే ఇంత సమయం పట్టినట్టుంది. దర్శకుడు భాను అద్భుతమైన సినిమాని రూపొందించాడు అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు నవీన్ చంద్ర , నిర్మాత సూర్యదేవర నాగవంశీ ,దర్శకుడు భాను భోగవరపు, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో దర్శకులు శివ నిర్వాణ, రామ్ అబ్బరాజు, ఛాయాగ్రాహకుడు విధు అయ్యన్న, కళా దర్శకుడు శ్రీ నాగేంద్ర తంగాల తదితరులు పాల్గొన్నారు.

# ఘట్టమనేని వారసురాలు హీరోయిన్‌గా ఎంట్రీ




సూపర్‌స్టార్ కృష్ణ ఘట్టమనేని వారసత్వం తెలుగు సినీ పరిశ్రమలో విశిష్టమైనది. ఇప్పుడు ఘట్టమనేని లెగసీ నుంచి తొలిసారిగా హీరోయిన్‌గా వెలుగులోకి వచ్చింది. జాన్వి ఘట్టమనేని. ఆమె తన తాత కృష్ణ గ్రేస్, తన మామ మహేష్ బాబు మాగ్నటిజం, తల్లి మంజుల ఘట్టమనేని ఆత్మీయతను తనలో కలుపుకుని గొప్ప వ్యక్తిత్వంగా రూపుదిద్దుకుంది. జాన్వి ఘట్టమనేని క్లాసిక్ బ్యూటీ. ఇటీవల వెలుగుచూసిన ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన తెచ్చుకున్నాయి. ఇండస్ట్రీ వర్గాలు ఆమెను ఇటీవలి తెరపై కనిపించే అత్యంత అందమైన అమ్మాయి’గా అభివర్ణిస్తున్నాయి. జాన్వి ఎటువంటి హడావుడి లేకుండా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. కొన్ని ఫొటోలు, కొన్ని టెస్ట్ రీల్స్ ద్వారానే తన చార్మ్ చూపించింది. దర్శకులు ఆమె నటనను చూసి మాటల కన్నా కళ్ళతోనే భావాలను చెప్పగల సహజ నటిగా వర్ణించారు.ఆమె ప్రతిభతో పాటు క్రమశిక్షణ కూడా ప్రత్యేకం. పెయింటింగ్, డ్యాన్స్, ఫిట్నెస్, డ్రైవింగ్, గేమింగ్ ప్రతి విషయంలోనూ సమాన ఆసక్తి చూపిస్తుంది. జిమ్లో ట్రైనింగ్‌తో మొదలై తన డే, నైట్ తన ఆర్ట్ కార్నర్లో ముగుస్తుంది. కొత్తగా సినీ రంగంలోకి వచ్చే వాళ్లు సాధారణంగా ఒకే గుణంతో గుర్తింపుపొందుతారు. కానీ జాన్వి ఘట్టమనేని మాత్రం అందం, మాధుర్యం, ప్రతిభ, వారసత్వం.. ఈ నాలుగింటినీ కలగలిపిన ప్రత్యేక వ్యక్తిత్వం. బ్రాండ్ నిపుణులు ఆమెను దక్షిణాది శైలి, పాన్‌ఇండియా అప్పీల్ కలిగిన పేస్ అని పేర్కొంటున్నారు. సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు కుటుంబం నుండి వస్తున్న జాన్వి ఎంట్రీ త్వరలోనే జరుగనుంది. జాన్వి సంప్రదాయ లుక్ నుంచి మోడరన్ గ్లామర్ వరకు సునాయాసంగా మెరిసిపోతుంది. ఇంకా సినిమా రిలీజ్ కాక ముందే ఆమెకు గుర్తింపు వచ్చేసింది. ఒక అద్భుతమైన జ్యువెలరీ క్యాంపెయిన్ తర్వాత, జాతీయ స్థాయి బ్రాండ్లు, దర్శకులు ఆమెను సంప్రదించారు. మంజులకి ఇది ప్రత్యేకమైన క్షణం. ఎన్నేళ్ల క్రితం ఆమెకూ నటనపై కలలు ఉండేవి, కానీ ఆ కాలం మహిళలకు అంత అనుకూలంగా ఉండేది కాదు. ఇప్పుడు మాత్రం ప్రపంచం సిద్ధంగా ఉంది, ప్రేమతో ఉంది, ఎదురు చూస్తోంది. నన్ను అడ్డుకున్న వారే ఇప్పుడు జాన్వి కోసం ప్రార్థిస్తున్నారు. జాన్వి చిరునవ్వు నా ప్రార్థనలకు సమాధానం అన్నారు మంజుల.

# మార్చి 19న ‘డకాయిట్’ రిలీజ్



అడివి శేష్ తాజాగా నటిస్తున్న సినిమా ’డకాయిట్’. ప్రేమ ప్రతీకార కథనం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు.తాజాగా డకాయిట్ రిలీజ్ డేట్ అప్డేట్ ఇచ్చారు. 2026 ఉగాది కానుకగా మార్చి 19న ఈ సినిమా విడుదల కానుంది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన ఫైర్ గ్లింప్స్ ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో ఆకట్టుకుంది. నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేసింది. విజువల్‌గా ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న తొలి తెలుగు చిత్రం డకాయిట్ కావడం విశేషం.అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ భారీ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాత. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు.

# ‘ఓహ్ కాదలే’ పాట విడుదల



ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించిన ‘తేరే ఇష్క్ మే’ చిత్రంలోని మొదటి తమిళ పాట ‘ఓ కాదలే’ ను విడుదల చేశారు. ఏఆర్ రెహమాన్ స్వరపరచిన ఈ పాటను ఆదిత్య ఆర్కే పాడిన ఈ పాటకు మషోక్ రెహమాన్ సాహిత్యాన్ని అందించారు. ధనుష్ , కృతి సనన్ ఇందులో హీరో హీరోయిన్ లుగా నటిస్తున్నారు. ఇద్దరి పై సాగే ఈ పాట కోసం ఏ ఆర్ రెహ్మాన్, ఆదిత్య ఆర్కే, మశోక్ రెహ్మాన్ కలిసి పని చేయడం విశేషం. ‘తేరే ఇష్క్ మే’ చిత్రాన్ని ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ నిర్మించారు. మరియు భూషణ్ కుమార్ మరియు క్రిషన్ కుమార్ కలిసి నిర్మించారు. గుల్షన్ కుమార్, టిసిరీస్ మరియు కలర్ యెల్లో సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించారు, శర్మ, నీరజ్ యాదవ్ స్క్రీన్ ప్లే రాశారు. అజయ్ దేవగన్ మరో కీలక పాత్రలో నటించిన ఈ చిత్రం నవంబర్ 28న ప్రపంచవ్యాప్తంగా తమిళం హిందీ భాషలలో విడుదల కానుంది.

# ‘ఆర్యన్’ సినిమా విడుదల వాయిదా



విష్ణు విశాల్ హీరోగా నటించిన తాజా థ్రిల్లర్ ‘ఆర్యన్’, ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అక్టోబర్ 31న విడుదల చేయాలని ముందుగా అనుకున్న ఈ సినిమా నవంబర్ 7కి వాయిదా పడింది. అయితే, తమిళ వెర్షన్ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 31న విడుదల కానుంది. శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి, మేకర్స్ రెగ్యులర్ అప్డేట్లతో అలరిస్తున్నారు. టీజర్, ట్రైలర్, ఫస్ట్ సింగిల్ అద్భుతమైన స్పందనను పొంది సినిమాపై భారీ అంచనాలను పెంచాయి.వాయిదాకు గల కారణాలను స్పష్టం చేస్తూ విష్ణు విశాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు రెండు స్ట్రెయిట్ సినిమాలు ఈనెల 31న విడుదల అవుతున్న సందర్భంగా ఈ తమిళ డబ్బింగ్ సినిమా విడుదల వాయిదా వేశారు.

# సమీక్షిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

జరిపారు. ‘పిఎం శ్రీ’ పథకంలో కేరళ రాష్ట్రం చేరడానికి వ్యతిరేకంగా సిపిఐకి చెందిన రాష్ట్రస్థాయీ, జాతీయస్థాయీ నాయకత్వం చాలా గట్టి వైఖరి అవలంబించడంతో ముఖ్యమంత్రి విజయన్ స్వయంగా ఈ విషయంలో జోక్యం చేసుకున్నప్పటికీ కూడా ప్రతిష్ఠంభన తొలగిపోలేదు.

**ఇది వామపక్ష ఐక్యతకు విజయం : బినోయ్ విశ్వం**

ఎంపిక చేసిన స్కూళ్ళల్లో జాతీయ విద్యావిధానాన్ని అమలు చేసేందుకు ఉద్దేశించిన ‘పిఎం శ్రీ’ పథకం అమలుపై సమీక్ష చేయాలని కేరళ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వామపక్ష ఐక్యతకు విజయంగా ఆ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి, మాజీ ఎంపి బినోయ్ విశ్వం పేర్కొన్నారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఉద్దేశించిన తదుపరి ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసింది. రాష్ట్రంలోని స్కూళ్ళల్లో పథకాన్ని అమలు చేయాలా? వద్దా? అనే విషయంపై సమీక్ష చేసేందుకు ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి విజయన్ చెప్పారు. ఈ నివేదిక వచ్చేవరకూ ఈ పథకం అమలు నిలిపివేస్తారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంపై బినోయ్ విశ్వం బుధవారం స్పందిస్తూ, ఈ విజయం వామపక్షాల ఐక్యతకు విజయమని, వామపక్ష సైద్ధాంతిక, రాజకీయ విజయమని అన్నారు. ఈ విజయాన్ని సిపిఐకి ఆపాదించవచ్చా అని చాలా మంది తనను అడిగారని, కానీ దీనిని విజయమా? విజయం కాదా? అనే కొలమానాల పరిధిలోకి చూడాలని పార్టీ కోరుకోవడంలేదని, ఒకవేళ అలా అనుకుంటే ఇది వామపక్షాల ఐక్యతకు, వామపక్ష సైద్ధాంతిక,రాజకీయాలకు లభించిన విజయం అవుతుందని బినోయ్ విశ్వం చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2020లో తీసుకువచ్చిన జాతీయ విద్యావిధానాన్ని వామపక్షాలు మొదటినుండీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కానీ దీనిని అమలు చేసేందుకు పిఎం శ్రీ కింద ముద్రవేసి కొన్ని స్కూళ్ళల్లో అమలు చేసేందుకు కేరళ ప్రభుత్వం తన అంగీకారాన్ని తెలియజేయడాన్ని వామపక్ష సంఘటనలో ఉన్న ప్రధాన భాగస్వామ్యపార్టీ సిపిఐ గట్టిగా వ్యతిరేకించింది. దీంతో ఎల్‌డిఎఫ్ కూటమిలో ఉన్న పార్టీలన్నీ ఏకాభిప్రాయానికి రావడం ద్వారా పిఎం శ్రీ అమలుపై సమీక్షకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

# నేడు ట్రంప్-జిన్‌పింగ్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

డోనాల్డ్ ట్రంప్ బుధవారం ఎఫ్–16 యుద్ధ విమానాల సంరక్షణలో ఉదయం 11.40 గంటలకు దక్షిణ కొరియా ఆగ్నేయప్రాంత నగరం బుసాన్‌లోని గిమ్హే విమానాశ్రయంలో దిగారు. ఈ సందర్భంగా ట్రంప్‌కు 21 సార్లు తుపాకులు పేల్చి కొరియా ప్రభుత్వం రెడ్ కార్పెట్‌తో ఘన స్వాగతం పలికింది. విదేశాంగమంత్రి చో హ్యూన్, ఉపమంత్రి కిమ్ జిన్‌లు ట్రంప్‌కు స్వాగతం పలికారు. అనంతరం బుధవారం మధ్యాహ్నం జియోంగ్జులో దక్షిణ కొరియా దేశాధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో ట్రంప్ ద్వైపాక్షిక సమావేశం జరిపారు. రెండు దేశాల ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన విషయాలను చర్చించారు. రెండు దేశాల నాయకులూ టారిఫ్‌లు, వాణిజ్య సంబంధాలే ప్రధానంగా చర్చించారు. గతంలో రెండు దేశాలమధ్యా పరస్పర టారిఫ్‌లు 25 శాతంగా ఉండేవి. కానీ ఇప్పుడు ఈ టారిఫ్‌లను 15 శాతానికి తగ్గించుకుంటామని, ముందుగా నిర్దేశించుకున్నవిధంగా ఈ టారిఫ్‌లను తగ్గించుకుంటామని అధ్యక్షుడి సహాయకుడు కిమ్ యోంగ్ బియోమ్ చెప్పారు. అమెరికాలో 350 బిలియన్ డాలర్లను దక్షిణ కొరియా పెట్టుబడిగా పెడుతుందని కూడా ఆయన చెప్పారు.

# తూర్పు లద్ధాఖ్ సరిహద్దుల్లో శాంతికి భారత్-చైనా కమాండర్స్ అంగీకారం

**న్యూఢిల్లీ:** తూర్పు లద్ధాఖ్‌లో వాస్తవాధీన రేఖ (ఎల్ఎసి) వెంట శాంతి–స్థిరత్వం కొనసాగించేలా చర్యలు తీసుకునేందుకు ఉన్నతస్థాయీ సైనికాధికారుల చర్చల్లో భారత్–చైనా దేశాలు అంగీకరించాయి. రెండు దేశాల సైన్యాలూ కమాండర్స్ స్థాయిలో అక్టోబరు 25వ తేదీన 23వ విడత సమావేశమై ఈ మేరకు అంగీకరించాయి. భారత్ వైపు మోల్డో–ఛుశూల్ సరిహద్దు కేంద్రం వద్ద ఈ సమావేశం జరిగింది. రెండు దేశాలకు చెందిన ప్రత్యేక ప్రతినిధులు అంటే భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ గడచిన ఆగస్టు నెలలో సమావేశమైన తర్వాత ఇరు సైన్యాలస్థాయిలో చర్చలు జరగడం ఇదే మొదటిసారి. చర్చలు స్నేహపూర్వక వాతావరణంలో జరిగాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనో బుధవారం తెలియజేసింది. గత ఏడాది అక్టోబరులో రెండు దేశాల సైన్యాల మాండర్స్‌స్థాయిలో 22వ విడత సమావేశం జరిగినప్పటినుండీ రెండు వైపులా పరిస్థితుల్లో మంచి పురోగతి వచ్చింది. శాంతి, స్థిరత్వాలకు సంబంధించిన అభిప్రాయాలను రెండు దేశాల ప్రతినిధులు ఇచ్చిపుచ్చుకుంటున్నారు. సరిహద్దు ప్రాంతంలో ఇదే విధానం కొనసాగించాలనివారు నిర్ణయించారు. ‘ఈ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించుకోవడానికి ప్రస్తుతం అమలులో ఉన్న యంత్రాంగాలనే ఉపయోగించుకుని వాటి ద్వారానే పరిష్కారాలు చేసుకోవాలని రెండు వైపులా సైన్యాల ఉన్నతస్థాయీ అధికారులు అంగీకరించారు’ అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రకటన పేర్కొంది. గడచిన కొద్ది నెలలుగా రెండు దేశాల మధ్యా పరిస్థితులను సాధారణీకరించేందుకు వరుస చొరవ చర్యలు కొనసాగుతున్నాయి. తూర్పు లద్ధాఖ్ సరిహద్దుల్లో నాలగు సంవత్సరాలుగా రెండు దేశాల సైన్యాలూ మోహరించి ఉన్నాయి. ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. గత ఏడాది అక్టోబరు నెలలో ఈ ఉద్రిక్తతలకు తెరపడే చర్యలు ప్రారంభమయ్యాయి. రెండు దేశాలకు చెందిన సైన్యాలూ డెమ్చోక్, దెప్సాంగ్ ప్రాంతాల నుండి చాలా విజయవంతంగా వెనక్కు మళ్ళడం ద్వారా ఉద్రిక్తతలు సడలిపోయాయి. చైనా తరఫున ఆ దేశ ప్రత్యేక ప్రతినిధి, విదేశాంగమంత్రి వాంగ్ యీ ఈ ఏడాది ఆగస్టు 19వ తేదీన భారత్‌లో పర్యటించారు. రెండుదేశాలు శాంతి, స్థిరత్వం సాధించేందుకు వరుసగా అనేక చర్యలకు శ్రీకారం చుట్టాయి. సహకాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు వారు అంగీకరించారు. రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధులమధ్యా 24వ విడత సమావేశం తర్వాత పశ్చిమ రంగంలో జనరల్ లెవెల్ మెకానిజంలో సంభాషణలు జరగడం ఇదే మొదటిసారి అని విదేశాంగశాఖ ప్రకటించింది. ప్రస్తుతం లద్ధాఖ్ రీజియన్‌లో వాస్తవాధీన రేఖ వెంబడి 50,000 నుండి 60,000 వరకూ సైన్యాలు మోహరించి ఉన్నాయి. 2020 మే నెలలో రెండు దేశాల సైన్యాలమధ్యా ఘర్షణలు జరిగాయి. అప్పటినుండీ నాలుగేళ్ళు ఈ ఉద్రిక్తతలు కొనసాగాయి.

**ఏడాదికాలంగా స్థిరమైన సంబంధాలు: చైనా ప్రకటన**

అదేవిధంగా చైనా జాతీయ రక్షణ మంత్రిత్వశాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. చైనా–భారత్ సరిహద్దుల్లోని వెస్టర్న్ సెక్టర్‌ను ప్రశాంతంగా ఉంచడానికి ఇరువైపులా జనరల్స్ స్థాయీ సమావేశంలో చాలా లోతుగా, సానుకూలంగా సంభాషణలు జరిగాయని పేర్కొంది. రెండు దేశాల నాయకులు ముఖ్యమైన సమావేశం నిర్వహించిన తర్వాత వారి మార్గదర్శకత్వంలో ఈ సంభాషణలు జరిగాయని పేర్కొంది. సైనిక, దౌత్యస్థాయీ మార్గాలలో రెండు దేశాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటూ సంభాషణలు జరపాలని, శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించేందుకు చర్యలు ముందుకు తీసుకువెళ్ళాలని నిర్ణయించినట్లు తెలిపింది. ఏడాది కాలంగా రెండు దేశాలమధ్య స్థిరమైన సంబంధాలు కొనసాగుతున్నాయని ప్రకటించింది. భారతదేశం ఐదు సంవత్సరాల తర్వాత గడచిన ఆదివారం మొదటిసారి చైనా ప్రధాన భూభాగానికి విమానాల రాకపోకలను కూడా పునరుద్ధరించినట్లు భారత అధికారులను ఉటంకిస్తూ ప్రకటన గుర్తుచేసింది. రెండు దేశాలమధ్యా 2020 ప్రారంభం వరకూ విమానాల రాకపోకలు కొనసాగాయి. కరోనా మహమ్మారి కారణంగా ఈ రాకపోకలు నిలిచిపోయాయి.

# ఉద్యోగులకు అన్యాయమే

(మొదటి పేజీ తరువాయి)

ఉండడమంటే, ఇది వారికి అన్యాయమే అవుతుందని అన్నారు.

**పరిశీలనాంశాలు ఇంత కఠినమా?**

ఎనిమిదవ కేంద్ర వేతన సంఘానికి ప్రభుత్వం సూచించిన పరిశీలన అంశాలు చాలా కఠినంగా ఉండటంతో సిఫార్సులను ఖరారు చేసేందుకు అనేక ఒత్తిళ్ళు ఉంటాయని అమర్‌జీత్ కౌర్ అన్నారు. పరిశీలన అంశాలన్నీ ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక భవిష్యత్తు, అభివృద్ధి వ్యయం, సంక్షేమ చర్యలకు తగిన వనరులను నిర్ధారించడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకోవాలని సిపిసికి సూచిస్తున్నాయని, అన్నికంటే ఘోరమేమిటంటే నాన్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం కోసం నిధుల లేని ఖర్చు గురించి సూచించాలని పేర్కొందని విమర్శించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఏదైనా ప్రయోజనం కల్పించేటప్పుడు మాత్రమే ప్రభుత్వానికి ఇవన్నీ గుర్తుకు వస్తాయని, కార్పొరేట్లు జాతీయ బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలకు రాయితీలు,సహాయాలు ఇవ్వడం, రద్దు చేయడంలో లేదా కార్పొరేట్లపై పన్ను రేట్లను తగ్గించడంలో మోదీ ప్రభుత్వానికి ఇలాంటి ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక భవిష్యత్తుం మొదలైన వాటిని ఎప్పుడూ పరిగణించబోదని మండిపడ్డారు.

**కుటుంబం అంటే 3 కాదు.. ఐదు..**

ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఉన్నప్పటికీ విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన 8వ కేంద్ర వేతన సంఘం మూడు యూనిట్లు కాకుండా ఐదు యూనిట్లు ఉన్న కుటుంబానికి అవసర ఆధారిత కనీస వేతనాన్ని నిష్పాక్షికంగా అధ్యయనం చేసి సిఫార్సు చేయాల్సిన బాధ్యత ఉందని అమర్‌జీత్ కౌర్ విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ రక్షణ చట్టం లేదా తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ సంక్షేమ చట్టం–2007 ప్రకారం వృద్ధాప్య తల్లిదండ్రుల ఆలనాపాలన పిల్లల చట్టపరమైన బాధ్యత అని, కాబట్టి తల్లిదండ్రులు కుటుంబంలో భాగమే అనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రస్తుత జీవిత అవసరాలు, సమాచార సాంకేతికతపై ఖర్చు, పిల్లల విద్య, ఆరోగ్య సంరక్షణపై ఖర్చు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకోవాలని, ఎందుకంటే ప్రస్తుత ప్రభుత్వం వీటన్నిటినీ ప్రైవేటీకరించిందన్నారు. వివిధ పోటీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ ఉద్యోగులు మంచి గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి 8వ సిపిసి కనీస వేతనాన్ని సిఫార్సు చేయాలని అన్నారు.

**పెన్షన్‌లో వివక్షత వద్దు**

2026 జనవరి ఒకటవ తేదీకి ముందు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు 2026 జనవరి 1వ తేదీ నుండి పెన్షన్ సవరణకు సంబంధించి ఆందోళనకరమైన విషయాన్ని సిపిసి పరిగణలోకి తీసుకోవాలని అమె సూచించారు. భవిష్యత్తు, పాత పెన్షనర్ల మధ్య వివక్ష చూపడానికి సిసిఎస్ (పెన్షన్) నియమాలు– 1972 (ఇప్పుడు 2021) చట్టం ద్వారా ప్రభుత్వం తీసుకున్న ధృవీకరణ కారణంగా వారు నష్టపోతారని తెలిపారు. గతంలో మాదిరిగానే వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా 2026 జనవరి 1వ తేదీ నుండి పనిచేస్తున్న ఉద్యోగులతో సమానంగా పెన్షన్ సవరణకు సిఫార్సు చేయాలని ఎనిమిదవ సిపిసి ప్రభుత్వాన్ని కోరాలని అన్నారు. అలాగే ఎన్‌పిఎస్‌లో ఉన్న 24 లక్షలకు పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 2004 జనవరి 1వ తేదీ నుండి తమను నాన్‌కంట్రిబ్యూటరీ వృద్ధాప్య పెన్షన్ పథకానికి తరలించాలనే న్యాయమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవడం కేంద్ర వేతన సంఘం బాధ్యత అని పేర్కొన్నారు.



**ఐక్యంగా వ్యవహరించాలి**

ఎనిమిదవ కేంద్ర వేతన సంఘం ముందు తమ డిమాండ్లను సమర్పించడానికి, న్యాయం పొందడానికి అన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఐక్యంగా తమ వ్యూహాన్ని సిద్ధం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. సిపిసి నుంచి గౌరవప్రదమైన, సహేతుకమైన వ్యవహారాన్ని ఆశించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల జరిపే పోరాటంలో ఎఐటియుసి గతంలో లాగానే వారితో భుజం భుజం కలిపి నిలబడుతుందని అమర్‌జీత్ కౌర్ స్పష్టం చేశారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com